Pubilshed from Ananthapuramu
PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 03 Vol.No : 03 | సంచిక : 270 Issue No : 270 | గురువారం Thursday | మే 21, 2026 21 MAY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-
Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## నార్వేలోనూ మౌనమే !

నార్వే : దేశంలోనే కాదు, విదేశాల్లోనూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ మీడియా ముందుకు రావడం లేదు. వచ్చనా మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇవ్వడం లేదు. తాజాగా నార్వే పర్యటనలోనూ అది మరోమారు స్పష్టమైంది. నార్వే పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధాని జోనాస్ గార్ స్టోర్ కలిసి మీడియా ముందుకు వచ్చారు. ఇటువంటి కార్యక్రమాల్లో పాత్రికేయులు సహజంగానే ప్రశ్నలు వేస్తారు. అయితే మోడీ పర్యటనలో దీనికి భిన్నంగా జరిగింది. నేతలిద్దరూ మీడియా ముందు కరచాలనం చేసుకుని, ఫోటోలకి ఫోజు ఇచ్చిన తరువాత ప్రధాని మోడీ వేదికమీద నుండి వెళ్లిపోవడానికి ప్రయత్నించారు.

- మిగతా 2లో..

## సమాచారశాఖలో సరి కొత్త మార్పు

# సాధ్యమా...

- సమాచార శాఖ డైరెక్టర్ డైనమిక్ నే..!
- విరామమెరుగడు కెఎస్ విశ్వనాథన్..
- విశాఖ గూగుల్ కావచ్చు..
- అమరావతి క్వాంటం కావచ్చు..
- సీఐఐ సమ్మిట్ కార్యక్రమంలో కూడాను..
- కూటమి ప్రభుత్వం లో కీలకమైన పాత్ర పోషిస్తూ..
- ముఖ్యమంత్రి ఉద్దేశ్యాన్ని ముందస్తుగా గమనిస్తూ..
- శాఖను పరుగులు పెట్టించాలని పదే పదే ప్రణాళికలు సిద్ధం చేస్తూ..
- ప్రతి అడుగు ప్రభుత్వ ప్రగతినివేదికలు ప్రజల్లో కి అందించేకు..
- పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతూ..
- పటిష్ఠ కార్యాచరణ దిశగా అడుగులు వేస్తూ..వేయిస్తూ..
- మీడియా మెనేజ్మెంట్ మంచిగా నిర్వహిస్తూ..
- ముందుకు సాగుతున్నప్పటికి..
- శాఖలో లోపాలు ఉన్నా..సహనంతో సర్దుబాటు అయ్యేలా చూస్తూ..
- ఆనాధిగా అలవాటు పడ్డ అలసత్వపు సిబ్బంది పై ఆగ్రహం వచ్చినా..
- పనిని ఆదమరిస్తే ఒప్పుకొని తత్వంతో
- నిక్కచ్చిగా, ముక్కుసూటిగా సిబ్బందిని మందలిస్తూ..
- అలసట అలసత్వం ఎరుగక..
- తాను పనిచేస్తూ పనిచేయిస్తూ.. పరుగులు తీస్తూ..తీయిస్తూ...
- పత్రికా సమస్యలపై సానుకుల దృక్పథంతో..
- నిజాయితీ,నిబద్ధతతో నడుస్తూనే..
- ముఖ్యమంత్రి ఆశయం కోసం అహర్నిశలు కృషి చేస్తూ...
- విశ్వనాధన్ పనితీరే వేరయా.!




(రామమోహన్ రెడ్డి)

ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, ప్రకటనలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను మీడియా మాధ్యమాల ద్వారా ప్రజలకు చేరువ చేయడం,: ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందనలు, ప్రజాభిప్రాయాలను మరియు పత్రికల్లో వచ్చే వార్తలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి నివేదించడం,సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విధానాలపై అవగాహన కల్పించడమే సమాచార శాఖ ముఖ్య ఉద్దేశ్యం.ఈ శాఖ ప్రతి రాష్ట్రంలోనూ సచివాలయం (రాజధాని) కేంద్రంగా రాష్ట్ర స్థాయి డైరెక్టరేట్ కార్యాలయాన్ని, అలాగే ప్రతి జిల్లాలో జిల్లా సమాచార మరియు పౌర సంబంధాల అధికారి కార్యాలయాలను కలిగి ఉంటుంది.సీనియారిటీ ని బట్టి సమాచార శాఖ కమిషనర్ అంటారు .లేదా యువ ఐఏఎస్ లయితే డైరెక్టర్ గా పిలువ బడతారు.

2 పేజీలో..



ప్రస్తుతం యువ ఐఏఎస్ అధికారి కెన్ విశ్వనాథన్ సమాచార శాఖ డైరెక్టర్ గా కొనసాగుతున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో సమాచార శాఖ లో సరికొత్త మార్పుకు సాధ్యమా అన్న చర్చ బాగా జరుగుతోంది. ఎందుకీ చర్చ ఎవరిదీ తప్పిదం... ఎవరిది ఒప్పిదం అన్న విషయలలోకి వస్తే...సమాచార శాఖ అనేది రాష్ట్ర ప్రభుత్వం లో ఉన్న 34 శాఖల తో సమన్వయం చేసుకుంటూ ఆయా శాఖల పురోగతి, ప్రగతి నివేదికలు ప్రభుత్వాధి నేత గా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశానుసారం ముందుకు వెళ్ళవలసి ఉంటుంది.ఇందులో విధానపరమైన అంశాలు చాలా ఉంటాయి.అందులో కొన్ని చాలా సున్నితమైన వి ఉండగా మరికొన్ని కఠిన నిర్ణయాలు కూడా ఉంటాయి.ఏ నిర్ణయం అయినా డైరెక్టర్ తన విచక్షణాధికారం తో తీసుకొనవచ్చును...



## ఇరాన్‌పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం

### సిఆర్ఎస్ నివేదిక

వాషింగ్టన్ : ఇరాన్ పై యుద్ధంతో అమెరికాకు భారీ నష్టం వాటిల్లిందని యుఎస్ కాంగ్రెస్ రీసెర్చ్ సర్వీస్ (సిఆర్ ఎస్ ) ఒక నివేదికలో తెలిపింది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా ఇరాన్ పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే. ఈ యుద్ధంలో అమెరికాకు చెందిన సుమారు 42 అత్యాధునిక యుద్ధ విమానాలు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు పూర్తిగా ధ్వంసమవ్వడమో లేదా తీవ్రంగా దెబ్బతినడమో జరిగిందని ఈ నివేదిక పేర్కొంది.

- మిగతా 2లో..

## నెట్ జీరో సిటీ తరహాలోనే

# ఫ్యూచర్ సిటీ

- అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతుల కల్పన
- పరిశ్రమల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :

ఫ్యూచర్ సిటీల పరిశ్రమల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులుకు సంబంధించి పరిశ్రమల శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీహెచ్‌ఆర్‌డీలో సమీక్ష నిర్వహించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ల్యాండ్ అలాట్మెంట్, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ డిజైన్స్ ఉండాలని సీఎం తెలిపారు. మౌలిక వసతుల కల్పన అంతర్జాతీయ స్థాయిలో ఉండాలని.. ఇందులో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని.. ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేసిన తర్వాతే భూ కేటాయింపులు చేయాలని సూచించారు.

2 పేజీలో..



## దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి

- రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. బుధవారం తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీలో పర్యటించారు. అక్కడ నిర్వహించిన -బహుజన స్వాభిమాన్ సభ'లో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి జరుగుతోందని, అది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, డా.బి.ఆర్. అంబేద్కర్, మహాత్మాగాంధీ, వీరపాసి వంటి మహనీయుల సిద్ధాంతాలకు,

2 లో

## రాష్ట్రంలో ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం



### వ్యవసాయేతర వినియోగం, బ్లాక్ మార్కెట్, అక్రమ రవాణాపై ప్రభుత్వం సీరియస్

- రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం
- వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపైనా విచారణ
- ప్రత్యేక తనిఖీలు, విజిలెన్స్ నిఘా పెంపుకు ఆదేశాలు
- జిల్లాల వారీగా ఎరువుల స్టాక్‌లపై రోజువారీ మానిటరింగ్
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులను అక్రమంగా పక్కదారి పట్టించడం, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించడం, బ్లాక్ మార్కెట్, అక్రమ నిల్వలు, ఇతర ప్రాంతాలకు తరలింపు వంటి వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

రైతులకు సరైన సమయంలో నాణ్యమైన ఎరువులు అందకుండా కొరత సృష్టించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని మంత్రి ఘాటుగా హెచ్చరించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, ఇతర రాష్ట్రాలకు తరలించడం, పరిశ్రమలకు మళ్లించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే డీలర్లు, మధ్యవర్తులు, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల డీలర్లు, గోదాములు, రవాణా కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీకి మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

- మిగతా 2లో..

## సీఎం విజయ్ సంచలన నిర్ణయం..




### అవినీతి అధికారులను పట్టిస్తే లక్ష మీదే!

- లంచం అడిగిన అధికారుల వివరాలు ఇస్తే లక్ష రూపాయల రివార్డ్
- తమిళనాడులో అవినీతిపై సీఎం విజయ్ సంచలన ప్రకటన
- ఫిర్యాదుకు వీడియో ఆధారం తప్పనిసరి అని స్పష్టం చేసిన ప్రభుత్వం
- అవినీతి నిరోధక శాఖకు పూర్తి అధికారాలు ఇస్తూ కీలక నిర్ణయం

తమిళనాడు : తమిళనాడులో అవినీతిని సమూలంగా నిర్మూలించే దిశగా నూతన ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగే అధికారుల వివరాలను వీడియో ఆధారాలతో పట్టిస్తే, ఫిర్యాదు చేసిన వారికి ఏకంగా లక్ష రూపాయల రివార్డ్ అందిస్తామని ప్రకటించారు. ఈ పథకం రాష్ట్రంలో అవినీతిపై పోరాటంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రభుత్వ అధికారి కనీసం వెయ్యి రూపాయల లంచం డిమాండ్ చేసినా సరే, బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. బాధితులు చేయాల్సిందల్లా లంచం అడుగుతున్న అధికారి వీడియోను రహస్యంగా చిత్రీకరించి, దానిని ఆధారంగా చూపిస్తూ అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) రిపోర్ట్ చేయడమే. ఫిర్యాదులో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాత సమాచారం అందించిన వారికి లక్ష రూపాయల బహుమతిని అందజేస్తారు.

2 పేజీలో..

## తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు..



- పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరిక

2 పేజీలో..



## జోగి కల్తీ మద్యం బాగోతం బయటపెట్టిన సిట్

- రాజకీయ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న 'గొడ్డలి పార్టీ'
- గత వైసీపీ పాలనలో నాసిరకం బ్రాండ్ల వల్ల వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు
- నాడు బాబాయిని చంపి నింద నెట్టారు.. నేడు కల్తీ మద్యంతో ప్రభుత్వంపై కుట్రకు తెరలేపారు
- లిక్కర్, కులమతాల కుట్రల వెనుక ఉన్న తాడేపల్లి ప్యాలెస్ లింకులపై జగన్ సమాధానం చెప్పాలి
- ప్రతి 3 బాటిళ్లలో ఒకటి కల్తీ అన్న జగన్.. ఒక్క బాటిల్ అయినా నిరూపించగలరా?
- జగన్మోహన్ రెడ్డి అరాచక, దుర్మార్గపు కుట్రలను ప్రజలంతా ఏకమై ఎదిరించాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

2 పేజీలో..

ప్రజాభూమి

గురువారం, మే 21, 2026


## జోగి కల్తీ మద్యం బాగోతం బయటపెట్టిన సిట్

**ప్రజాభూమి ప్రతినిధి,మంగళగిరి:** రాష్ట్రంలో అలజడులు సృష్టించి, ప్రభుత్వంపై అపవాదు వేయడమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నిన కల్తీ మద్యం కుట్రలు 'సిట్' దాఖలు చేసిన చార్జ్‌షీట్‌తో పూర్తిగా బట్టబయలయ్యాయని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వాన్ని ఏ రకంగానైనా అస్థిరపరచాలి, రాష్ట్రంలో ఎలాగైనా అలజడులు సృష్టించాలనే ఏకైక లక్ష్యంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అత్యంత దారుణమైన కుట్రలకు తెరలేపారు. కేవలం రాజకీయ స్వార్థం కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటానికి కూడా వెనుకాడరనడానికి ఈ ఘటనే సజీవ సాక్ష్యమని ఆయన మండిపడ్డారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొలకలచెరువు, ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో కల్తీ మద్యం తయారు చేసి, వాటిని దుకాణాలకు తరలించి ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టేందుకు ప్రయత్నించిన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ ప్రధాన నిందితుడిగా తేలారు. ఈ కుట్రలో అద్దేపల్లి జనార్ధన్, వాళ్ల సొంత సొంత తమ్ముడు జగన్మోహన్‌లతో పాటు పలువురు వైసీపీ నేతల పాత్ర ఉన్నట్లు విచారణలో స్పష్టమైంది. గతంలో సొంత బాబాయిని అత్యంత దారుణంగా హత్య చేయించి, ఆ నిందను ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిపై వేసేందుకు జగన్మోహన్ రెడ్డి ఏ రకంగా కుట్ర పన్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. చంద్రబాబు గారి చేతిలో గొడ్డలి ఉన్నట్లు పేపర్లలో నిలువెత్తు ప్రకటనలు ఇచ్చి 'నారాసుర రక్తచరిత్ర' అంటూ దుష్ప్రచారం చేశారు. అదే తరహాలోనే ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు కల్తీ మద్యం కుట్రకు తెరలేపారు. 2019 ఎన్నికల ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తానని నమ్మబలికిన జగన్మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్నే మార్చేశారు. అప్పటివరకు దేశంలోనే ఉత్తమ మద్యం విధానం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తన సొంత ఖజానా నింపుకునేలా కొత్త పాలసీ తెచ్చారు. నాసిరకం బ్రాండ్లు, హానికర రసాయనాలతో కూడిన మద్యం అమ్మడం వల్ల రాష్ట్రంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది కిడ్నీలు, లివర్లు, బ్రెయిన్ స్ట్రోక్స్ వంటి తీవ్ర వ్యాధుల బారిన పడ్డారు. దీనిపై కోర్టులు సైతం తీవ్రంగా స్పందించాయి. ఇది దాదాపు రూ. 15,00 కోట్ల పైచిలుకు జరిగిన అతిపెద్ద దందా. గతంలో జగన్మోహన్ రెడ్డి అవినీతి సామ్రాజ్యం ఐదు దేశాలకు విస్తరిస్తే, ఇప్పుడు ఆయన అనుచరుల కల్తీ మద్యం నెట్‌వర్క్ ఐదు రాష్ట్రాలకు (లేబుల్స్ ప్రింటింగ్, మూతల తయారీ, సరఫరా) విస్తరించింది. ఈ అక్రమ రవాణాకు సాక్షాత్తు ప్రభుత్వ ఆర్టీసీ బస్సులను కూడా వాడుకోవడం వీరి దోపిడీ పరాకాష్టకు నిదర్శనం.

గతంలో చంద్రబాబు నాయుడు గారి ఇంటిపై దాడి చేసినందుకే జోగి రమేష్‌కు మంత్రి పదవి ఇచ్చి అందలం ఎక్కించిన చరిత్ర జగన్మోహన్ రెడ్డిదని, ఇప్పుడు కూడా కల్తీ మద్యం స్కామ్ చేస్తే రేపు ఏదో పెద్ద పదవి ఇస్తారనే ఆశతోనే ఇలాంటి దారుణాలకు ఒడిగట్టించారా అని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. రాష్ట్రంలో ప్రజలను అస్థిరపరచడానికి, శాంతిభద్రతలను అతలాకుతలం చేయడానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న ప్రతి ఆటను ప్రభుత్వం బయటపెడుతుందని ఆయన హెచ్చరించారు. గతంలో జరిగిన వేల కోట్ల మద్యం స్కామ్ గానీ, ఇప్పుడు బయటపడిన కల్తీ మద్యం కుట్ర గానీ.. వీటన్నింటికీ తాడేపల్లి ప్యాలెస్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయి. ఈ లింకులు ఉన్నాయి కాబట్టే జగన్మోహన్ రెడ్డి గానీ, జోగి రమేష్ గానీ దీనిపై నోరు విప్పలేకపోతున్నారు. దీనిపై జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు వెంటనే సమాధానం చెప్పాలి. రాష్ట్రంలో కేవలం మద్యం ద్వారానే కాకుండా, ఇటీవల వెలుగుచూసిన పాస్టర్ వ్యవహారం చూస్తే.. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవాలని వైసీపీ చూస్తోందని స్పష్టమవుతోంది. ఇలాంటి సామాజిక కుట్రల వెనుక ఉన్న నిజాలు, వాస్తవాలు ఏ ఒక్కటీ దాచితే దాగవు, అన్నీ ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఈ కల్తీ మద్యం నెట్‌వర్క్ ఎక్కడి వరకు విస్తరించింది? దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? అనే కోణంలో ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు చాలా లోతుగా, వివరంగా దర్యాప్తు చేశారు. ఈ కుట్రల మూలాలను గుర్తించి, పక్కా ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేయడం వల్లే ఇవాళ వైసీపీ నాయకుల ముసుగులు తొలగిపోయాయి. రాష్ట్రం ఏమైపోయినా పర్లేదు, ప్రజల ప్రాణాలు పోయినా పర్లేదు, తనకు మాత్రం అధికారమే పరమావధి అనే దుర్మార్గపు ఆలోచనతో జగన్మోహన్ రెడ్డి ఉన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పి, చిత్తుచిత్తుగా ఓడించినా సరే.. ఇంకా సిగ్గు లేకుండా రోడ్లపైకి వచ్చి బరితెగించి మాట్లాడుతున్నారు. రాష్ట్ర పరువు ప్రతిష్టలను, ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్న ఇటువంటి అరాచక శక్తులను, 'రక్తపిశాచి' లాంటి మనస్తత్వం ఉన్న నాయకులను రాష్ట్రం నుండి తరిమికొట్టేందుకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. మద్యం తయారీ కేంద్రం (డిస్టిలరీ) నుండి డిపోలు, దుకాణాల వరకు ప్రతి బాటిల్‌ను ట్రాక్ చేసే డిజిటల్ విధానాన్ని తీసుకువచ్చాం. మార్కెట్లో ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి కల్తీ మద్యం ఉందంటూ జగన్మోహన్ రెడ్డి బాధ్యతారహితంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఎక్సైజ్ సురక్ష' యాప్ ద్వారా ప్రజలే స్వయంగా మద్యం బాటిల్ నాణ్యతను ట్రాక్ చేసుకునే సదుపాయం కల్పించాం. జదీన్నిబట్టే ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికే ఆయన ఇటువంటి తప్పుడు కూతలు కూస్తున్నారని అర్థమవుతోంది. గత ప్రభుత్వంలో కనీసం బీర్లు కూడా అందుబాటులో లేకుండా చేసి, బ్రాండ్లన్నింటినీ మాయం చేశారు. పొరుగు రాష్ట్రాల నుండి నాసిరకం, కల్తీ మద్యం తెచ్చి ఇక్కడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అన్ని ప్రముఖ, నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. దీనివల్ల ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వెళ్లే పరిస్థితి తప్పడమే కాకుండా, అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోగలిగాం. తద్వారా ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూనే, అటు ప్రభుత్వ ఆదాయాన్ని కూడా నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నాం. జోగి రమేష్ లాంటి వ్యక్తులను అడ్డం పెట్టుకుని జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఇటువంటి దుర్మార్గపు కుట్రలను, అరాచకాలను సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఎదిరించాల్సిన అవసరం ఉంది. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటూ రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చాలని చూసే ఇటువంటి శక్తుల పట్ల ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరిస్తుంది. ఈ కల్తీ మద్యం కేసులో, ఇతర కుట్రల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల అసలు నైజాన్ని, వారి అరాచక విధానాలను ప్రజలు మరోసారి గుర్తుంచుకోవాలి. ప్రభుత్వం ప్రజల సంక్షేమం, భద్రత కోసం కట్టుబడి ఉంది. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని పేర్కొన్నారు.

# సమాచార శాఖలో సరి కొత్త మార్పు సాధ్యమా..

కొన్ని ఉన్నతాధికారుల ఆదేశానుసారం ఉండవచ్చు. అయితే ఇప్పుడు సమాచార శాఖ అనేది చాలా హాట్ టాపిక్ గా మారిందని చెప్పాలి.కారణం రాజ్యాన్ని పాలించే ప్రభువు ఒక్కడే మంచివాడు సమర్థుడైనంత మాత్రాన రాజ్యం సుభీక్షంగా ఉండదని రాజుతో పాటు మహా మంత్రి, సైన్యాధ్యక్షుడు ,సైనిక పరివారం అంతా కూడా చిత్తశుద్ధి, ఏకాగ్రత తో ఉంటూ ఒక వేల ప్రభువు తీసుకునే నిర్ణయం పై కూడా సమాలోచనలు చేసి చివరికి ప్రజలకు ఏది మంచి జరుగుతుందో దానిని అమలు చేసి నప్పుడే ఆ రాజ్యం ,రాజ్యం లోని ప్రజలు సంతోషంగా ఉంటారన్నది లోకొత్తర ధర్మం.ఇందులో ఏ ఒక్కరి తప్పిదం ఉన్నా ఆ రాజ్యంలో అలజడులు మొదలై లేనిపోని సమస్యలకు దారితీయడమే కాకుండా కొత్త సమస్యలు కూడా ఏర్పడే ప్రమాదం కూడా లేకపోదన్నది కూడా జగమెరిగిన సత్యం.ఈ ఉపోద్ఘాతం అవసరమా అన్న విమర్శలు కూడా చేయచ్చు కొంత మంది స్వయంప్రకటిత మేధావులు. అది వారి విజ్ఞతతో కూడిన దని అనుకోవడం తప్ప చేయగలిగింది ఏమి లేదు. ఇక అసలు విషయానికి వస్తే ఇక్కడ నవ్యాంధ్ర రాజ్యాన్ని పాలించే ప్రభువు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంచి పరిపాలన దక్షత కలిగి మీడియా అంటే చంద్రబాబు అంటే మీడియా అన్న నానుడి గత నాలుగు దశాబ్దాలుగా ఉంది. అది అధికారం లో ఉన్నా ప్రతిపక్షములో ఉన్నా కూడాను. ఇక్కడ ప్రభువు బాగానే ఉన్నారు...ఆ ప్రభువు పాలనలోని ప్రధానమైన అంశాలను ఎప్పటికప్పుడు గుర్తురెగి ప్రజలకు అందించే సమర్థవంతమైన సైన్యాధ్యక్షుడు ఉన్నారు.మరి సమస్య ఎక్కడా ఉందయ్యా అంటే కింది స్థాయి అధికారులలో ఉందనేది నిత్య సత్యమై వెలుగొందుతూ ఉంది. ఇక్కడ డైరెక్టర్ విశ్వనాథన్ తన శాఖను అద్భుతంగా చేయాలని తపన పడుతూ ఒక డైనమిక్ గా ముందుకు వెళ్తు విరామం ఎరుగక పనిచేస్తూ ఉన్నారు.మొన్న జరిగిన విశాఖ సమ్మిట్,గూగుల్ ప్రోగ్రాం, అమరావతి క్వాంటం ,ఆఖరికి అమరావతి ఆవకాయ కార్యక్రమంకూడా బాగానే ముందుకు తీసుకెళ్లడం జరిగింది. అయితే ఇక్కడ ప్రధానంగా గతం తాలూకు విధానాలకు అలవాటు పడిన గత ప్రభుత్వం లో జరిగిన తప్పు ఒప్పులను సరిదిద్దడానికి కూటమి ప్రభుత్వం వచ్చాక యువ ఐఏఎస్ కాకినాడ కలెక్టర్ గా ఉన్న హిమాన్స్ శు క్లాను సమాచార శాఖ డైరెక్టర్ గా నియమించిన డైరెక్టరేట్ కార్యాలయ సిబ్బందిలో ఉన్న కొంతమంది వల్ల ఆయన ఈ సమాచార శాఖ వద్దురా బాబు అనుకుని నెల్లూరు జిల్లా కలెక్టర్ గా బదిలీపై వెళ్లడం జరిగింది. ఆ తరువాత ఇంకో యువ ఐఏఎస్ నియామకం జరిగిన ఆయన ఈ కార్యాలయంలో అడుగు కూడా పెట్టలేదు.ఇక ప్రభుత్వం ప్రస్తుత యువ ఐఏఎస్ కెన్ విశ్వనాథన్ ను నియమించి సమాచార శాఖకు గాడిలో పెట్టె పనిని అప్పగించింది.అయితే బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి ప్రభుత్వ కార్యక్రమాలలో కీలక పాత్ర పోషిస్తూ ముఖ్యమంత్రి ఉద్దేశ్యాన్ని ముందే గమనిస్తూ తన శాఖను సమర్ధవంతంగా ఉండేలా తాను పరుగులు తీస్తూ సిబ్బందిని కూడా పరుగులు పెట్టేలా ప్రణాళికలు రచిస్తూ ప్రతి అడుగు కూడా ప్రగతి నివేదికలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పాటుపడు తూనే ఉన్నారు మీడియా మెనేజ్మెంట్ కూడా చక్కగాచేస్తూ ఉన్నా శాఖలో ఉన్న అలసత్వపు సిబ్బంది వల్ల అసహనం ఉన్నా అగ్రహం వస్తున్నా అవసరాన్ని బట్టి పనిని ఆదమరించేవారిని సున్నితంగా మందలిస్తూ నిర్లక్ష్యంగా ఉన్నవారికి శాఖాపరమైన మెమోలిస్తూ నిక్కచ్చిగా ముక్కుసూటిగా ముందుకు సాగుతూ ఉన్నారు డైరెక్టర్ విశ్వనాథన్.

ఇంత చేస్తున్న ఆ శాఖపై అనేక రకాల విమర్శలు, ఆరోపణలు తరచూ వింటూనే ఉంటున్నాము.కారణం అక్రిడేషన్ ల సమస్య. అసలు ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు అట్టడుగు ప్రజలకు చేరవేసేది మీడియా నే.అది ప్రింట్ కావచ్చు ఎలక్ట్రానిక్ అవ్వచ్చు.అయితే ప్రస్తుతం వచ్చిన జీవో 84 ప్రస్తుత డైరెక్టర్ కంటే ముందు గా వచ్చిన ఆ జీవో పై కోర్టుల్లో ఎన్నో పిటిషన్ దాఖలైన వాటిని సమర్థవంతంగా సవాల్ చేస్తూనే అక్రిడేషన్ పక్రియ ప్రారంభించడం జరిగింది. కానీ ఆయన ఎన్నో జూమ్ మీటింగ్ లు పెట్టి రాష్ట్ర స్థాయి అధికారుల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు అనేక సూచనలు చేసిన అనాదిగా నిర్లక్ష్యం, అవునితీ,అలసత్వం కు అలవాటు పడ్డ వారి వల్ల అనేక ఆరోపణలు తరచూ వస్తూనేఉన్నాయి.ఆయన ఒక్కడే అవిశ్రాంతంగా అహర్నిశలు కృషి చేస్తూ ఆయనతో పాటు అంతే కష్టం పడుతున్న సీనియర్ అధికారులు ,డీడీ ,ఏడీ స్థాయి అధికారులు ఉన్నారు కాబట్టే ఈ రాష్ట్రంలో కొంతమంది జర్నలిస్టులకయిన ప్రయోజనం చేకూరిందని అనుకోవాలి.

తాను పనిచేస్తూ పనిచేయించాలని చూస్తున్న అలసత్వం కు అలవాటు పడ్డ డైరెక్టరేట్ సిబ్బంది స్టాఫ్ లేరని,పని ఎక్కువ ఉందని,సమయం సరి పోలేదని ఇలా అనేక రకాల కారణాలతో ఏ ఉద్దేశ్యం తో వ్యవస్థ ఉందొ ఆవ్యవస్థ యొక్క లక్ష్యాన్ని నీరు గార్చే ప్రయత్నం లో ఎంతో కొంత నిజాయితీ గా ఉండే జర్నలిస్టులకు అన్యాయం జరుగుతూనే ఉంది. ఇవన్నీ డైరెక్టర్ దృష్టిలో ఉంటే సమస్య పరిష్కారం అందుతుంది. కానీ ఆయన పరిధికి వెళ్లకుండా ప్రాథమిక దశలోనే ఆ పనులకు అడ్డుకట్ట వేసే ధోరణి లో ఉన్న కొంతమంది సిబ్బంది నిర్వాకం కారణంగా కోర్టులో పిటిషన్ లు నమోదు అవుతూనే ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ పాలసీలను మార్చలేక పోయిన రాష్ట్ర స్థాయి అధికారుల అలక్ష్యం కారణంగా అర్హత లేకపోయిన అక్రిడేషన్ కార్డులు కట్టబెట్టారు కోర్టుల్లో కేసులు వేశారు.. కార్డులు వెనక్కి తీసుకొనేలా అగచాట్లు పడుతూ అందరి సమస్యలను అత్యున్నత స్థాయి అధికారులకు తెలియజేసి పరిస్కారం చూపే శాఖనే మరింత సమస్యల సుడి గుండంలోకి నెట్టివేసే పరిస్థితి కల్పిస్తున్నారు.అట్టడుగు స్థాయిలో జరుగుతున్న లోపాలు డైరెక్టర్ స్థాయికి చేరవేయక పోగా తమ వ్యక్తిత్వ పోకడల కోసం చేసిన,చేస్తున్న పనులవల్ల నిజాయితీ, సమర్థత ఉన్నా ఏ ఉన్నతాధికారులకయిన అసహనం,ఆగ్రహం తెప్పించి చివరికి ఈ శాఖ అవసరమా అన్న ఆలోచన కు దారితీసే పరిస్థితి కూడా ఖచ్చితంగా ఉండవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో నిఖార్సయిన అధికారులు కూడా తాము చేయని వాటికి కూడా కోర్టు మెట్లక్కి నిందలు పడే పరిస్థితి రాకుండానే ఉండేలా ప్రస్తుత డైరెక్టర్ సమాచార శాఖ లో మార్పు తీసుకొచ్చేలా సరికొత్త అధ్యాయానికి నాంది పలికి తన పాలన మార్క్ చూపిస్తారన్న చర్చ ఆ శాఖ అధికారులలో నడుస్తోంది.

# దేశంలో రాజ్యాంగంపై నిరంతరం దాడి

అలాగే కేరళలో నారాయణ గురు, కర్ణాటకలో బసవన్న వంటి సంస్కర్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. బుద్ధుడు, గురునానక్, కబీర్ వంటి వారి గొంతుకలు కూడా రాజ్యాంగంలో ప్రతిబింబించాయని, అలాంటి పత్రాన్ని తప్పక పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు కేవలం మహనీయుల విగ్రహాలకు నివాళులు అర్పించడమే కాకుండా, రాజ్యాంగంపై మరియు అది సూచించిన భావజాలంపై దాడులు జరిగినప్పుడు వాటిని రక్షించుకునేందుకు ఎదురుతిరగాలని ఆయన పిలుపునిచ్చారు. భారతదేశం ప్రతి ఒక్కరిదీ అని, ఏ కులానికో, ఒక వ్యక్తికో, బిలియనీర్‌కో లేదా సంస్థకో చెందినది కాదని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల చేసిన పొదుపు సూచనలను ప్రస్తావిస్తూ, రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణం తీవ్రంగా పెరుగుతుందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఆహార ధాన్యాలు అన్నింటి ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసిన ప్రధాని, ఆ వెంటనే తానే స్వయంగా ఐదు దేశాల పర్యటనకు వెళ్లారని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, కులగణన నిర్వహించకపోవడం, కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించడం ద్వారా ప్రధాని మోడీ రోజుకు 24 గంటలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని మండిపడ్డారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల లాభాలకే ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తోందని ఆరోపించారు. అంతకుముందు రాయ్‌బరేలీ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ విప్లవకారుడు వీరపాసికి ఘనంగా నివాళులర్పించారు. మహనీయులను స్మరించుకుంటున్నాం కానీ, వారి సిద్ధాంతాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కోవడంలో వెనుకబడుతున్నామని, ఈ ధోరణి మారాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## నార్వేలోనూ మౌనమే !

ఈ సందర్భంలో నార్వే పత్రిక 'డాగ్సావిసెన్' చెందిన మహిళా జర్నలిస్టు హెల్లె ల్యాంగ్ మోడీని కొన్ని ప్రశ్నలు అడగడానికి ప్రయత్నించారు. అయితే, మోడీ నుండి ఎటువంటి స్పందన కనిపించలేదు. దీంతో 'ప్రపంచంలోని అత్యంత స్వేఛ్ఛాయుతమైన మీడియా నుండి మీరు ఎందుకు ప్రశ్నలు తీసుకోరు?' అని ఆమె ప్రశ్నించారు. ఆమె ఈ ప్రశ్న అడగుతుండగానే మోడీ వేదిక దిగి వెళ్లిపోయారు. ఈ మేరకు విడుదలైన వీడియో క్లిప్పింగ్ వైరల్గా మారింది. మోడీ తీరును నిరసిస్తూ నెటిజన్లు పెద్ద ఎత్తున కామెంట్లు పెడుతున్నారు. అనంతరం ల్యాంగ్ మాట్లాడుతూ, నార్వేలో విదేశీ నాయకులు వచ్చినప్పుడు సాధారణంగా మీడియాకు ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది. చాలా ప్రశ్నలు కాకపోయినా, కనీసం కొన్ని ప్రశ్నలు అడగనిస్తారు. కానీ మోడీ విషయంలో అలా జరగలేదు' అని చెప్పారు. తాజాగా విడుదలైన పత్రికా స్వేఛ్ఛ సూచికలో నార్వే మొదటి స్థానంలో ఉండగా, భారత్ 157 వ స్థానంలో ఉండటం గమనార్హం. దాదాపు 13 ఏళ్లుగా దేశంలోని అత్యున్నత పదవిలో కొనసాగుతున్న మోడీ ఇప్పటి వరకు ఒక్క ప్రెస్ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించని విషయం తెలిసిందే. స్వదేశంలోనే మీడియా ప్రశ్నలను ఎదుర్కోని ప్రధాని విదేశాలలో అందుకు సిద్ధపడతారని ఆశించడం అత్యాశే అన్న వ్యాఖ్యలు మీడియా వర్గాల నుండి వినిపిస్తున్నాయి.

# నెట్ జీరో సిటీ తరహాలోనే ఫ్యూచర్ సిటీ

అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్ట్‌లకు 500 ఎకరాలు కేటాయించాలని సీఎం తెలిపారు. కేంద్రం ప్రకటించిన హెల్త్ క్లస్టర్‌ను ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే ప్రధాని మోదీని కలిసి హెల్త్ క్లస్టర్ కేటాయించాలని విజ్ఞప్తి చేద్దామని ముఖ్యమంత్రి అన్నారు. జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండ్రస్టియల్ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు శంకుస్థాపన జరిగేలా చూడాలన్నారు. భూ కేటాయింపు జరిగిన వెంటనే పరిశ్రమలు నిర్మాణం మొదలు పెట్టేలా నిబంధన విధించాలని తెలిపారు. ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్ రూపొందించాలని వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కోసం ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థను రూపొందించాలని సీఎం ఆదేశించారు. గ్రూప్ 1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని.. డేటా సిటీ నీటి అవసరాల కోసం ఎస్‌టీపీలను వినియోగించాలని సూచనలు చేశారు. జీసీసీలు, డేటా సెంటర్లు కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రోడ్ల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాలల్లో జీసీసీ ఏర్పాటు పైనా దృష్టి పెట్టేలా పాలసీ రూపకల్పన చేయాలన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వ కార్యాలయాలు.. టీ÷ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందే అని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఇరాన్‌పై యుద్ధంతో

# అమెరికాకు భారీ నష్టం

వర్గీకరణ, కొనసాగుతున్న పోరాట కార్యకలాపాలు, బాధ్యతను గుర్తించడం వంటి పలు కారణాల వల్ల దెబ్బతిన్న లేదా ధ్వంసమైన విమానాల సంఖ్య సవరణకు లోబడి ఉండవచ్చని సిఆర్ ఎస్ తెలిపింది. ధ్వంసమైన లేదా దెబ్బతిన్న వాయుసేన ఆస్తులలో అత్యధికంగా 24 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లు, ఒక ఎంక్యూ-4సి ట్రిటాన్ డ్రోన్ ఉన్నాయి. వీటితో పాటు నాలుగు ఎఫ్-15ఇ స్ట్రైక్ ఈగిల్ ఫైటర్ జెట్లు, ఒక అత్యాధునిక ఎఫ్-35ఎ లైట్నింగ్ ×× స్టీల్త్ ఫైటర్ జెట్, ఒక ఎ-10 థండర్‌బోల్ట్ గ్రౌండ్-అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. శత్రువుల దాడిలో ఏడు కెసి-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు, ఒక ఇ-3 సెంట్రీ అవాక్స్ (ఎడబ్ల్యుఎసిఎస్ ), నిఘా విమానం, రెండు ప్రత్యేక ఆపరేషన్ల విమానాలు, ఒక హెచ్‌హెచ్-60డబ్ల్యూ రెస్క్యూ హెలికాప్టర్ దెబ్బతిన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. యుఎస్ కాంగ్రెస్, కమిటీలకు విధానపరమైన, చట్టపరమైన విశ్లేషణను అందించే సిఆర్ ఎస్, రక్షణ శాఖ, యుఎస్ సెంట్రల్ కమాండ్ వార్తా నివేదికలు, ప్రకటనలను పరిశీలించడం ద్వారా ఈ నష్టాలను అంచనా వేసింది. అమెరికా రక్షణ శాఖ ఇప్పటివరకు అధికారికంగా నష్టాల పూర్తి వివరాలను వెల్లడించనప్పటికీ, దెబ్బతిన్న యుద్ధ పరికరాల మరమ్మతులు, పునరుద్ధరణ ఖర్చులు ఊహించిన దానికంటే విపరీతంగా పెరిగాయని పెంటగాన్ తాత్కాలిక కాంట్రోలర్ జూల్స్ డబ్ల్యు హర్స్ట్ ××× ప్రతినిధుల సభలో అంగీకరించిన సంగతి తెలిసిందే.ఈ నష్టాల కారణంగా పెంటగాన్ అంచనా వేసిన సైనిక కార్యాచరణ వ్యయం భారీగా పెరిగి 29 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.2.4 లక్షల కోట్లు) చేరినట్లు ఆయన తెలిపారు.

## తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు...

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు.తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

# సీఎం విజయ్ సంచలన నిర్ణయం..

అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ తమిళనాడులో ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సీఎం విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అవినీతిపై యుద్ధం ప్రకటించిన ఆయన, రాష్ట్ర ఏసీబీని పూర్తిగా ప్రక్షాళన చేసి, దానికి పూర్తి అధికారాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయ్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ పథకం గనుక పకడ్బందీగా అమలైతే, రాష్ట్ర పరిపాలనలో ఇది విప్లవాత్మక మార్పుకు నాంది పలుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అవినీతి రహిత పాలన కోసం ఎదురుచూస్తున్న ప్రజల నుంచి ఈ నిర్ణయానికి భారీ మద్దతు లభించే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో ఎరువుల అక్రమాలపై ఉక్కుపాదం

అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్, అనధికార విక్రయాలు, పరిశ్రమలకు, ఇతర అవసరాలకు ఎరువుల మళ్లింపుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. 2026-27 సంవత్సరంలో మే 4వ తేదీ నుండి ఇప్పటివరకు వ్యవసాయ శాఖ అమలు విభాగం చేపట్టిన కఠిన చర్యలను మంత్రి వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఎరువుల డీలర్లకు 182 షోకాజ్ నోటీసులు జారీ చేశారు, 80 ఎరువుల లైసెన్సులను సస్పెండ్ చేశారు, 1 ఎరువుల లైసెన్సును రద్దు చేశారు, సెక్షన్ 6-ఎ కింద 1 కేసు నమోదు చేశారు, రూ.707 లక్షల విలువైన 3372 మెట్రిక్ టన్నుల ఎరువులను నిర్బంధించారు, రూ.5 లక్షల విలువైన 2 మెట్రిక్ టన్నుల ఎరువులను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేయడం, రైతులకు అందకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం, కృత్రిమ కొరత సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఎరువులను పక్కదారి పట్టించినట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులు వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అంతేకాకుండా, ఈ వ్యవహారాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వ్యవసాయ శాఖ అధికారులపైనా విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఒకే జిల్లాలో సంబంధిత అధికారుల పరిధిలో ఎరువుల అమ్మకాల్లో పునరావృతంగా అవకతవకలు, నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూస్తే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అవసరమైతే సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేసే అధికారాన్ని జిల్లా జాయింట్ డైరెక్టర్లకు (జేడీలు) అప్పగించినట్లు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎలాంటి చర్యలనైనా ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని పేర్కొన్నారు. రైతులకు సరైన సమయంలో, సరిపడా పరిమాణంలో నాణ్యమైన ఎరువులు అందేలా జిల్లా వారీగా స్టాక్‌లపై రోజువారీ మానిటరింగ్ నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ నియంత్రణ కోసం విజిలెన్స్ విభాగం, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల నిఘాను మరింత పెంచుతున్నట్లు తెలిపారు. రైతులను మోసం చేసే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, రైతుల ప్రయోజనాల రక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని పేర్కొన్నారు.

# స్వచ్ఛ పథంలో నిరంతర పారిశుధ్య ఉద్యమం

**- నడిచే దారి బాగుంటే వచ్చే భవిత బంగారమే**
**- ప్రజా భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేద్దాం**
**- స్వచ్ఛ పథం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో ప్రభుత్వం స్వచ్ఛ రథాన్ని అమలు చేస్తోందని.. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని ప్రతి బుధవారం నిర్వహి స్తున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. విస్తృత ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛ కార్యక్రమాలను విజయ వంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ.. జెడ్పీ సీఈవో డా. జె.అరుణతో కలిసి విజయవాడ గ్రామీణం, పాతపాడు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ పథం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక థీమ్‌తో ప్రతి శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పుడు దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాల రహదారులు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలనే సంకల్పంతో స్వచ్ఛ పథం కార్య క్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గ్రామాల్లో రహదారుల పక్కన చెత్త కుప్పలను తొల గించడం, గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, స్థిరమైన ఘనవ్యర్థాల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఇందులో భాగస్వాములై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలోని ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉం టుందని..



ప్రజలు అధికారుల సూచనలు పాటి స్తూ ఈ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలని కోరారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటిదగ్గరికి వచ్చే సిబ్బందికి తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో డీపీవో పి.లావణ్య కుమారి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

# అధిక ఉష్ణోగ్రతలపై అప్రమత్తంగా ఉండాలి

**- వేసవి తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తప్పనిసరి**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు, హీట్‌వేవ్ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలం దరూ అప్రమత్తంగా ఉంటూ అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. ఈ మేరకు ఆయనిక్కడ ఓ ప్రకటనలో తెలియజేశారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తలకు టోపీ, గుడ్డ లేదా గొడుగు ఉపయోగించడంతో పాటు స్వచ్ఛమైన తాగు నీరు, మజ్జిగ వంటి వాటిని వెంట తీసుకెళ్లాలన్నారు. శరీరంలో నీరసం రాకుండా తరచూ మంచినీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిం చారు.

వేసవి తీవ్రత కారణంగా హీట్‌స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున తలనొప్పి, తల తిరగడం, అధిక చెమటలు, అలసట, వాంతులు వంటి లక్షణాలు కని పిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. చిన్నా రులను ఎండలో ఆడనివ్వకుండా చూడాలని, కార్మికులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు తర చూ విరామాలు తీసుకుంటూ నీరు తాగాలని సూచించారు.



రైతులు, నిర్మాణ కార్మికులు, ట్రాఫిక్ సిబ్బంది వంటి వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు హీట్‌వేవ్ పరిస్థితులపై నిరం తరం పర్యవేక్షణ కొనసాగిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# శ్రమను గౌరవిస్తూ పారపట్టి.. మట్టి తీసి..

**- జలధార పనుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**
**- వేసవి నేపథ్యంలో శ్రామికులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా**
**- సగటు వేతనం రూ. 307 అందేలా ప్రణాళికాయుత కార్యాచరణ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ: విజయవాడ రూరల్ మండలంలోని పాతపాడులో ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపడుతున్న జలధార పనులను కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యత, శ్రామికుల హాజరు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. శ్రమకు గౌరవం కల్పిస్తూ పారపట్టి మట్టితీశారు. పనుల్లో పాల్గొంటున్న శ్రామికులతో మాట్లాడి వారికి అందుతున్న వేతనాలు, తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలపై ఆరా తీశారు. వేసవి తీవ్రత దృష్ట్యా శ్రామికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పని ప్రదేశాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడేలా ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా గ్రామాల్లో చెరువుల అభివృద్ధి, కాలువల శుభ్రప రిచే పనులు, మట్టి పనులు, పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపట్టి గ్రామీణ మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పని దినాల కల్పన, సామాజిక భద్రతా ప్రయోజనాలు అందించడానికి సంబంధించిన అంశాల్లో నిర్దేశించిన నెలవారీ, త్రైమాసిక, వార్షిక లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సగటు వేతనం రూ. 307 ఉపాధి హామీ



శ్రామికులకు అందేలా ప్రణాళిక ప్రకారంప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. నీటి భద్రత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న జలధార కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పార్థసారథి, డ్వామా క్షేత్రస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మండే ఎండల్లో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు .. వాయిదా వేయాలి



**లంకిశెట్టి బాలాజీ డిమాండ్**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన ఎండలు మండుతున్న నేపథ్యంలో, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను తక్షణమే వాయిదా వేయా లని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు బుధవారం విజ్ఞప్తి చేశారు.మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ యంత్రాంగం నిర్ణయాలలోని పరస్పర విరుద్ధతను ఎండగట్టారు.ఒకవైపు హెచ్చరికలు.. మరోవైపు పరీక్షలా?తీవ్రమైన ఎండల కారణంగా ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రజలెవ్వరూ బయటకు రావద్దని ఒక పక్క జిల్లా కలెక్టర్ అధికారిక ప్రకటనలు జారీ చేస్తుంటే... దానికి విరుద్ధంగా ఉదయం నుండి సాయంత్రం వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం? అని లంకిశెట్టి బాలాజీ ప్రశ్నించారు.ఐఏఎస్ అధికారులు ఏసీ గదుల్లో కూర్చుని క్షేత్రస్థాయి పరిస్థితులను గమనించకుండా పరీక్షల తేదీలను ఖరారు చేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ఆయన మండిపడ్డారు. ఈ భానుడి భగభగలకు విద్యా ర్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వడదెబ్బ తగిలి ప్రాణాపాయ స్థితికి గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఎండల్లో సిబ్బంది పడుతున్న నరకయాతన ఇదీ..!పరీక్షల నిర్వహణ కోసం ఉపాధ్యాయులు, పోలీసులు, ఇతర శాఖల సిబ్బంది ఉదయం నుండి రాత్రి వరకు ఎండల్లో పడుతున్న ఇబ్బందులను బాలాజీ క్షుణ్ణంగా వివరించారు.ఉదయపు సెషన్ పరీక్షల కస్టడి యన్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెం టల్ అధికారులు ఉదయం 8 గంటలకే పోలీస్ స్టేషన్‌కు చేరుకుని క్వశ్చన్ పేపర్లు తీసుకోవాలి. అక్కడి నుండి ఎగ్జామ్ సెంటర్‌కు వెళ్లి ఉదయం 9:00 నుండి మధ్యా హ్నం 12:00 గంటల వరకు పరీక్ష నిర్వహిం చాలి. పరీక్ష ముగిసిన తర్వాత సమాధాన పత్రాలను ప్యాక్ చేసి, మండు టెండలో పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లి అప్పగించాలి.మధ్యాహ్న సెషన్ ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే, మళ్లీ మధ్యాహ్నం 1:30 గంటలకల్లా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని మధ్యాహ్నం సెషన్ పేపర్లు తీసుకోవాలి. పరీక్ష కేంద్రానికి చేరుకుని మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 వరకు పరీక్ష నిర్వహించాలి. అనం తరం ఆ ఆన్సర్ బండిల్‌ను తీసుకుని రాత్రి వేళ పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయాలి.అందరి ప్రాణాలూ ప్రమాదంలోనే..ఈ విపరీతమైన ఉష్ణోగ్రతల్లో కేవలం విద్యార్థులే కాకుండా పరీ క్షల కస్టడి యన్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, వి ద్యా శాఖ అధి కారులు, రక్షణగా ఉండే పోలీస్ శాఖ, అత్యవసర సేవలందించే ఆరోగ్య శాఖ ( ఏ ఎన్ ఎం లు), మరియు పోస్టల్ సిబ్బంది అంతా ప్రాణా లను గుప్పిట్లో పెట్టుకుని ఎండల్లో పనిచే యాల్సి వస్తోందని బాలాజీ ఆవేదన వ్యక్తం చేశారు.

**తక్షణ డిమాండ్..**భుత్వం మరియు విద్యాశాఖ తక్షణ మే స్పం దించి, మానవీయ కోణంలో ఆలోచించి ఎండల తీవ్రత తగ్గే వరకు ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలను వాయిదా వేయాలని లంకిశెట్టి బాలాజీ గట్టిగా డిమాండ్ చేశారు.

# కృష్ణాజిల్లాకు హీట్ వేవ్ ముప్పు .. మే 24 వరకు అప్రమత్తంగా ఉండండి

**కలెక్టర్ డీకే బాలాజీ అత్యవసర ఆదేశాలు..**
**ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు రావద్దు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి
కృష్ణాజిల్లా ప్రజలకు రాబోయే నాలుగు రోజులు అత్యంత కీలకం కానున్నాయి. జిల్లాలో మే 20 నుంచి మే 24 వరకు ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉందని, తీవ్రమైన వడగాల్పులు (హీట్ వేవ్) వీచే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (APSDMA), భారత వాతావరణ శాఖ (IMD) జారీ చేసిన ప్రత్యేక బులెటిన్ ఆధారంగా జిల్లా యంత్రాంగాన్ని ఆయన అప్రమత్తం చేశారు.పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ



ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్ని శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, శిశువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ ఎండల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.కలెక్టర్ ముఖ్య సూచనలు.. ప్రజలు చేయవలసినవిద్రవపదార్థాలు ఎక్కు వగా తీసుకోండి: దాహం వేయ కపోయినా తగినంత నీరు నిరంతరం తాగుతూ ఉండాలి. ORS (ఓఆర్ఎస్) ద్రావణం, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, గంజి వంటి ద్రవపదార్థాలను ఎక్కు వగా తీసుకోవడం ద్వారా శరీరాన్ని చల్లగా ఉంచుకోవాలి.

దుస్తుల ఎంపిక: బయటకు వెళ్లేటప్పుడు శరీరాన్ని పూర్తిగా కప్పేసేలా పలుచని, లేత రంగు కాటన్ (పత్తి) దుస్తులను ధరించడం మంచిది.రక్షణ కవచాలు ఎండ నుంచి రక్షణ కోసం టోపీలు, గొడుగులు, సన్ గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలి. ఇవి అస్సలు చేయవద్దుసమయం ముఖ్యం: ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలెవరూ ఇళ్ల నుండి బయటకు రావద్దు.రైతులకు విజ్ఞప్తి ఎండ తీవ్రత దృష్ట్యా రైతులు, కూలీలు మధ్యాహ్న వేళల్లో పొలం పనులను తగ్గించుకోవాలి. పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లోనే ముగించుకునేలా ప్లాన్ చేసుకోవాలి.ఎండలో తిరగవద్దు అనవసరంగా ఎండలో ఎక్కువసేపు ప్రయాణాలు చేయడం, తిరగడం ప్రాణాం తకంగా మారే ప్రమాదం ఉంది.గమనిక ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు పాటించి, ఆరోగ్యంగా ఉండాలని ప్రజా భూమిపత్రికా ముఖంగా జిల్లా యంత్రాంగం కోరుతోంది.



# ప్రకాశం పంతులు కృషి మరువలేనిది : వైయస్ జగన్

అమరావతి ప్రజాభూమి ప్రతినిధి
రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరు ప్రకాశం పంతులు రాష్ట్ర అభివృద్ధిలో చేసిన కృషి మరువలేనిదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్ తెలిపారు.వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధ వారం స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు.ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్మృతివనం, విగ్రహం ఏర్పాటుపై వైయస్ జగన్‌కు వినతిపత్రం అందజే సారు ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు.దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులలో దక్షిణ భారతావనిలో ప్రకాశం పంతులు అగ్రగణ్యులని, అలాంటి మహానీయుడి జీవిత విశేషాలు భావితరాల వారికి తెలియజేసేలా ఆంధ్రప్రదేశ్ రాజధానిలో ప్రకాశం స్మృతివనం, శాసనసభ ప్రాంగణంలో ప్రకాశం పంతులు విగ్రహం ఏర్పాటు చేయాలని మల్లాది విష్ణు నాయకత్వంలో వైయస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు.వారి విజ్ఞప్తిని తప్పక పరిశీలించి, అధికారంలోకి రాగానే తప్పనిసరిగా ఏర్పాటుచేస్తామని వైయస్ జగన్ హామీ ఇచ్చారు.వైయస్ జగన్ హామీతో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు జగన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు జ్వాలాపురం శ్రీకాంత్, ద్రోణంరాజు శ్రీవాత్సవ, రాంపల్లి రవిచంద్ర, పురుషోత్తమ శర్మ, ఈ.క్రిష్ణమాచారి, సీహెచ్. శ్రీనివాసరావు, కె. వెంకట సుబ్బారావు.

# భూముల చదును, చెరువుల మరమ్మతులకు తహసిల్దార్ అనుమతి తప్పనిసరి

**నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు**
**నార్త్ తహసిల్దార్ భూషణం హెచ్చరిక**



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా
రైతులు తమ పొలాల్లోని ఎత్తుపల్లాలను (మెరకలను) సమాంతరంగా చదును చేసుకోవడానికి, అలాగే పాత చెరువుల మరమ్మతులు (రిపేర్లు) చేసుకోవడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవడం తప్పనిసరి అని నార్త్ తహసిల్దార్ భూషణం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు.రైతులు తమ భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లను కార్యాలయంలో చూపించి, వెరిఫై చేయించుకున్న తర్వాతే ఈ పనులకు అనుమతులు ఇస్తామని ఆయన స్పష్టం చేశారు.

**కొత్త చెరువుల తవ్వకాలకు 'ఫిషరీస్' అనుమతి ఉండాలి:**నూతనంగా పెంపకపు చెరువులు (చేపల/రొయ్యల చెరువులు) తవ్వుకోవాలనుకునే రైతులు, ముందుగా మత్స్య శాఖ (ఫిషరీస్ డిపార్ట్‌మెంట్) నుంచి అధికారికంగా పర్మిషన్ తీసుకోవాలని తహసిల్దార్ సూచించారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ నుంచి ఎలాంటి ఆటంకాలు లేవని (NOC) పత్రాలు పొందిన తర్వాతే తదుపరి అనుమతులు లభిస్తాయని పేర్కొన్నారు.ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవుతహసిల్దార్ హెచ్చరికచెరువుల మరమ్మ తులు, భూముల చదును నెపంతో కొందరు అక్రమార్కులు లోపల ఉన్న ఇసుకను బయటకు తోడి తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది.

ఇలాంటి పనులను ఆసరాగా చేసుకుని ఇసుకను అక్రమంగా తరలిస్తే ఎంతటి వారైనా సరే సహించేది లేదు. వారిపై చట్టప్రకారం అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటాం.రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలే తప్ప, చట్టవిరుద్ధమైన పనులకు పాల్పడి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని తహసిల్దార్ భూషణం ఈ సందర్భంగా రైతులకు విజ్ఞప్తి చేశారు.

# రూ. 27 లక్షలతో సిమెంట్ డ్రైనేజీ పనుల ప్రారంభం

**కృత్తివెన్ను జడ్పీటీసీ మైలా రత్నకుమారి చేతుల మీదుగా భూమి పూజ**

కృత్తివెన్ను/ప్రజాభూమి ప్రతినిధి
కృత్తివెన్ను మండల పరిధిలోని చిన్న గొల్లపాలెం ఎటి పవర్ గ్రామంలో బుధవారం ఉదయం సిమెంట్ డ్రైనేజీ నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ (జడ్పీ) నిధులు సుమారు 27 లక్షల రూపాయలతో, 650 మీటర్ల పొడవునా నిర్మించనున్న ఈ



సిమెంట్ డ్రైన్ పనుల ను కృత్తివెన్ను జడ్పీటీసీ మైలా రత్నకుమారి గ్రామస్తులతో కలిసి కొబ్బరికాయ కొట్టి సాంప్రదాయబద్ధంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. గ్రామంలోని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఈ నిధులు ఎంతగానో దోహదపడతాయని, నాణ్యతా ప్రమాణాలతో పనులను సత్వరమే పూర్తి చేస్తామని పేర్కొన్నారు.పాల్గొన్న ప్రముఖులుఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

## స్వచ్ఛ పథంలో ఎమ్మెల్యే చింతమనేని శ్రమదానం



ప్రజాభూమి ప్రతినిధి-దెందులూరు

రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు నిర్వహిస్తున్న "స్వచ్ఛ పథం" కార్యక్రమంలో భాగంగా దెందులూరు మండలం గోపన్నపాలెం గ్రామంలో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని స్వయంగా చీపురు పట్టి రహదారులను శుభ్రం చేశారు.పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజలతో కలిసి ఎమ్మెల్యే రోడ్ల పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. గ్రామాల్లో పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.అలాగే మురుగు కాల్వల నిర్వహణ, బ్లీచింగ్ చల్లడం, యాంటీ లార్వా పిచికారీ వంటి చర్యలు నిరంతరం చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా చిన్నారులతో నీతికథలు చెప్పించి వాటిలోని సందేశాలను వివరించారు. రిసోర్స్ పర్సన్‌లుగా పాల్గొన్న ఇళ్ళ నరసింహమూర్తి మైండ్ మెమరీ, మల్టీ టాస్కింగ్ గేమ్స్ నిర్వహించి చిన్నారులను అలరించారు. ఆంధ్రా డైరీ స్టాఫ్ రిపోర్టర్ చలసాని వెంకట సురేంద్ర (పెప్సి) విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, మంచి ప్రవర్తన అలవర్చుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు.డి. శ్రీవల్లి ధ్యానం, బ్రెయిన్ వ్యాయామాలు నిర్వహించగా, పి. శంకర్ డ్రాయింగ్ శిక్షణ అందించారు.విరామ సమయంలో దాతల సహకారంతో చిన్నారులకు మజ్జిగ ప్యాకెట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు.కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ. నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్‌తో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు




ప్రజాభూమి ఏలూరు.బిఎస్ఎన్ఎల్ సేవల విస్తరణలో యువత భాగస్వామ్యం కావాలని జనరల్ మేనేజర్ సి.వి.సి రామరాజు, ఐటిఎస్ పిలుపునిచ్చారు.బిఎస్ఎన్ఎల్ పార్టనర్షిప్ ద్వారా గ్రామాలు, పట్టణాల్లో సేవలను విస్తరించి యువత స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు.కేబుల్ ఆపరేటర్లు కూడా బిఎస్ఎన్ఎల్‌తో కలిసి బ్రాడ్‌బ్యాండ్, ఫైబర్, మొబైల్ సేవలను ప్రజలకు అందిస్తూ ఆదాయం పొందవచ్చన్నారు.ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు నాణ్యమైన కనెక్టివిటీతో అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, ప్రజలు విశ్వసనీయ సేవల కోసం బిఎస్ఎ న్ఎల్‌ను వినియోగించాలని కోరారు.యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

## ఉపాధి హామీ కార్మికులకు స్నాక్స్, శీతల పానీయాలు పంపిణీ చేసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండలం దర్భగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరా జు బుధవారం స్నాక్స్ మరియు శీతల పానీయాలను పంపిణీ చేశారు. మండుతున్న ఎండల్లో కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు కొంత ఉపశమనం కలిగించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తన సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పని ప్రదేశానికి స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే అక్కడ జరుగుతున్న పనుల వివరాలను కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల పనితీరు, కార్మికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ అవినీతికి ఎలాంటి తావు లేకుండా అధికారులు పనిచేయాలని సూచించారు.అలాగే ఉపాధి హామీ కార్మికులు చేసిన పనికి అనుగుణంగా వేతనా లు వారి ఖాతాల్లో సమయానికి జమ అయ్యేలా అధికా రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరా రు. కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో జాన్ వేస్లీ, ఫీల్డ్ అసిస్టెంట్ చల్లా రావు, కూటమి నాయకులు తమ్మన సాంబశివరావు,సొసైటీ చేర్మెన్ అక్కిశెట్టి విజయ ప్రసాద్ సోసైటీ డైరెక్ట్ సింగూలూరి రామారావు పైడిమలా కృష్ణ కొరస దుర్గారావు చిలక వెంకటేశ్వరరావు తణుకు శ్రీను గుర్రం కాంతారావు బొర్ర సురేష్ యారామల బాబురావు కొప్పుల నాగయ్య తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 26 వరకు వేసవి వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ కె.వైట్రీ సెల్వి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

ఏలూరు జిల్లాలో ఈనెల 26 వతేదీ వరకు తీవ్రమైన వేడి వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉండవచ్చున్న వాతావరణ హెచ్చరికల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో రాబోయే ఏడు రోజులకు ప్రాధాన్యత, తక్షణ సన్నద్ధత, ఉపశమన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లు , అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో వేడి వాతావరణంలో అనారోగ్యం మరియు మరణాల నివారణ, ప్రజల రక్షణ, మరియు అత్యవసర సేవల కొనసాగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వడగాలుల సన్నద్ధతపై ప్రజలకు చేయవలసినవి, చేయకూడని పనుల పై అందుబాటులో ఉన్నచోట, ఎలక్ట్రానిక్ బోర్డులపై హెచ్చరికలు మరియు ప్రజా భద్రతా సందేశాలను ప్రదర్శించాలన్నారు.. బస్ స్టాండ్‌లు, మార్కెట్లు, కూడళ్లు, కార్మిక అడ్డాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆశ్రయ కేంద్రాలు మరియు ఇతర రద్దీ ప్రాంతాలలో తగినంత త్రాగునీటి ఏర్పాట్లు ఉండేలా చూడాలని, శీతలీకరణ షెల్టర్లు మరియు నీడ ఏర్పాట్లు, అవసరమైన చోట చలివేంద్రాలు, తాత్కాలిక నీటి కియోస్కలు మరియు ట్యాంకర్లను ఏర్పాటు చేయాలని, నీటి కొరత ఎక్కువగా ఉండే నివాస ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసర పరిస్థితులలో స్పందించడం కోసం



మున్సిపల్ కమిషనర్లు , జిల్లా పరిపాలన, వైద్య ఆరోగ్య, పోలీస్, రెవెన్యూ, విద్య, అగ్నిమాపక సేవలు, స్వచ్ఛంద సంస్థలు , ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల స్థాయిలో, వార్డు స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని,. రోజువారీ పర్యవేక్షణ కోసం వార్డు కార్యదర్శులు, పారిశుధ్య కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది, పట్టణ ప్రణాళిక సిబ్బంది, వార్డు వాలంటీర్లు / క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలన్నారు. పట్టణ స్థానిక సంస్థలు వీధి జంతువులు, పక్షుల కోసం తగిన బహిరంగ ప్రదేశాలు, పార్కులు, మార్కెట్లు , ఇతర ప్రదేశాలలో నీటి గిన్నెలు / మట్టి కుండలను ఏర్పాటు చేయాలని, వాటిని శుభ్రంగా ఉంచి, క్రమం తప్పకుండా నింపేలా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు , అధికారులు రాబోయే ఏడు రోజుల పాటు ప్రతిరోజూ సన్నద్ధతా చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని మరియు క్షేత్రస్థాయి అమలులో ఎలాంటి అలసత్వం లేదని నిర్ధారించుకోవాలన్నారు.

## వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో అనంతబాబుకు కఠిన శిక్ష విధించాలి

### ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు



మాజీ ఎమ్మెల్సీ అనంత బాబు కారు డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నేటికీ మిస్టరీ కొనసాగుతోందని, నిందితుడైన అనంతబాబును కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు దళిత నాయకులు, టిడిపి నేతలు డిమాండ్ చేశారు.ఏలూరు పవర్‌పేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం వీధి సుబ్రహ్మణ్యం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని, వీధి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం నేతలు మాట్లాడుతూ, అప్పటి వైసిపి ప్రభుత్వం అరాచక విధానాలను ప్రోత్సహించిందని విమర్శించారు. సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి "డోర్ డెలివరీ" చేసిన అనంతబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారధి, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, కో-ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెద బాబు, ఎస్సీ ఎస్టీ జిల్లా మానిటరింగ్ సెల్ డైరెక్టర్ దొడ్డిగర్ల శుభా మల్లిక్, టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, కార్యదర్శి మెలిపాక వెంకన్న, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు జుంజు మోజెస్, బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ బోర్డు కమిటీ సభ్యులు లంకపల్లి మాణిక్యాలరావు, కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రజలకు పెదపాడు పోలీసుల హెచ్చరిక



ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.

ప్రస్తుతం వేసవికాలం కావడంతో ప్రజలు తమ ఇళ్లకు తాళం వేయకుండా, కేవలం తలుపులు దగ్గరగా వేసి ఇంటి ముందే నిద్రిస్తున్న ఘటనలు ఎక్కువగా కనిపిస్తున్నాయని పెదపాడు ఎస్ఐ ఆర్.శీను తెలిపారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని రాత్రి వేళల్లో దొంగలు ఇళ్లలోకి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదు తదితర విలువైన వస్తువులను దొంగల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ నేపథ్యంలో ప్రజలు తమ విలువైన బంగారు వస్తువులు, నగదును ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అలాగే ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, రాత్రి సమయంలో అప్రమత్తంగా ఉండడం, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించి దొంగతనాలను నివారించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంబేద్కర్ జీవితం ఎంతమందికి ఆదర్శం

### పెదపాడు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు.



ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు

వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పెదపాడు గ్రంథాలయం నందు విద్యార్థిని, విద్యార్థులకు రిసోర్స్ పర్సన్ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ గోసాల ఝాన్సీ రాణి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాల గురించి వివరించారు. అంబేద్కర్ భారతదేశానికి మొదటి న్యాయశాఖ మంత్రి, సంఘ సంస్కర్త, భారత రాజ్యాంగ రూపశిల్పి, అంటరానితనం,కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శమని తెలియజేశారు. అనంతరం డి.కె. చదువుల బాబు రచించిన "మాయ విసనకర్ర" అనే పుస్తకం నుండి చలపతి తెలివి- దేవుడు తీర్చిన కోరికలు అనే నీతి కథలను విద్యార్థులచే చదివించడం,కథలు చెప్పించడం, పుస్తక సమీక్ష చేయించడం నిర్వహించారు. బాల,బాలికలతో ఇండోర్ గేమ్స్ " లూడో- చెస్- క్యారమ్స్"ఆటలు నేర్పించి, బడి పిలుస్తుంది అందరం భాగస్వాములు అవుదాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దుగ్గ పోగు జాన్ బాబు ఆధ్వర్యంలో గ్రంథాలయ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను నిర్మూలనకు సమిష్టి కృషి చెయ్యాలి

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

మాదకద్రవ్యాల మహమ్మారిని జిల్లా నుండి పారద్రోలేందుకు అధికార యంత్రాంగం, సమాజం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టరు కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశంలో వారు కీలక ఆదేశాలు జారీ చేశారు. గంజాయి, డ్రగ్స్ రవాణా లేదా వినియోగం చేస్తూ పట్టుబడితే కఠిన శిక్షలు తప్పవు. అటువంటి వారిపై శాశ్వత క్రిమినల్ రికార్డు నమోదవు తుందని, దీనివల్ల ప్రభుత్వ ఉద్యోగాలకు,పాస్‌పోర్ట్ జారీకి వారు అనర్హులవుతారని కలెక్టరు, జిల్లా ఎస్పీ



హెచ్చరించారు.గంజాయి వినియో గంపై తరచుగా మారు మూల ప్రాంతాలలో డ్రోన్ ద్వారా మెగా ఉంచి రాపిడ్ టెస్ట్ ద్వారా అనుమాని తులను పరీక్షించాలని జిల్లా ఎస్పీ ఆదేశించినారు.ప్రతి పాఠశాల, కళాశాలలో పోస్టర్లు మరియు సదస్సుల ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాల పై యువతకు



అవగాహన కల్పించాలి. ఔషధ దుకాణాల్లో నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలపై నిరంతరం తనిఖీలు చేపట్టలోని అధికారులకు సూచించారు.పిల్లల ప్రవర్తన, వారి స్నేహాల పట్ల తల్లిదండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. చిన్న వయసులోనే సిగరెట్లు, మత్తు పదార్థాలకు బానిస కాకుండా పిల్లలను కంటికి రెప్పలా కాపాడు కోవాలన్నారు. డ్రగ్స్ లేదా పెడ్లర్ల సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 లేదా నేషనల్ హెల్ప్ లైన్ 14446 కు సమాచారం అందించాలి.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి తెలియజేశారు.రైళ్లు, రవాణా వాహనాల ద్వారా జరుగుతున్న గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టడానికి ఆపరేషన్ విజయ్, వజ్ర ప్రహార్ ద్వారా గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ప్రారంభం

### నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ నిరంతర పోరాటాలు

ప్రజాభూమి, ప్రతినిధి-వేలేరుపాడు.

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వలన నష్టపోతున్న ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలని అఖిలపక్ష ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథ మాస్ లైన్, కాంగ్రెస్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పోలవరం వలన ముంపుకు గురికానున్న కుటుంబాలకు ప్రభుత్వం సరైన విధానంలో పరిహారం అందించటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఇష్టానుసారంగా ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కోలా పరిహారం అందిస్తూ నిర్వాసితులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు.ప్రతి నిర్వాసితునికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని పేర్కొన్నారు. కట్ ఆఫ్ తేదీల్లో వెలేరుపాడు, కుకునూరు మండలాలకు 2017గా నిర్ణయించి, గోదావరి అవతల ఉన్న వి ఆర్ పురం ,చింతూరు ఎటపాక, కూనవరం తదితర మండలాలకు 2022 వరకు నిర్ణయించి, వందల మంది యువతీ ,యువకులకు న్యాయం చేస్తున్నారన్నారు. అదే ప్రాజెక్టు కింద ముంపున గురయ్యే వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. నిర్వాసితులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వం బాధ్యతగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పలు డిమాండ్లను వినతి పత్రం ద్వారా తాసిల్దార్ కు అందచేయడం జరిగింది. అందులో ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు వలన మండలం మొత్తం ముంపుకు గురవుతుంది. అందుకే మండలం మొత్తాన్ని యూనిట్ గా తీసుకుని పునరావాసం కల్పించడంతో పాటు ప్యాకేజీ అందించాలి. మిగులు భూములను ప్రభుత్వం తీసుకొని నష్టపరిహారం రైతులకు అందించాలి. స్థానిక అర్హతలు అన్ని ఉన్న ప్రాజెక్టు నష్టపరిహారానికి అనర్హులుగా వందల కుటుంబాలను పేర్కొన్నారు. ఆ అవకతవకలను సరిచేసి అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలి.

గతంలో గిరిజనులకు భూమికి భూమి ఇచ్చిన అవి అనేకచోట్ల ఆ భూయజమానులతో గొడవలు జరుగుతున్నాయి. వాటిని సరి



చేయాలి. 2017వ సంవత్సరంలో పెట్టిన కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా కూనవరంలో పెట్టిన 10.10.2022 కట్ ఆఫ్ తేదీని వేలేరుపాడు కుక్కునూరు మండలాల్లో కూడా అమలు చేసి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ప్యాకేజీ ఇవ్వాలి. పునరావాస ప్రాంతంలో ఇల్లు పంపకాల విషయంలో సరైన విధానం అవలంబించాలి. వేల కుటుంబాలను ఒకే చోట(చల్లవారిగూడెం) పునరావాసం కల్పిస్తున్నారు దానికి అనుగుణంగా ఉపాధి చూపించాలి.పోలవరం వలన నష్టపోతున్న కుటుంబాలకు అందించే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, స్ట్రక్చర్ వేల్యూ, భువిలువలు, ఇతర ప్యాకేజీలు అన్నీ ఒకేసారి ఇచ్చి తరలించాలి.2022 కటాఫ్ తేదీని కుకునూరు, వేలేరుపాడు మండలాలకు కూడా వర్తింప చేయాలి.ఈ కార్యక్రమంలో సిపిఐ నుండి బాడిశ రాము, సన్నెపల్లి సాయిబాబు, కారం దారయ్య. ఎర్ర మధు, జాన్ బాబు. సిపిఎం నుండి మడివి దుర్గారావు, ధర్మల రమేష్, కారం వెంకట్రావు, కొత్త వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నుండి కొల్లూరి సత్యనారాయణ, ఎస్.కె ఇబ్రహీం, వలగాని సమ్మయ్య, మడకం సుబ్బారావు, వేలుపూరి వెంకటస్వామి, సిపిఐ ఎంఎల్ ప్రజా పందా మా మాస్ లైన్ నాయకులు గడ్డాల ముత్యాలరావు, కరటం ముత్యాలరావు ,ఉకే బుచ్చయ్య. ఎమ్మార్పిఎస్ మండల అధ్యక్షులు తుంగ శ్రీనివాసరావు, కరటం మల్లేష్, ధర్మల మహేష్, ధర్మల కుమారి ,ఉకే ఐశ్వర్య, మాడి కవిత ,కరటం సుధారాణి, పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు పాల్గొన్నారు.

# కోవిడ్ 19 కాలంలో తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయి వారి తనయులు ఉన్నత స్థితికి వచ్చేంత వరకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుంది.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం మిషన్ వాత్సల్య పథకం – జిల్లా బాలల రక్షణ విభాగం, జిల్లా శిశుసంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి పిల్లల సంరక్షణ పథకం లబ్ధిదారులతో సంభాషణ మరియు ఆర్థిక అక్షరాస్యత శిక్షణా కార్యక్రమం జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. కోవిడ్ 19 కాలంలో తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి అనాథలుగా మిగిలి పోకూడదని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పిఎంకేర్స్ ఆర్ఫాన్ చిల్డ్రన్స్ స్కీమ్ ద్వారా లబ్ధి పొందుతున్న 56 మంది లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టరు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ 22 మంది బాలలను వారి యొక్క ఆరోగ్యము, చదువు, వసతి వివరాలతో పాటు వారి యొక్క ఆర్థిక ప్రగతికి అభివృద్ధి చెందే మార్గాలను అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు జిల్లాలో ఉన్న 22 మంది బాలలు, కొవ్వూరు డివిజన్ సంబంధించి ముగ్గురు బాలలు, వెస్ట్ గోదావరి భీమవరంకి సంబంధించి 13 మంది బాలలతో వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వీరిలో 18 సంవత్సరాలు వయసు పూర్తి చేసుకుని ఉన్న 13 మంది బాలలకు పోస్టల్ డిపార్ట్మెంటు ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాలు గురించి మరియు ఇతర సౌకర్యాలు గురించి వివరించి పోస్టల్ డిపార్ట్మెంటు సూపర్డెంటు సుబ్రహ్మణ్యం ద్వారా తెలియ జేయడమైనదని అన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి విచ్చేసిన బాలలు అందరికీ కూడా వారి యొక్క మానసికస్థితిని తెలుసుకునుటకు మెంటల్ అసెస్మెంటు టెస్టులను సైకియాట్రిస్ట్ డాక్టరు వంశీకృష్ణ నిర్వహించడం జరిగిందని తెలిపారు. 10 వ తరగతి మరియు ఇంటర్ పూర్తి చేసి ఖాళీగా ఉన్న నలుగురు బాలలకు స్కిల్ డెవలప్మెంటు ద్వారా వృత్తి విద్యా కోర్సులు నేర్పించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్మెంటు అధికారిని ఆదేశించారు. ప్రతి ఒక్క చైల్డ్ వారి యొక్క నెలవారి అభివృద్ధి, ఆరోగ్య పరిస్థితి, విద్యా వికాసం పురోగతి మరియు ఇతర అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ పోర్టల్ లో అప్డేట్ చేయవలసిన రిపోర్ట్ లు నిర్ణీత సమయంలో సమర్పించ వలసిందిగా ఐసిడిఎస్ పిడిని జిల్లా కలెక్టరు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ సాధికారతాధికారి పి.శారద, జిల్లా బాలల సంరక్షణ అధికారి సి.హెచ్. సూర్యచక్రవేణి, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు.శోభ, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ జిల్లా అధికారి యన్.జితేంద్రబాబు, సైకియాట్రిస్ట్ డాక్టరు వంశీకృష్ణ, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటరు డాక్టరు రాజీవ్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంటు ఏఎల్ఎస్ కో-ఆర్డినేటరు సొంగా నాగేశ్వర రావు, జిసిడిఓ నవీన, పోస్టల్ డిపార్ట్మెంటు సూపరిండెంటు సుబ్రహ్మణ్యం, లీడ్ బ్యాంకు మేనేజరు వారి సిబ్బంది, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుండి లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు వారి సంరక్షకులు, డిసిపియు సిబ్బంది శ్రీకాంత్, బాలస్వామి, రాజేష్, రాజకుమార్, మహేష్, మాధవి తదితరులు హాజరైనారు.

## రామాపురం గిరిజనులకు సన్ రైజ్ సంస్థ రూ.50 వేల విలువైన దుస్తుల పంపిణీ





ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

మండలంలోని, పెద్దమట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోగల అతి మారుమూల గ్రామమైన రామాపురం గ్రామంలో బుధవారం ఎంపిపి కారం.లక్ష్మి, స్థానిక ఎంపిటిసి పూనెం. ప్రతీఫ్ కుమార్ ల చేతుల మీదుగా, తెలంగాణా రాష్ట్రం, ఖమ్మం జిల్లా, వైరా కేంద్రంగా పనిచేస్తున్న సన్ రైజ్ సంస్థ నిర్వాహకులు రూ.50 వేల విలువైన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి, ఎంపిటిసి ప్రతీఫ్ కుమార్ లు మాట్లాడుతూ సన్ రైజ్ సంస్థ నిర్వాహకులు నిరుపేద గిరిజనుల పట్ల సేవా దృక్పథంతో, సుమారు 200 కిమీ నుండి వచ్చి దుస్తులు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. గత రెండు నెలల క్రితం ఇదే సంస్థవారు రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన సోడేపహాడు గ్రామ గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారని గుర్తు చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతీ దాస్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు, బిజెపి ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎనుగు సుమన్ బాబు సోదరుడు ఎనుగు కిరణ్ బాబు వివాహ వార్షికోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని బట్టలు పంపిణీ చేశామన్నారు. నిరుపేదలకు దానం చేయటమే అసలైన మానవ సేవ అనీ అందుకే అంత దూరం నుండి వచ్చి ఇక్కడ సేవచేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు పులి.సంతోష్ కుమార్, చిచ్చడి.బాబురావు, మాజీ కో.ఆప్షన్ సభ్యులు ఎస్.కె.ఇబ్రహీం, సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం.రాజులు, ఆ పార్టీ మండల నాయకులు పంకు.సత్తిబాబు, గుండిపుడి.లక్ష్మణ్ రావు, కారం.సుందరయ్య, కారం.సత్తిబాబు, కల్లూరు మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్ బాబు, సంస్థ ప్రతినిధులు ఏనుగు కిరణ్ బాబు, శోభన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అధికారులపై మరోసారి మంత్రి నిమ్మల ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



అధికారుల నిర్లక్ష్య వైఖరి పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆచంట మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్ పాలకొల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డయాలసిస్ రోగులకు మంచినీరు సరఫరా లేకపోవడంతో 30 మంది రోగులకు కేవలం 17 మందికి మాత్రమే డయాలసిస్ జరుగుతుందని మంత్రి కార్యాలయంలో మంత్రి నిమ్మలకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి నిమ్మల సంబంధిత అధికారులు అయిన కమ్యూనిటీ సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎర్ర మాధురి, డయాలసిస్ మేనేజర్, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్ బి విజయ సారథి, అదేవిధంగా సొంత పిఎ హనుమ పై కూడా మండి పడ్డారు. తాను ఎంత కష్టపడి రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్న మీలాంటి అధికారుల వల్ల ఆ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరు అయిపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి డయాలసిస్ సెంటర్ తేవడం జరిగిందని దానికి అవసరమైన మూడు ట్యాంకర్లు మంచినీరు కావాల్సి ఉండగా ఒకే టాంకర్ సరఫరా చేసి రెండు ట్యాంకర్ల నీరు ఎందుకు సరఫరా చేయలేకపోయారని ఆ విషయాన్ని మీరే పరిష్కరించకుండా ఉండడం వల్లే 30 మంది డయాలసిస్ రోగులకు కేవలం 17 మంది మాత్రమే డయాలసిస్ జరుగుతోందని మిగతా 13 మందికి నిలిచిపోయిందని వారు ఎంత బాధ పడతారు అసలే వేసవికాలం మీకు తెలియదా, మీ జీతాలు మీరు తీసుకుంటే సరిపోతుందా బాధ్యతగా పనిచేయడం తెలియదా అని నిలదీశారు. దీంతో వారంతా కూడా తప్పు తెలుసుకుని ఇకపై అలాంటి పరిస్థితి రానివ్వమని చెప్పడంతో మంత్రి నిమ్మల శాంతించారు.

## చిక్కాలలో 5వ దశ రీ-సర్వే పనుల పరిశీలన

### తుపాకులగూడెంలో పరిశ్రమల భూ బ్యాంకుల తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ మేఘా స్వరూప్

ప్రజాభూమి ప్రతినిధి-కొవ్వూరు



జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ బుధవారం చాగల్లు మండలం చిక్కాల గ్రామంలో 5వ దశ రీ-సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్ర స్థాయి సిబ్బందికి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు రీ-సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని సూచనలు చేశారు. అనంతరం చాగల్లు మండలం చిక్కాల గ్రామంలో నాన్ సిగ్నల్ విలేజ్ రీ-సర్వే గ్రౌండ్ ట్రూతింగ్ పనులను అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ బి. లక్ష్మీనారాయణతో కలిసి పరిశీలించారు. గ్రామస్థుల భూహక్కులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. తదుపరి కొవ్వూరు ఆర్డీవో కె. ఆనందరావుతో కలిసి తాళ్లపూడి మండలం తుపాకులగూడెం గ్రామంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రభుత్వ భూ బ్యాంకులను పరిశీలించారు. ప్రభుత్వ భూముల వివరాలను సమగ్రంగా నమోదు చేసి భవిష్యత్తు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డీవో కె. ఆనందరావు, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ బి. లక్ష్మీనారాయణ, సంబంధిత మండల తహసీల్దార్లు, సర్వే సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సిపిఎం

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం



మండలంలోని టేకుల బోరు సిపిఎం పార్టీ మార్త శ్రీరామ్ మూర్తి భవనంలో పాయం సీతారామయ్య అధ్యక్షతన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి జరిగింది ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తలగాని నాగరాజు సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు మాట్లాడుతూ భూస్వాముల జమీందారుల కడుపులో పుట్టిన పేదవాళ్ల పక్షాన నిలబడి వాళ్ళ హక్కుల సాధనకై కార్మికుల కర్షకుల కష్టజీవుల అండగా ఉంటూ తొలితరం కమ్యూనిస్టుగా పేరు పొందిన కమ్యూనిస్టు నాయకుడు అంతేకాకుండా తెలంగాణ లో రైతంగ సాయుధ పోరాటం వీరుడిగా పేదల ప్రజల మనలను పొందారు ,తెలంగాణలో నిజం దొరలకు వ్యతిరేకంగా పోరాడిన నాయకుడని ఆయన ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచాడని అన్నారు. సిపిఎం పార్టీ ఆల్ ఇండియా పార్టీ కార్యదర్శిగా పనిచేసే దేశంలోని సిపిఎం పార్టీ విస్తరింప చేయడానికి కృషి చేశారని, వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి కర్మికుల పక్షాన నిలబడి పోరాడిన వ్యక్తి కడుపు కాలుతున్నోడికి అన్నం పెట్టని చట్టం చుట్టం కాదని ఇప్పుడు ఉన్నటువంటి ఉపాధి హామీ చట్టం రావడానికి ముందు పనికి ఆహారం పథకం ఉండేది దాని రూపాంతరమే నేడు ఉపాధి హామీ చట్టంగా పేదలకు అన్నం పెట్టే పథకంగా ఉంది అని దీనికి మూల కారణం కామ్రేడ్ సుందరయ్య ఆసాయా సాధనలో పోరాటాల ఫలితమే అన్నారు. ఇప్పుడు ఉన్నటువంటి ప్రతి కమ్యూనిస్టులు కూడా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని కోరారు ఈ సమావేశంలో మండల కార్యదర్శి బాబు బోర్రయ్య, మండల కమిటీ సభ్యులు తాలూరి శ్రీనివాసు తెల్లం తమ్మయ్య మడకం నాగమణి శాఖ కార్యదర్శి ఈశ్వర్ సన్ముఖరావు వియిక కన్నయ్య మడకం సత్యనారాయణ తొండ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు..

## చింతరేగుపల్లి గ్రామంలో పిసా కమిటీ సభ్యుల ముఖ్య సమావేశం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని చిన్న మట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లి గ్రామంలో బుధవారం పిసా కమిటీ సభ్యుల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్ట రామారావు ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోటం జయరాజు మాట్లాడుతూ పిసా కమిటీ తీర్మానాలు లేకుండా ఇష్ట రాజ్యాంగం వ్యవహరిస్తున్న పంచాయతీ సెక్రెటరీలు, కనీసం పిసా కమిటీ సభ్యులకు సమాచారం ఇవ్వని పరిస్తితి ఉందని అన్నారు. అధికారులు, సర్పంచ్ పదవి కాలం ముగించడంతో పంచాయతీ సెక్రెటరీ అలాగే ఉన్నత అధికారులను నియమించిన కూటమి ప్రభుత్వం మరి గతంలో సర్పంచులు వార్డు మెంబర్లు ఎంపీటీసీ పిసా కమిటీ సభ్యులు భాగస్వాములై ఏ గ్రామ సభ పెట్టిన అధికారులు ముందుగా తెలియపరిచేవారు మరి ఇప్పుడు అలా కాకుండా అధికారులు ఏ తీర్మానాలు లేకుండా ఇష్టరాజ్యంగా పంచాయతీ నిధులను ఖర్చు చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐ టి డి ఏ పి ఓ, ఉన్నత అధికారులతో సమావేశం పెట్టి పంచాయతీ వేజుగా ఎవరైతే కమిటీ సభ్యులు ఉన్నారో వాళ్లకి సమాచారం ఇచ్చి మన గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, అలాగే గ్రామస్తులకు మాజీ సర్పంచ్లకు వార్డు మెంబర్లకు ఎంపీటీసీలకు పిసా కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ట టింకు, కరుణాకర్, సోడి రామారావు, పాయశీ సత్యనారాయణ సవలశీ దుర్గప్రసాద్ పీట శశీకర్, కుశీజ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### కార్మిక హక్కుల కోసం కృషి చేస్తున్న

## సూరిబాబుకు “శ్రమశక్తి 2026” అవార్డు



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “శ్రమశక్తి 2026” అవార్డును రాష్ట్ర తెలుగు దేశం పార్టీ టీఎన్టీయూసీ కార్యదర్శి బండారు సూర్యనారాయణ (సూరిబాబు) అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు ప్రదానం చేయబడింది. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తూ కార్మిక సంఘాల బలోపేతానికి విశేష కృషి చేస్తున్న సూరిబాబుకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు మాట్లాడుతూ, కార్మిక వర్గాల సంక్షేమం కోసం అహర్నిశలు పనిచేస్తున్న సూరిబాబు సేవలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆయన మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీఎన్టీయూసీ నాయకులు, టీడీపీ కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొని సూరిబాబుకు అభినందనలు తెలిపారు.

## చింతలపూడి - కామవరపుకోట రహదారి నెలలో పూర్తి చేస్తాం

### - కామవరపుకోట టీడీపీ నేతలతో ఎమ్మెల్యే రోషన్

ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట



నియోజకవర్గంలో అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టా... ఇప్పటికే ఏలూరు - జంగారెడ్డిగూడెంతో పాటు పలు గ్రామాలకు రహదారుల సౌకర్యం కల్పించడంలో వేగంగా దూసుకు వెళుతున్నాం... చింతలపూడి - కామవరపుకోట రహదారిని కూడా నెల రోజుల్లో పూర్తి చేస్తానని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్కుమార్ స్పష్టం చేశారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ఎమ్మెల్యేను కామవరపుకోట టీడీపీ నాయకులు బుధవారం చింతలపూడిలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు చింతలపూడి - కామవరపుకోట రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్న విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించగా... ఎమ్మెల్యే నెల రోజుల్లోనే ఈ రహదారిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నెక్కలపు గంగాధరరావు, క్లస్టర్ ఇంచార్జి బొబ్బిలి డాన్ దివాకర్ బాబు, టౌన్ సెక్రటరీ బిరుదుగడ్డ రాజేష్, మల్లెల్లి కాంతారావు, గోధుమ మధు, బూత్ ఇంచార్జి అల్లే భద్రి ఉన్నారు.

## వన్ ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి.

### -ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కె. రాములు నాయక్.



ప్రజా భూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

వన్ ధన్ వికాస కేంద్రాల బలోపేతానికి సభ్యులు కృషి చేయాలని కోట రామచంద్రపురం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి కె.రాములు నాయక్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం ఐదు మండలాల వన్ ధన్ వికాస కేంద్రాల పనితీరును పీవో సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో పిఓ రాములు నాయక్ మాట్లాడుతూ అడ్డాకుల తయారీ, అమ్మకం, కారం, చింతపండు, వేరుశనగ, తదితర అటవీ ఉత్పత్తుల ప్రాసెస్, మార్కెటింగ్ లపై దృష్టి పెట్టాలని సూచించారు. కేంద్రాల సభ్యులు కేంద్రాలను బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఆది మహోత్సవం కు హాజరైన కొరుటూరు కు చెందిన స్వయంకృషి వికాస కేంద్రం సభ్యులు తమ పర్యటన పై పూర్తి నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.రాజబాబు, లు పద్మావతి, శ్రీనివాస్, నరసింహారావు, జేమ్స్, సిసి లు, తదితరులు హాజరయ్యారు.

## పాలకొల్లు పట్టణ పరిధిలో బడి పిలుస్తుంది..

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు



పాలకొల్లు పట్టణ పరిధిలో గల కొత్తపేట స్పెషల్ మున్సిపల్ మోడల్ ప్రాథమిక పాఠశాల యందు ఎంఈఓ గుమ్మల్ల వీర స్వామి ఆధ్వర్యంలో బడి పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. వార్డు లోనీ ప్రతి ఇంటింటికి సర్వే చేసి ఫైవ్ ప్లస్ విద్యార్థులను. మరియు ఆరో తరగతి నుండి టెన్త్ క్లాస్ వరకు మధ్యలో బడి మానేసిన విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడం జరిగింది. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో కల్పి స్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు స్పష్టంగా అవగాహన పరిచారు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే అత్యుత్తమ బోధన . శారీరక మాన సిక ఆరోగ్యం క్రీడల ద్వారా జరుగుతుందని. విద్యార్థుల కోసం సన్న బియ్యం అన్నశీ. పోషకా హార విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం. ప్రభుత్వ వారు సరఫరా చేసే ఉచిత పుస్తకా లు. యూనిఫామ్స్. వెనకబడిన విద్యార్థుల కొరకు రెమిడీయల్ పుస్తకాలు పంపిణీ చేస్తామని. 22వ వార్డులో ఇంటింటికి తిరిగి పాఠశాల ప్రవేశాలు చేశామనీ ఈ సంద ర్భంగా చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రాంత్. ఉపాధ్యాయులు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఫిల్మ్ ఇనిస్టిట్యూట్లో శరవేగంగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలో మొట్టమొదటిసారిగా అల్లూరి సీతారామరాజు నేషనల్ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో శిక్షణా కార్యక్రమం శరవేగంగా జరుగుతుందని ప్రిన్సిపల్ రాజా వన్నెంరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు తీరి.ప్రాక్టికల్ జరుగుచున్నవని ఇందులో భాగంగా మైమ్ యాక్టింగ్ నేర్పుటకు మైమ్ మధు అద్భుతంగా కోచింగ్ ఇచ్చారు. అలాగే మేకప్ మరియు అలంకరణ పై హరిచంద్ర చక్కగా మేకప్ వేసి అలంకరణ చేసి చూపించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రిన్సిపాల్ రాజా వన్నెం రెడ్డి. ప్రొఫెసర్ డాక్టర్ ఈసునాద్ రాథోడ్. ప్రొఫెసర్ రామ్మోహన్ శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేగొండి హరి రామ జోగయ్య. అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు డాక్టర్ వర్మ. జగపతి రాజు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థాన భూమి స్వాధీనం

### హైకోర్టు ఆదేశాల మేరకు కోటి రూపాయల విలువైన భూమి దేవస్థానానికి అప్పగింత.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం వెదురేశ్వరం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన సుమారు కోటి రూపాయల విలువైన 0.37 సెంట్ల భూమి అన్యాక్రాంతం నుంచి విముక్తి పొందింది. 2011-2012 సంవత్సరం నుండి ఆక్రమణలో ఉన్న ఈ భూమిని ఆంధ్రప్రదేశ్ గౌరవ హైకోర్టు తీర్పులను అనుసరించి దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ పర్య వేక్షణలో తనిఖీదారు బాలాజీ రాంప్రసాద్, కార్యనిర్వహణాధికారులు, దేవాదాయ శాఖ సిబ్బం ది, రెవిన్యూ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది, గ్రామపంచాయతీ, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు గ్రామస్తుల సమక్షంలో ఆక్రమణదారులు స్వచ్ఛందంగా భూమిని దేవస్థానానికి స్వాధీనం చేశారు. ఈ ఏవిక్షన్ ప్రక్రియ ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తికావడంతో జిల్లా దేవాదాయ శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారులకు, సిబ్బందికి, గ్రామస్థులకు స్వచ్ఛం దంగా భూమిని అప్పగించిన ఆక్రమణదారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దేవాదాయ శాఖ చేపట్టిన ఈ చర్యతో దేవాలయ ఆస్తుల పరిరక్షణకు మరింత బలమైన సందేశం వెళ్లిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

ప్రజాభూమి



గురువారం 21 మే 2026

# నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై సంతకాల సేకరణ




ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఇటీవల నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ గురైన నేపథ్యంలోఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజ్ కి కారణమైన ఎన్.టి.ఏ. ను రద్దుచేసి మెడికల్ కళాశాలల సీట్ల భర్తీ ప్రక్రియను రాష్ట్రాలకే అప్పగించాలనే డిమాండ్ తో ఒక వినతి పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పంపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్ గంగిరెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేకరించే ఈ సంతకాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రికి అందజేస్తామని జిల్లా కన్వీనర్ కె.మల్లిక్ దత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భావి భారత డాక్టర్ల ఆశలపై నీళ్లు చల్లుతూ 23 లక్షల మంది అభ్యర్థులను దిగ్భ్రాంతికి గురి చేస్తూ లీకేజీ కారణంగా నీట్ 2026 పరీక్షను ఎన్.టి.ఏ రద్దు చేసిందని, ఇది ఎన్.టి.ఏ. ఘోర వైఫల్యమని పేర్కొన్నారు. ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుకొని, ఖర్చులు భరించి వైద్య విద్యను అభ్యసించడానికి విద్యార్థులు అహోరాత్రులు కష్టపడి సిద్ధపడతారని, తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తు కోసం లక్షలాది రూపాయలు అప్పు చేసి చదివిస్తారని, అలాంటి వారి కష్టాన్ని వృథా చేస్తూ ఎన్ టి ఏ అసమర్థ, అవినీతి విధానాల వల్ల ఇలాంటి లీకేజీలు వరుసగా జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్య కేంద్రీకరణ, వ్యాపారీకరణ, ప్రైవేటీకరణ విధానాల వల్లనే ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, కోచింగ్ సెంటర్ల మాఫియా ఎన్ టి ఏ తో కుమ్మక్కై పేపర్లు లీక్ చేసుకోవడానికి శత విధాలా ప్రయత్నిస్తున్నారని, ఈ పరిస్థితులలో మెడికల్ ప్రవేశ పరీక్షను రాష్ట్రాల స్థాయిలోనే ఒక స్వయంప్రతిపత్తి కలిగిన అకడమిక్ బాడీ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, పారదర్శకంగా విచారణ జరిపి విషయాలను ప్రజలకు తెలియజేయాలని, అవినీతి, అసమర్థ ఎన్టీఏను రద్దు చేయాలని, రాష్ట్రాల స్థాయిలోనే మెడికల్ ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోమశేఖర్, కో కన్వీనర్ ఎం.రామాంజనేయులు, సభ్యులు అల్తాఫ్ హుస్సేన్, సలీం బాషా, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఏఆర్ పోలీస్ సిబ్బందికి వీక్లీ పరేడ్‌లో భాగంగా యోగా సెషన్




ప్రజా భూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు బుధవారం వీక్లీ పరేడ్‌లో భాగంగా స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఏఆర్ పోలీస్ సిబ్బందికి ప్రత్యేక యోగా సెషన్ నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం ఒత్తిడితో కూడిన విధులను నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసమే ఎస్పీ ఈ ప్రత్యేక యోగా శిక్షణను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు ఈ యోగా సెషన్‌లో ఏఆర్ సిబ్బంది అందరూ అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన యోగా నిపుణుల పర్యవేక్షణలో సిబ్బందికి పలు రకాల ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, (మెడిటేషన్) లపై అవగాహన కల్పించి, వారితో యోగాసనాలు వేయించారు. ఒత్తిడి నివారణ, రోజువారీ విధుల్లో ఎదురయ్యే తీవ్రమైన మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఎంతో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను క్రమం తప్పకుండా యోగాసనాలు చేయడం ద్వారా అధిగమించవచ్చని వివరించారు. పనితీరు మెరుగుదల, యోగా వల్ల పోలీస్ సిబ్బందిలో ఏకాగ్రత, క్రమశిక్షణ పెరిగి, వారి విధి నిర్వహణ మరింత మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## రాగుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

### -సద్వినియోగం చేసుకోవాలని సూచన

ప్రజాభూమి, హిందూపురం టౌన్




హిందూపురం రూరల్ మండల పరిధిలోని బీరేపల్లి రైతు సేవా కేంద్రంలో రాగులు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, జిల్లా వ్యవసాయ అధికారి నారాయణ నాయక్, సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్యలు బుధవారం రాగుల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాగులు పండించిన రైతులందరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రంలోని అధికారుల వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. అలాగే రైతులు పండించిన రాగులను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. గరిష్ఠంగా ఒక రైతు ఎకరాకు 14 క్వింటాలు చొప్పున కొనుగోలు జరుగుతుందని, ఒక క్వింటాలు రాగులను రూ.4886 మద్దతు ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో రాగులు పండించిన రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, నాయకులు ఆదినారాయణ, శ్రీరామప్ప, వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి రామకృష్ణ, రైతులు, స్థానిక నాయకులు,రైతు సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ షాపుల బంద్ విజయవంతం

### -ర్యాలీ నిర్వహించిన కెమిస్ట్, డ్రగ్గిస్టులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్




ఏఐసిఓడి పిలుపు మేరకు బుధవారం హిందూపురం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెడికల్ షాప్ ల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా కెమిస్ట్, డ్రగ్గిస్టులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌక్, న్యూ శ్రీనివాస్ మెడికల్ స్టోర్ నుండి ర్యాలీగా తహసిల్దార్ కార్యాలయం చేరుకొని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, అన్ లైన్ ద్వారా మందుల అమ్మకాలను నిషేధించాలని డిమాండ్ చేశారు. అలాగే నాసిరకం మందులను అరికట్టాలని, జిఎస్సార్ 220ఈ ను రద్దు చేయాలని, సామాన్య కెమిస్ట్రీ ఫార్మసిస్టుల హక్కులను కాపాడాలని కోరారు. దీనికి తోడు ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలని తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, హిందూపురం పట్టణ అధ్యక్షులు శివకుమార్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి రాజేష్, కార్యవర్గ సభ్యులతో పాటు హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు మండలాలకు చెందిన మెడికల్ షాపుల ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## జూనియర్ టి ఆర్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం గూడూరు పట్టణంలోని సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు శంకర్ రెడ్డి మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, త్వరలో రాజకీయాల్లోకి రావాలని, ఆయన అభిమానులుగా ఆశిస్తున్నామన్నారు. సాయిరాం చారిటబుల్ ట్రస్ట్ లోని వృద్ధులు మహిళలు ట్రస్టు నిర్వాహకులు జూనియర్ ఎన్టీఆర్ కి ఆశీస్సులు తెలియజేశారు.



## జాతి అభివృద్ధి విద్యతోనే సాధ్యం

### -విద్యార్థులకు వడ్డే ఓబన్న ప్రతిభా పురస్కారాల ప్రదానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



జాతి అభివృద్ధి విద్య ద్వారానే సాధ్యమవుతుందని, విద్య నేర్చుకోవడం వల్ల సమాజంలో ప్రత్యేక గౌరవ ప్రతిష్టలు దక్కుతాయని వడ్డెర్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. అఖిల భారత ఒడ్డె ఓబన్న సేవా సమితి వడియరాజులు ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వడ్డే ఓబన్న యువ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వడ్డే ఓబన్న వారసులు బాల నరసింహులు హాజరై భవిష్యత్తులో వడ్డెరలు ఉన్నతంగా ఎదగాలని, భావితరానికి బాసటగా నిలవాలని సూచించారు. అనంతరం వడ్డెర సంఘం నాయకులు వడ్డి సుధాకర్ మాట్లాడుతూ, జాతి అభివృద్ధి విద్యతోనే సాధ్యమని, విద్యార్థుల చదువు కోసం తమవంతుగా తగిన సహాయ సహకారాలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని తెలియజేశారు. వడియారాజులు ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశులు, గౌరవాధ్యక్షులు అశ్వర్థప్ప మాట్లాడుతూ, విద్య పట్ల విద్యార్థులకు ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, రవి, ఆంజనేయులు, శ్రీకాంత్, రాజు, వేణు జిల్లా వ్యాప్తంగా ఉన్నత మార్కులు సాధించిన వడ్డెర విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వైకాపా కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

### -జోనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



వైకాపా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ చల్లా మధుసూదన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రధానంగా ఓటర్ల పరిశీలన చేస్తూ పార్టీకి చెందిన సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా చూసే బాధ్యత బూత్ ఏజెంట్ లదేనని పేర్కొన్నారు. అదే విధంగా హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 253 పోలింగ్ బూత్ లు ఉన్నాయని, ప్రతి బూతుకు పార్టీ బిఎల్ఏ ఒకరు ఉంటారని, ఎన్నికల సీజన్ ప్రారంభమైందని, ఇప్పటి నుంచి బిఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూటమి నేతలు అక్రమంగా ఓట్లను నమోదు చేసుకోకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత బూత్ స్థాయి ఏజెంట్లపై ఉంటుందన్నారు. దేశంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఓటర్ల నమోదు అక్రమ తంతుగా మారిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బూత్ ఏజెంట్లే కీలకమని, తగు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో బూతు స్థాయి బిఎల్ఓలతోపాటు పార్టీ నియోజకవర్గ, పట్టణస్థాయి నాయకులు, మాజీ స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి -ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎంయుఏ కోరారు. ఏపీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా బుధవారం హిందూపురం డిపోలో ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ, కొత్తగా ప్రవేశనున్న విద్యుత్ బస్సులను ప్రైవేట్ కంపెనీలకు ధారాదత్తం చేయకుండా ఆర్టీసీ లేదా ప్రభుత్వం కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఇస్తున్న జీరో టికెట్స్ చేసే విధానాన్ని వెంటనే నిలుపుదల చేసి మిగతా వాళ్లకు మాత్రమే టికెట్ ఇచ్చే విధంగా చేసి కండక్టర్లకు పని భారం తగ్గించాలని కోరారు. పి.ఆర్.సి.కమిటీని వేసి వెంటనే ఐ.ఆర్.చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏలు అరియర్స్ తో సహా చెల్లించి లీవ్ ఎన్ క్యాష్ మెంట్ చేసుకొనే అవకాశం కల్పించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఈ.హెచ్.ఎస్ ద్వారా కాకుండా పాత పద్ధతిలోనే ఆర్టీసీ ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని, పెరిగిన ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టుగా బస్సుల సంఖ్య ను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమము డిపో కార్యదర్శి సి. వెంకటేష్, రీజినల్ కార్యనిర్వహణ అధ్యక్షులు పి.రాజారెడ్డి , రీజినల్ సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మి , రీజనల్ ఉపాధ్యక్షులు టి.వలి సాబ్ , రీజినల్ సంయుక్త కార్యదర్శి జే.రవికుమార్ , డిపో అధ్యక్షులు ఆర్.రంగనాథప్ప , డిపో ముఖ్య ఉపాధ్యక్షులు టీ.ఎస్.నాథ్ డిపో ఉపాధ్యక్షులు ఎస్.పి.ఎం భాషా, గ్యారేజ్ కార్యదర్శి జి.రాంప్రసాద్ డిపో సంయుక్త కార్యదర్శి వి.రాజు పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు .

## 26 ఏళ్ల కార్మిక సేవలకు 'శ్రమశక్తి' అవార్డు అందుకున్న డా. అంబూరు సింధూజ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రతి సంవత్సరం ప్రదానం చేసే "శ్రమశక్తి" అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గత 26 సంవత్సరాలుగా అహర్నిశలు కృషి చేస్తున్న తిరుపతికి చెందిన టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోన్-4 ఇంచార్జ్ డా. అంబూరు సింధూజకు ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా "శ్రమశక్తి" అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ కార్యదర్శి ఎం.వి. శేషగిరి బాబు (ఐఏఎస్), కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు (ఐఏఎస్), కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీషా, కార్మిక శాఖ చైర్మన్లు గొట్టుముక్కల రఘురామరాజు, వి. మల్లికార్జునరావు, గండిబాబ్జి, కార్మిక శాఖ అధికారులు, యాజమాన్యాలు, కార్మిక నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెడికల్ షాపులు బంద్

### ఆన్లైన్ మందుల అమ్మకాలు నిలిపివేయాలి

### కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలి

### నకిలీ మందుల అమ్మకాన్ని నిలిపివేయాలి

ప్రజా భూమి ప్రతినిధి పిచ్చాటూరు.




పై డిమాండ్లపై అఖిల భారత కెమిస్టుల సమైక్య ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా పిచ్చాటూరు మండలంలో మెడికల్ షాపుల యాజమాన్యులు బందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్లో జరుగుతున్న అమ్మకాలు నిలిపివేస్తూ,కార్పొరేట్ సంస్థలకు అందిస్తున్న అధిక డిస్కౌంట్ లను నిలిపివేస్తూ, మార్కెట్లో జరుగుతున్న నకిలీ మందుల అమ్మకాన్ని నిలిపివేస్తూ రోగులకు మెడికల్ బిల్లులను తక్కువ ధరలకు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మెడికల్ షాప్ యాజమాన్యులు కోరారు. ఈ మెడికల్ షాప్ బంద్ కార్యక్రమానికి పిచ్చాటూరు మండల మెడికల్ షాప్ యాజమాన్యులుమెడికల్ షాపులను మూత వేసి నిరసన తెలుపుతున్నారు.

## అనాధాశ్రమ పిల్లల మధ్య ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మధనంబేడు గ్రామంలో నడుస్తున్న అనాధాశ్రమంలో మండల జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను అనాధాశ్రమ పిల్లల మధ్య ఘనంగా జరుపుకున్నారు. బుధవారం ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ అసోసియేషన్ అభిమానులు పృధ్విరాజ్, శీను,కిరణ్ సాయి,మహేష్,మౌళి, టెంకరు సాయి, హరికృష్ణ,విష్ణు,మగీ,జయకుమార్ తదితరులు పిల్లలు మధ్య కేకులు కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో అనాధాశ్రమ నిర్వాహకులకు జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ ఫాన్స్ మిక్సీ పరికరాన్ని వితరణ చేశారు.ఇదే గాక పిల్లల భోజనం వసతి కోసం ప్రతి నెల రెండు బస్తాల బియ్యాన్ని,నిత్యవసర వస్తువులను అందిస్తామని ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ హామీ ఇచ్చారు. అంతకుమునుపు జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ అభిమానులు సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలకు వెళ్లి పలువురు రోగులకు,గర్భిణీలకు, రొట్టె,పండ్లను పంపిణీ చేశారు.ఇదే గాక సత్యవేడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు కూడా రొట్టె, పండ్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి సుహాయల్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మధనంబేడులో నేడు గంగ జాతర చాటింపు

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



తిరుపతి జిల్లా సత్యవేడు మండలం మధనంబేడు గ్రామంలో మే 20వ తేదీన( బుధవారం )గంగమ్మ జాతరకు చాటింపు వేశారు.ఇందులో భాగంగా గంగమ్మ కొలువుతీరే శక్తి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగ జాతర చాటింపును పురస్కరించుకుని మహిళలు పెద్ద ఎత్తున వేప సరాలు తొడిగిన పాత్రలో అమ్మవారికి అంబళ్లు పోసి పూజలు జరిపారు.మే 27 28, తేదీలలో రెండు రోజులపాటు గంగజాతర జరగనుంది.

## కువైట్లో చిత్రహింసలు పడుతున్న మా కుమార్తె భాగ్యవతిని ఇండియాకు రప్పించండి

**కన్నీటి పర్యంతరమవుతున్న భాగ్యవతి తల్లి టి.తులనమ్మ, తండ్రి టి.చెంచయ్య.**

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి



చంద్రగిరి తొండవాడ పంచాయతీ గోపాలపురం ఎస్టీ కాలనీకి చెందిన మా కుమార్తె సుమారు 10 లక్షలు దాక అప్పుల ఊబిలో కూరుకుపోగా వాటిని తీర్చడానికి మా కుమార్తె భాగ్యవతి కువైట్ కి వెళ్లిందని, ఇంటి పనులు కాకుండా అక్కడ ఇతరిత్రా పనులతో కువైట్ లోని సేటు చిత్రహింసలు పెడుతున్నాడని ఆమె తల్లిదండ్రులు కన్నీటి పర్యంతరం అవుతున్నారు. పీలేరు కి చెందిన ఏజెంట్ చిన్నబ్బ మా కుమార్తెను కువైట్లో అమ్మివేసినట్లు తెలిసింది అన్నారు. మా కుమార్తె ఇండియాకు రావాలంటే ఏజెంట్ చిన్నబ్బ కి ఇచ్చిన డబ్బులు కడితేనే పంపిస్తాం అంటూ సేట్ మా కుమార్తెను కువైట్లో శారీరకంగా మానసికంగా హింసిస్తున్నారని దీంతో దిక్కు తోచని స్థితిలో ఆమె కుమిలిపోతున్నట్లు తెలిపారు. పేద ఎస్టి సామాజిక వర్గానికి చెందిన మాకు మా కుమార్తెను ఇండియాకు రప్పించుకునే ఆర్థిక సోమత లేక అగమ్యగోచరంలో ఉంటున్నట్లు భాగమతి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గార్లు చొరవ చూపి మా కుమార్తెను ఇండియాకు రప్పించే చర్యలు తీసుకోవాలని వారు ఓ కన్నీటి పర్యంతరమవుతూ ఓ వీడియో ను విడుదల చేశారు. పీలేరు కు చెందిన ఏజెంట్ చిన్నబ్బ పై మేము పోలీసు ఫిర్యాదు ఇచ్చినా పోలీసులు జోక్యం చేసుకోలేదని ఇంక మాకు దిక్కు ఎవరంటూ కుమిలిపోతున్నారు. తొండపాడ కి చెందిన జనసేన పార్టీ సీనియర్ నాయకుడు తపస్సి మురళి రెడ్డిని ఆశ్రయించామని ఆయన మా కుమార్తెను రప్పించడానికి తన వంతు సహాయం చేస్తున్నట్లు తులసమ్మ, చెంచయ్య తెలిపారు.

# ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల బంద్ - కెమిస్టులు, డ్రగ్గిస్టుల నిరసన ర్యాలీ

ప్రజాభూమి, వేంపల్లె




ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్న మందుల విక్రయాలకు వ్యతిరేకంగా అఖిల భారత కెమిస్టులు, డ్రగ్గిస్టుల సమాఖ్య పిలుపు మేరకు బుధవారం వేంపల్లె పట్టణంలోని మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. స్థానిక పట్టణంలోని మెడికల్ షాపులు మూతపడగా, కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు పట్టణ ప్రధాన వీధుల గుండా నినాదాలతో ర్యాలీ నిర్వహించి అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ మోహన్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వేంపల్లె కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యదర్శి రాయవరం సుబ్బారావు, ఈసీ సభ్యుడు డి.వి. సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ నియంత్రణ లేకుండా సాగుతున్న ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాల వల్ల యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు బానిసయ్యే ప్రమాదం ఉందన్నారు. అక్రమ రాయితీలు, నకిలీ మందుల విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ మందుల విక్రయాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకుని నకిలీ మందుల అమ్మకాలను నివారించాలని డిమాండ్ చేశారు. భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, కడప జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపు మేరకు శాంతియుతంగా బంద్ నిర్వహించినట్లు తెలిపారు. అయితే ప్రజలకు అత్యవసర మందుల సరఫరా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ చంద్రమోహన్ రెడ్డి, ఈసీ సభ్యులు రాజారామ్, సాయి, రామలింగా రెడ్డి, రామాంజనేయులు, సతీష్, రామకృష్ణ, షాహిద్, దీక్షిత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యం.. పేపర్లలో వస్తున్నా కదలని పంచాయతీ యంత్రాంగం!



ప్రజాభూమి ,సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీలో వీధిదీపాలు వెలగని సమస్యపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నా, అధికారులు మాత్రం మొద్దునిద్ర వీడటం లేదు. అధికారుల తీవ్ర నిర్లక్ష్యంపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా గ్రామంలో వీధిదీపాలు వెలగకపోవడంతో రాత్రివేళల్లో రోడ్లన్నీ చీకటిమయంగా మారుతున్నాయి. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు వార్తా పత్రికల్లో ప్రముఖంగా వార్తలు వచ్చినప్పటికీ.. స్థానిక పంచాయతీ సిబ్బంది గానీ, ఉన్నతాధికారులు గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. వార్తలు చూసైనా అధికారులు స్పందిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. కేవలం కాలయాపన చేస్తూ సమస్యను గాలికొదిలేశారని గ్రామస్థులు మండిపడుతున్నారు. చీకటి కారణంగా రాత్రి వేళల్లో విషపురుగుల సంచారం పెరిగిందని, దొంగల భయంతో గడపాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, మొరటుగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని, వీధిదీపాలకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.


## ప్లాస్టిక్ కవర్లు నిషేధిద్దాం.. ఆరోగ్యాలను కాపాడుకుందాం




ప్రజాభూమి,పులివెందుల

ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకోవాలంటే ముందుగా ప్లాస్టిక్ ను నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ ముని కుమార్ అన్నారు. బుధవారం పాత సత్రం పాఠశాలలో వేద అకాడమీ ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధం, హెల్మెట్ వినియోగం, చెట్ల పెంపకం- ఆవశ్యకత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి మునిసిపల్ కమిషనర్ మని కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి, వాటికి ప్రత్యామ్నాయాలైన జ్యూట్ బ్యాగు లు, గుడ్డ సంచులు, పేపర్ బ్యాగులు వంటివి ఉపయోగించేలా తల్లిదండ్రులకు తెలియజేయా లని, విద్యార్థులు కూడా వాటిని పాటించాలని సూచించారు.అలాగే వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, అది ప్రాణాపాయ పరిస్థితుల నుంచి రక్షిస్తుందని, లేకపోతే కుటుంబాలు చిన్నాభిన్నమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.అదేవిధంగా అవకాశం దొరికిన ప్పుడల్లా చెట్లు నాటే అలవాటు విద్యార్థులు పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో ముచ్చటించగా, పిల్లలందరూ కమిషనర్ మాటలకు చప్పట్లతో కేరింతలు కొట్టారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వేద అకాడమీ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల బారి నుండి కాపాడండి... రాష్ట్రపతి అవార్డు గ్రహీతదాదా పీర్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల పట్టణంలోని వీధులలో కుక్కలు సంచరిస్తూ దారిన పోయే ప్రజలను కరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని వీటి బారి నుండి కాపాడాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్ సోమవారం పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాదా పీర్ మాట్లాడుతూ పోరుమామిళ్లలోని వీధులలో కుక్కలు యదేచ్ఛగా సంచరిస్తూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులను కరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నా యన్నారు. గత వారం రోజుల నుండి 13వ వార్డులోనూ, ఇరుగుపొరుగు వీధులలోనూ పలువురు చిన్న పిల్లలను కుక్కలు కాటు వేయడంతో వారు ఆసుపత్రులకు వెళ్లి ఇంజక్షన్లు, మందులు వాడుతున్నారన్నారు. ఈ సంఘటనలతో బెంబేలెత్తిన ప్రజలు తమ పిల్లలను బయటికి పంపాలంటే హడలి పోతున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుండి ప్రయాణాలు చేసి రాత్రిపూట ఇళ్లకు చేరుకోవాలంటే దారిలో పడుకుని ఉండే కుక్కలు ఎక్కడ మీద పడతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకుని కుక్కల బారి నుండి పోరుమామిళ్ల ప్రజలను కాపాడాలని దాదా పీర్ విజ్ఞప్తి చేశారు. పోరుమామిళ్ల మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ అందరినీసంప్రదించి తగిన చర్యలు తీసుకుని కుక్కల బెడద లేకుండా చేస్తామన్నారు.

## గండిక్షేత్రంలో రూ.23.71 లక్షల హుండీ ఆదాయం

### - శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో హుండీల లెక్కింపు



ప్రజాభూమి, చక్రాయపేట

రాయలసీమ జిల్లాల్లో పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ కల్లూరు వెంకటస్వామి ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆలయంలో 56 రోజులకు గాను స్వామివారి శాశ్వత హుండీలు లెక్కించగా రూ.23,71,689 నగదు, నిత్య అన్నప్రసాద వితరణ హుండీ ద్వారా రూ.21,584 నగదు, 5 గ్రాములు 900 మిల్లీగ్రాముల బంగారం, 420 గ్రాములు 500 మిల్లీగ్రాముల వెండి వస్తువులు భక్తుల కానుకల రూపంలో లభించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నతాధికారుల సూచన మేరకు అధికారులు, దేవస్థానం ఉద్యోగులు, స్వామివారి సేవకులు సాంప్రదాయ వస్త్రధారణతో హుండీల లెక్కింపులో పాల్గొన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకుడు రాజా స్వామి, చక్రాయపేట ఏపీజీ బ్యాంకు సిబ్బంది, ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిద్దవటంలో మహానాడును విజయవంతం చేద్దాం

### -టీడీపీ శ్రేణులకు నాయకుల పిలుపు



ప్రజాభూమి, సిద్ధవటం: మే 27, 28 తేదీలలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని ఒక పండుగ వాతావరణంలో మండల పార్టీ ఆఫీసులో అందరం కలిసికట్టుగా విజయవంతం చేద్దామని ఆ పార్టీ సిద్ధవటం మండల అధ్యక్షుడు రాజశేఖర్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రమైన సిద్ధవటంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహానాడు కార్యక్రమానికి పార్టీకి చెందిన 'పసుపు సైన్యం' కార్యకర్తలు, నాయకులు ప్రతి ఒక్కరూ భారీ సంఖ్యలో కదిలి రావాలని కోరారు. విచ్చేసే వారందరికీ భోజన సదుపాయాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. అనంతరం టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగముని రెడ్డి మాట్లాడుతూ.. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆదేశాల మేరకు గ్రామస్థాయి నుంచి ప్రతి ఒక్క టీడీపీ కార్యకర్త చొరవ తీసుకుని ఈ మహానాడు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్‌తో పాటు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగముని రెడ్డి, పార్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


## నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ ప్రధాన సూత్రధారి

- కోర్టులో 'సిట్' తుది చార్జ్‌షీట్
- రాష్ట్ర ఖజానాకు భారీగా గండి కొట్టిన నిందితులు
- పార్లమెంట్ సమన్వయకర్త అతికారి క్రిష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: ఇబ్రహీంపట్నం, ములకలచెరువుల్లో 2018 నుండి 2025 వరకు జరిగిన నకిలీ మద్యం కుంభకోణంలో మాజీ మంత్రి జోగి రమేష్ కర్త, కర్మ, క్రియగా వ్యవహరించారని ప్రత్యేక దర్యాప్తు బృందం స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన సమగ్ర దర్యాప్తు పూర్తి కావడంతో, సిట్ అధికారులు నాలుగు రోజుల క్రితమే కోర్టులో తుది చార్జ్‌షీటును దాఖలు చేశారు. కోర్టు నివేదికల ప్రకారం.. జోగి రమేష్‌కు అత్యంత సన్నిహితుడైన అద్దేపల్లి జనార్ధన రావు, అతని సోదరుడు జగన్ మోహన్ రావులే ఈ నకిలీ మద్యం సూత్రధారులుగా ఉంటూ కథ నడిపించారు. అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని, అధికారాన్ని అడ్డం పెట్టుకుని నిందితులు రాష్ట్ర ఖజానాకు భారీగా తూట్లు పొడిచారని పార్లమెంట్ సమన్వయకర్త అతికారి క్రిష్ణ తీవ్రంగా ఆరోపించారు. చట్టం ముందు తప్పు చేసిన వారు ఎవరూ తప్పించుకోలేరని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని అతికారి క్రిష్ణ పేర్కొన్నారు. కానీ, కేవలం ఏపీలోనే ధరలు పెరిగినట్లు వైసిపి కపట ప్రేమ నటిస్తూ కుటిల రాజకీయాలు చేస్తోందని ఆయన మండిపడ్డారు.

## గండి క్షేత్రం ఛైర్మన్‌కు మైనార్టీ నాయకుల సన్మానం




ప్రజాభూమి, వేంపల్లె

గండి క్షేత్రం ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కల్లూరు వెంకటస్వామిని టిడిపి మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం గండి క్షేత్రంలో గండి ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామిని మైనార్టీ నాయకులు పీరా సాహెబ్, ఫయాజ్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి ఇడుపులపాయ గ్రామానికి చెందిన టిడిపి నేత కల్లూరు వెంకటస్వామి ఛైర్మన్‌గా నియమితులు కావడం ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవీంద్రనాథ్ రెడ్డి సహకారంతో ఈ పదవి రావడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా గండి ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి మాట్లాడుతూ మత సామరస్యాన్ని పరిరక్షించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## తాసిల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు విలవిల సిపిఐ ఆగ్రహం

**క్యాస్ట్, ఇకమ్, సర్టిఫికెట్లు విద్యార్థులకు సకాలంలో అందించాలి సిపిఐ డిమాండ్**
**విద్యార్థులకు అందుబాటులో ఉండని,జూనియర్ అసిస్టెంట్ తులసి**





ప్రజాభూమి పోరుమామిళ్ల :

పోరుమామిళ్ల తాసిల్దార్ కార్యాలయంలో విద్యార్థులు, సర్టిఫికెట్లకు కోసం రోజుల తరబడి అధికారులు అందుబాటులో ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారని సిపిఐ బద్వేల్ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్, ఏరియా కార్యవర్గ సభ్యులు సఫా, పిరయ్య లు రెవెన్యూ అధికారుల పై ఆగ్రహం చెందారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఎంసెట్, ఈసెట్, ఐఐటి,ట్రిబుల్ ఐటీ, నీట్, ట్రిబుల్ ఈ, లాంటి ఉన్నత చదువులకు విద్యార్థులు వెళ్లాలంటే, బర్త్, క్యాస్ట్, ఆదాయం సర్టిఫికెట్, లా కోసం తాసిల్దార్ కార్యాలయంలో, జూనియర్ అసిస్టెంట్ సమయపాలన లేకపోవడం, ఒక్కరోజు కూడా సమయానికి ఆఫీసుకు రాకపోవడం, వలన విద్యార్థులు వారి భవిష్యత్తు అంధాకారమయ్యే పరిస్థితి నెలకొంటుంది అదేవిధంగా బర్త్ సర్టిఫికెట్ కోసం, ఫ్యామిలీ మెంబర్, ఈ డబ్ల్యూ ఎస్ సర్టిఫికెట్ లాంటి సర్టిఫికెట్ల కోసం 200 లేక 500 రూపాయల వరకు డబ్బులు ఇస్తే గాని, వారి అప్లికేషన్ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. డబ్బులు తీసుకోవడంలో రెవెన్యూ అధికారుల చేతివాటంగా ఉన్నదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. అలాగే క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్ లో పేరు బదులుగా చుక్కలు రావడం వలన, విద్యార్థులు ఆర్డిఓ కార్యానికి వెళ్లి, వారాల తరబడి తిరిగిన విద్యార్థులు పని కావడం లేదని, రెవిన్యూ అధికారుల చిన్నపాటి నిర్లక్ష్యానికి విద్యార్థులు బలి కావడం చాలా బాధాకరమన్నారు. తక్షణమే ఇలాంటి సమస్య ఇంకో విద్యార్థికి రాకుండా జిల్లా ఉన్నత అధికారులు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు లేనిపక్షంలో విద్యార్థులను కూడగట్టి తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతామని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల సమితిగా అధికారులను హెచ్చరించారు.

## రక్తదానం తో పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన జూనియర్ ఎన్ టీ ఆర్ అభిమానులు

### జూనియర్ ఎన్ టీ ఆర్ అభిమానుల రక్తదానం అభినందనీయం- డాక్టర్ నవీన్, డాక్టర్ సుకన్య




ప్రజాభూమి, పులివెందుల

జూనియర్ ఎన్ టీ ఆర్ అభిమానుల రక్తదానం అభినందనీయం అని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ నవీన్,ప్రముఖ సర్జన్ డాక్టర్ సుకన్య లు పేర్కొన్నారు. సినీ నటుడు జూనియర్ ఎన్ టీ ఆర్ 43 వ జన్మదినం సందర్భంగా పులివెందుల పట్టణ అభిమానుల అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలోని రక్తనిధి యందు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ నవీన్, ప్రముఖ సర్జన్ డాక్టర్ సుకన్య, పట్టణ అభిమానుల అసోసియేషన్ అధ్యక్షులు పీవీ,రమణ, ఉపాధ్యక్షు లు నబీరసూల్, స్నేహిత అమృత హస్తం సేవాస మితి అధ్యక్షులు రాజు లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభిమానాన్ని ఎన్నో రకాలుగా తెలుపతారని, కానీ మరొకరికి ప్రాణదానాన్ని ఇచ్చే రక్తదానం అన్ని దానాలకన్నా ఎంతో గొప్ప కార్యక్రమం అని, ఇందులో జూనియర్ ఎన్ టి ఆర్ అభిమానులు వినూత్న సేవా కార్యక్ర మం, రక్తదానం తో తమ అభిమాన నటుడు జూనియర్ ఎన్ టి ఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపడం ఎంతో శుభ పరిణామం అని రక్తదానం చేసిన అభిమానులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో ఆర్గనైజర్ శివ, రామాంజి, జహీర్ షాకీర్, ప్రసాద్, రహీం, బాషా,ఓమ్ కిరణ్, ఓబులేసు, లోకేష్,పీజీఆర్, రక్తనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వాకింగ్ సోదరుల దాతృత్వం మరువలేనిది

### -అర్బన్ సీఐ శ్రీరాం



ప్రజాభూమి, పులివెందుల

వాకింగ్ సోదరుల దాతృత్వం మరువలేనిదని అర్బన్ సీఐ శ్రీరామ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్థానిక నగరవనం (ఇందిరమ్మ రాణి తోపు) పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్కులో టికెట్ కౌంటర్లో పనిచేస్తున్న రాధాకృష్ణ ఇటీవల ఛాతి నొప్పి రావడంతో ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. ఆయన పేదరికం గమనిం చిన వాకింగ్ మిత్రులు అందరూ చేయి చేయి కలిపి రూ.1,17,000(ఒక లక్ష 17 వేలు రూపాయలు) వసూలు చేశారు. ఆయన ఆరోగ్యం కుదుటపడా లని ఆకాంక్షించారు. ఈ మొత్తాన్ని సీఐ శ్రీరామ్ చేతులమీదుగా వాకింగ్ మిత్రులందరి సమక్షంలో రాధాకృష్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ మన పక్క ఏమి జరుగుతు న్న పట్టించుకోని ఈ సమాజంలో వాకింగ్ మిత్రులు మానవతా దృక్పథంతో రాధాకృష్ణకు సాయం అందించడం గర్వకారణం అన్నారు. మానవతా విలువలు పెంపొందించే విధముగా వాకింగ్ మిత్రులు చూపించారన్నారు. ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నగరవనం, రాణి తోపు వాకింగ్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు

## ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలి



ప్రజాభూమి,పులివెందుల

ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాలి అని ఎన్ ఎం యు ఏ డిపో అధ్యక్షులు సి పి రెడ్డి అన్నారు. బుధవారం ఎన్ ఎం యు ఏ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిపో అధ్యక్షులు సి.పి.రెడ్డి ఆధ్వ ర్యంలో ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించాల ని పులివెందుల డిపో గేటుఎదుట ధర్నా నిర్వహిం చారు. పులివెందుల డిపో అధ్యక్షులు సి.పి.రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీ సిబ్బందితోనే నిర్వహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవా లని, స్త్రీ శక్తి బస్సులలో జీరో టికెట్ ఇచ్చే విధానా న్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని కండక్టర్లపై పనిభారం తగ్గించాలన్నారు. అలాగే పెండింగ్ లో ఉన్న నాలుగు డిఏ లు అరియర్స్, లీవ్ ఎన్కాష్మెం ట్ ఇవ్వాలని, రిటైర్డ్ అయిన, చనిపోయిన సిబ్బందికి వెంటనే సెటిల్మెంట్స్ చేయాలని, ఏపీ పిటిడి ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుండి మినహా యించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలు చేయాలని కోరారు. డిపో నాయకులు, ఉద్యోగస్తులు పాల్గొన్నారు.


## పులివెందుల డివిజన్ ఇన్చార్జి ఈఈ గా బాధ్యతలు చేపట్టిన హరిసేవ నాయక్



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల డివిజన్ ఇన్చార్జి ఈఈ గా హరి సేవ నాయక్ బుధవారం పట్టణంలోని స్థానిక డివిజన్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు ఇచ్చిన ఈ అవకాశాన్ని తప్పకుండా ప్రతి ఒక్క వినియోగ దారికి న్యాయం చేసే విధంగా అడుగులు వేస్తానని అనంతరం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాదంపాలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్క విద్యుత్ అధికారులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ గురు మోహన్ రెడ్డి, ఏడి నాగేంద్ర, కడప రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి అశోక్ బాబు, డివిజన్ ప్రెసిడెంట్, పుల్లయ్య, , లైన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి జగన్మోహన్ రెడ్డి, లైన్మెన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి సర్కిల్ ఏర్పాటుకు స్థల పరిశీలన



ప్రజాభూమి,పులివెందుల

పులివెందులలో పార్నపల్లి బస్టాండ్ ను వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు సంబంధించి బుధవారం పులివెందుల ఆర్టీవో,ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యం లో స్థలపరిశీలన జరిగింది . దీనికి సంబంధించి ఆర్టీవో కూడా ఆ ప్రాంతాన్ని సందర్శించి వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేసేందుకు ఆర్డిఓ పరిశీలించారు . దీనికి సంబంధించి ,త్వరలో పార్నపల్లి బస్టాండ్ ను వాసవి సర్కిల్ గా ఏర్పాటు చేయబోతున్నారు అని ఆర్యవైశు ్యలు తెలిపారు . ఈ కార్యక్రమంలోఆర్యవైశ్య సంఘము అధ్యక్ష్యులు శ్రీనివాసులు ,సెక్రెటరీ సగళామహేంద్ర, ట్రెజరర్ రాజోలు సుబ్రమణ్యం,ఉపాధ్యక్ష్యులు మేడ రమణయ్య,మేడ సాయిబాబా, పబ్బతి దక్షిణామూర్తి,రమేష్,పద్మనాభయ్య,హరి,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారుల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### పట్టాదారు పాసు బుక్ పంపిణీ, మ్యుటేషన్, రీ--సర్వే, పిజిఆర్ఎస్, సెన్సెస్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### -జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



జిల్లాలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణ పనులు, భూసేకరణ, ఏపీఐఐసీ పరిశ్రమల ప్రాజెక్టులు, పట్టాదారు పాసు బుక్ పంపిణి, మ్యుటేషన్, రీ--సర్వే, పి జి ఆర్ ఎస్ సెన్సెస్ తదితర అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను ప్రణాళికాబద్ధంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.బుధవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు తో కలిసి జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల పనులు, వైజాగ్--చెన్నై కారిడార్ పైప్‌లైన్ పనులు, ఏపీఐఐసీ పరిశ్రమల అభివృద్ధి, దుగ్గరాజపట్నం ప్రాజెక్టు, ఏడీబీ రోడ్లు, శ్రీ సిటీ, ఎల్‌జీ ఫేజ్--1,2, స్పేస్ సిటీ ఫేజ్--1,2,3,4, నాయుడుపేట ఫేజ్--2, వానెల్లూరు, పాగలి తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెండింగ్ భూ సమస్యలు మరియు పట్టాదారు పాసు బుక్ పంపిణి, మ్యుటేషన్, రీ--సర్వే, పిజిఆర్ఎస్, సెన్సెస్ తదితర అంశాల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సిటీ, ఏపీఐఐసీ పరిధిలోని ఎల్‌జీ ఫేజ్--1,2,3, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, నాయుడుపేట ఫేజ్--2, వానెల్లూరు, పాగలి తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెబ్‌ల్యాండ్‌కు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో జాతీయ రహదారుల విస్తరణ మరియు అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. వైజాగ్--చెన్నై కారిడార్ పైప్‌లైన్ పనులు, నడికుడి--శ్రీకాళహస్తి, ఏర్పేడు--పూడి, గుమ్మడిపూండి--గూడూరు, గూడూరు--రేణిగుంట, తిరుపతి--కాట్పాడి, అర్కోణం--రేణిగుంట రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నాయుడుపేట--రేణిగుంట, రేణిగుంట--కడప, రేణిగుంట--చెన్నై రహదారి విస్తరణ పనులు, ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పేర్కొన్నారు. సాగరమాల పథకం కింద చేపడుతున్న ప్యాకేజీ--2,3,4 జాతీయ రహదారి పనులు నాణ్యతతో పూర్తి కావాలని, రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఫారెస్ట్, జలవనరుల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ--5, ఏడీబీ రోడ్ల పనులను కూడా వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాసు బుక్ పంపిణి కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన రైతులకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. మ్యుటేషన్ దరఖాస్తులను నిర్దేశిత గడువులోపు పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమయానికి సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.రీ--సర్వే కార్యక్రమంలో గ్రామ స్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భూసరిహద్దుల నిర్ధారణ, రికార్డుల సవరణ, సాంకేతిక అంశాలపై క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అయిన పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.భూసేకరణకు సంబంధించిన కేసుల్లో రైతులు, భూయజమానులతో సమన్వయం పాటిస్తూ చట్టపరమైన ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. పరిహారం చెల్లింపులు, అవార్డు ప్రక్రియలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణను పారదర్శకంగా పూర్తి చేయాలని తెలిపారు. సెన్సెస్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యంతో నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో డేటా సేకరణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత సిబ్బందికి తగిన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. స్వీయ గణన, గృహ గణన కార్యక్రమాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లాలో రెవెన్యూ శాఖకు సంబంధించిన ప్రతి అంశంలో అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పనుల్లో జాప్యం లేకుండా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, శ్రీ సిటీ లీగల్ అడ్వైజర్ భాను, సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భాస్కర్, శివప్రసాద్, భూసేకరణ విభాగ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కుప్పానికి విచ్చేసిన ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకి సాదర స్వాగతం పలికిన చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



ప్రజా భూమి ప్రతినిధి కుప్పం

అంగరంగ వైభవంగా జరుగుతున్న గంగజాతరలో పాల్గొని, గంగమ్మ తల్లికి సారే సమర్పించేందుకు తన సొంత నియోజకవర్గం కుప్పానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, హెలి ప్యాడ్ వద్ద తెలుగు దేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు,చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సాదర స్వాగతం పలికారు. అనంతరం సీఎంతో కలిసి కుప్పం గంగ జాతరలో పాల్గొని, గంగమ్మ తల్లి సేవలో తరించారు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు, అష్ట ఐశ్వర్యాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మను ప్రార్థించినట్లు చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

## దేశవ్యాప్త డ్రగ్గిస్టులు, కెమిస్టుల బంద్.. నగరిలో మెడికల్ అసోసియేషన్ నిరసన ర్యాలీ



ప్రజా భూమి ప్రతినిధి నగరి

అఖిల భారత డ్రగ్గిస్టులు మరియు కెమిస్టుల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా చిత్తూరు జిల్లా నగరి పట్టణంలో బుధవారం మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాంబాబు నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు, మెడికల్ షాపుల యజమానులు ఏకతాటిపైకి వచ్చి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీరాంబాబు మాట్లాడుతూ ఫార్మా వ్యాపార రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న పలు కీలక సమస్యలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కెమిస్టుల జీవనాధారం, ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా దేశవ్యాప్తంగా బంద్‌కు పిలుపునివ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని మెడికల్ షాపుల యజమానులు, ఫార్మా వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

## ఎర్రచందనం ముద్దాయిపై పీడీ యాక్ట్

### ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న టాస్క్ ఫోర్స్

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి



ఎర్రచందనం అక్రమ రవాణాకు చెందిన పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్న తమిళనాడు కు చెందిన రామకృష్ణన్ ముత్తు ఎలియాస్ రామకృష్ణ పై టాస్క్ ఫోర్స్ అధికారులు పీడీ యాక్ట్ అమలు చేశారు. టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ మార్గ నిర్దేశకత్వంలో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధించడమే కాకుండా, ఎక్కువ కేసుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా వృత్తిగా చేసుకుని, ముఠాగా ఏర్పడి స్మగ్లింగ్ కు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ లు అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా తమిళనాడుకు చెందిన ముద్దాయి రామకృష్ణన్ ముత్తు ఎలియాస్ రామకృష్ణ పై పీడీ యాక్ట్ అమలుకు టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు గారు సిఫారసు చేశారు. ఈ మేరకు తిరుపతి జిల్లా కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేట్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ గారు, వీరిపై పీడీ యాక్ట్ అమలుకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను ఎర్రచందనం కొల్లగొట్టడుతూ, వన్య మృగాల చట్టాలను ఉల్లంఘించి నేరాలు చేస్తూ ప్రజాజీవనానికి అటంకం కలిగిస్తున్నట్లు గుర్తించారు. ఇతనిపై ఏడు ఎర్రచందనం కేసులు ఉండగా, టాస్క్ ఫోర్స్ లో నాలుగు, సుండుపల్లి, కలికిరి పోలీసు స్టేషన్లుతో పాటు,పీలేరు ఫ్లయ్యింగ్ స్క్వాడ్ లో ఒక కేసు ఉంది. పీడీ యాక్ట్ అమలులో భాగంగా నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధకంలో భాగంగా పీడీ యాక్ట్ అమలు చేయడానికి వెనుకాడబోమని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎర్రచందనం కేసుల్లో ఇప్పటికే అనేక మందికి శిక్షలు పడ్డాయని గుర్తు చేశారు. యువత ఎర్రచందనం అక్రమ రవాణాకు ప్రయత్నించి వారి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని చెప్పారు. స్మగ్లర్లకు శిక్ష పడటంతో పాటు వారి ఆస్తులు కూడా జప్తు చేసుకో పడతాయని తెలియజేసారు.

## ఘనంగా మాస్టర్ గుడ్లూరు సెయన్ మహత్ 9వ జన్మదిన వేడుకలు: రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు 50,000 విరాళం

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

తిరుపతిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో మాస్టర్ గుడ్లూరు సెయన్ మహత్ 9వ జన్మదిన వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా మరియు సేవాభావంతో జరిగాయి. ఈ పుట్టినరోజును పురస్కరించుకుని సమాజ సేవలో భాగంగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు రూ. 50,000/- (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు రూ. 50,000/- నగదు చెక్కును రెడ్‌క్రాస్ తిరుపతి జిల్లా చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావుకి అధికారికంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ తిరుపతి జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ గుడ్లూరు మయూర్, సొసైటీ సెక్రటరీ, ట్రెజరర్ మరియు ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ శ్రీహరి రావు మాట్లాడుతూ " మాస్టర్ గుడ్లూరు సెయన్ మహత్ పుట్టినరోజు సందర్భంగా ఆడంబరాలకు పోకుండా, ప్రాణదానంతో సమానమైన రక్తనిధి బ్లడ్ బ్యాంకు సేవల కోసం 50,000 విరాళం అందించడం చాలా అభినందనీయం. బాల్యం నుంచే పిల్లలలో ఇలాంటి సేవా గుణాన్ని పెంపొందిస్తున్న వారి తల్లిదండ్రులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ నిధులు తలసేమియా బాధితులకు మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు ఉచితంగా రక్తాన్ని అందించడానికి ఎంతో ఉపయోగపడతాయి. ఈ కార్యక్రమంలో మాస్టర్ గుడ్లూరు సెయన్ మహత్‌ను రెడ్‌క్రాస్ ప్రతినిధులు, సభ్యులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది మరియు చిన్నారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## ఆర్టీసీ సమస్యల పరిష్కారానికి వాకాడు డిపోలో మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ గర్జన

ప్రజా భూమి ప్రతినిధి వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం "డిమాండ్స్ డే" నిరసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం. చెంచలయ్య, తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమ ఆందోళన వ్యక్తం చేశారు. వాకాడు డిపో అధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి సంపత్, చైర్మన్ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షుడు సుధీర్, గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులు నాయకత్వంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మిక నాయకులు పలు కీలక డిమాండ్లు ప్రభుత్వ ముందుంచారు. ముఖ్యంగా విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, అరియర్స్ వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే స్త్రీ శక్తి బస్సుల్లో అమలవుతున్న జీరో టికెట్ విధానాన్ని మార్చాలని, పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రిటైర్డ్ అయిన మరియు మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు పెండింగ్ సెటిల్మెంట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సులను వెంటనే కొనుగోలు చేయాలని, అన్ని విభాగాల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈ నెల 26వ తేదీన విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని నాయకులు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ ప్రశాంత్, కార్యదర్శి సంపత్, చైర్మన్ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షుడు సుధీర్, గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులు సహా పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు, సభ్యులు పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.




## మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

### ఎంపీడీవో కార్యాలయం, సచివాలయాల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం నిరసన

ప్రజాభూమి ప్రతినిధి వరదయ్యపాలెం




మహాత్మా గాంధీ పేరుతో కొనసాగుతున్న పాత గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బుధవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద, సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నలుగురి రమణయ్య, వరదయ్యపాలెం మండల కార్యదర్శి సుబ్బయ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టబద్ధమైన పథకమని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వి.బి.ఆర్.జి పథకం కేవలం కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాల కోసం రూపొందించిన పథకమని విమర్శించారు. పాత ఉపాధి హామీ పథకంలో 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో విడుదల చేసేదని, కొత్త పథకంలో మాత్రం కేవలం 60 శాతం మాత్రమే కేంద్ర ప్రభుత్వం భరించి, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఆ భారం భరించలేక ఉపాధి పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలను తక్షణమే నిలిపివేయాలనిమహాత్మా గాంధీ పేరుతో ఉన్న పాత పథకాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఎంపీడీవోకు సచివాలయ కార్యదర్శులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాల గురవయ్య, తిరుపాలు, పండయ్య, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

## నగరంలోని నిషేదిత ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు

### -డిప్యూటీ కమిషనర్ అమరయ్య.



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ పరిధిలోని నిషేదిత ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వులు నంబరు 253 తేది: 02 -12 -2025, మేరకు తిరుపతి నగరపాలక సంస్థ పరిదిలో నగరపాలక సంస్థ నుండి అనుమతి లేకుండా ఎటువంటి ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టకూడదని తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిదిలోని అన్ని కూడళ్లలో, రోడ్డు ఢివైడర్లలో, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ వారి ఉత్తర్వుల మేరకు గరుడ వారది పైన, పిల్లర్లకు, గరుడ వారది పిల్లర్లకు మద్య గల డివైడరు లందు, నగర పరిది లోని అన్ని ఫుట్ పాత్ ల పైన ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టుట నిషేదించామని తెలిపారు. నగర పాలక సంస్థ అనుమతి లేని వారికీ ఫ్లెక్సీలు, బ్యానర్లు ప్రింట్ చేయకూడదని, కట్టకూడదని ప్రింటింగ్ యజమానులకు సూచించారు. నగరపాలక సంస్థ పరిదిలోని, చుట్టూ ఉన్న పంచాయతీలోని అన్ని ఫ్లెక్సీ ప్రింటింగ్ షాప్ ల యజమానులు, వ్యాపార వేత్తలు, రాజకీయ పార్టీల వారు నగరంలోని నిషేదిత ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకుండా నగరపాలక సంస్థకు సహకరించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారికి జరిమానాలు విధించి, చట్టపరమైన చర్యలు తీసుకోబడుతుందని, డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఆ ప్రకటనలో హెచ్చరించారు.

## స్వచ్ఛపథం కార్యక్రమాలపై ఎంపీడీవో వెంకటరత్నమ్మ ప్రత్యేక దృష్టి

### కుక్కంబాకం సచివాలయంలో తనిఖీలు

ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని కశీచనపుత్తూరు గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛపథం కార్యక్రమం మరియు స్వచ్ఛ రథం కార్యకలాపాలను మండల అభివృద్ధి అధికారిణి వెంకటరత్నమ్మ బుధవారం పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తడి-పొడి వ్యర్థాల వేరు చేసే విధానంపై సిబ్బందికి సూచనలు చేశారు. స్వచ్ఛ రథం కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలు, విద్యార్థులు ప్లాస్టిక్ చెత్త, ఉపయోగించని వ్యర్థ వస్తువులను అందజేశారు. వాటికి ప్రతిఫలంగా స్వచ్ఛంద కార్యకర్తలు సబ్బులు, పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు, చిన్న చిన్న గృహోపకరణాలు కు అవసరమైన సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడుతోందని అధికారులు తెలిపారు. అనంతరం కుకుంబాకం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీవో వెంకటరత్నమ్మ, సచివాలయ సిబ్బంది హాజరు, ప్రజలకు అందిస్తున్న సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని, కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

### -కోలాహలంగా జై ఎన్టీఆర్ జై ఎన్టీఆర్ అభిమానులు

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి పట్టణంలోని జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన పురస్కరించుకొని శ్రీకాళహస్తి ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో 43వ జన్మదినం సందర్భంగా 43 కేజీల భారీ కేక కేక్ కటింగ్ నిర్వహించిన శ్రీకాళహస్తి జూనియర్ ఎన్టీఆర్ అభిమాని ఊరందరు బాలాజీ జూనియర్ ఎన్టీఆర్ మీద అభిమానంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని శ్రీకాళహస్తి దేవస్థానం కి వచ్చే భక్తులకు 1000 మజ్జిగ ప్యాకెట్లు మరియు జూనియర్ ఎన్టీఆర్ పేరున శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో అభిషేకాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు అమర్నాథ్ రెడ్డి, గోపి ,తొండు ప్రవీణ్, మురారి తదితరులు పాల్గొన్నారు

# మానవ సేవే మాధవ సేవ -డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు





ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

భానుడి భగభగలతో నిప్పుల కొలిమిని తలపిస్తున్న వేసవి ఎండల్లోనూ.. దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే ముక్కంటి భక్తుల సేవలో ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుండి భక్తులకు ఉపశమనం కలిగించడమే ధ్యేయంగా ఆయన బుధవారం శ్రీకాళహస్తిలో ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.

**ఉష్ణోగ్రతల హెచ్చరికల నేపథ్యంలో అండగా...**

ప్రస్తుత ఈ నెల 19వ తేదీ నుండి 25వ తేదీ వరకు మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసింది. ఈ తీవ్రమైన ఎండ వేడిమి వల్ల శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వివిధ ప్రాంతాల నుండి విచ్చేసే భక్తులు, కాలినడకన వచ్చే పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన డాక్టర్ యల్లంపాటి కోటేశ్వర బాబు తక్షణమే స్పందించి, భక్తుల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చారు.

**536 మందికి చల్లటి మజ్జిగ పంపిణీ**

శ్రీకాళహస్తి ఆలయ పరిసర ప్రాంతాలలో ఎండ వేడిమి నుండి ఉపశమనం కల్పించేందుకు ఆయన స్వయంగా నిలబడి భక్తులకు చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సుదీర్ఘ సేవా కార్యక్రమంలో సుమారు 536 మంది ముక్కంటి భక్తులకు, పాదచారులకు చల్లటి మజ్జిగను అందించి వారి దాహార్తిని తీర్చారు. నిప్పులు చెరుగుతున్న ఎండలో అమృతం లాంటి చల్లటి మజ్జిగను అందించిన డాక్టర్ కోటేశ్వర బాబు సేవా నిరతిని భక్తులు హృదయపూర్వకంగా అభినందించారు.

**సేవలోనే దైవాన్ని చూస్తూ...**

"మానవ సేవే మాధవ సేవ" అనే నినాదాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా, తన నిరంతర సేవా కార్యక్రమాల ద్వారా డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు నిరూపిస్తూ వస్తున్నారు. సేవలోనే దైవాన్ని చూసే అలవాటు ఉన్న ఆయన, ఇలాంటి విపత్కర వాతావరణ పరిస్థితుల్లో భక్తులకు అండగా నిలవడం తన బాధ్యతగా భావించారు. నిప్పుల కొలిమి లాంటి ఎండలను సైతం లెక్కచేయకుండా, భక్తుల సౌకర్యం కోసం ఆయన చేసిన ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమం స్థానికంగా, భక్తుల నడుమ విశేష ప్రశంసలు అందుకుంటోంది. ఎండ తీవ్రత ముగిసే వరకు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని కొనసాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# స్వర్ణ గ్రామాల నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం

## ప్రతి మహిళ గ్రామాభివృద్ధికి కృషి చేయాలి - ఎంపీడీవో, వెంకటరత్నమ్మ ఏపీఎం, మునేయ్య





ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

స్వర్ణ గ్రామాల సాధనలో ప్రతి మహిళ చైతన్యంతో ముందుకు వచ్చి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీమతి వెంకటరత్నమ్మ పిలుపునిచ్చారు. మే 19 నుంచి ఆదర్శ గ్రామాల ఏర్పాటు వార్షిక కార్యాచరణ ప్రణాళికపై బుచ్చినాయుడు కండ్రిగ మండల వెలుగు కార్యాలయంలో గ్రామ సమాఖ్య నాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులు వ్యక్తిగత అవసరాలతో పాటు గ్రామ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రతి స్వయం సహాయక సంఘం, గ్రామ సమాఖ్య సమావేశాల్లో గ్రామ పరిశుభ్రత, మౌలిక వసతులు, చెత్త నిర్వహణ వంటి అంశాలను తప్పనిసరిగా చర్చించాలని తెలిపారు. ప్రతి కుటుంబం తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని, ఇంటి వద్ద అవకాశం ఉన్నవారు కంపోస్ట్ ఎరువు తయారు చేసి పెరటి తోటలకు వినియోగించాలని సూచించారు. ఆ తోటల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో భాగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అవకాశం లేని వారు చెత్తను సేకరణ కేంద్రాలకు, పొడి చెత్తను గ్రామానికి వచ్చే స్వచ్ఛ రథానికి అందజేయాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగిస్తూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి అన్ని సదుపాయాలతో స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. మండల సహాయ ప్రాజెక్టు మేనేజర్ మునెయ్య మాట్లాడుతూ మహిళా సంఘాల సమావేశాలు సమర్థవంతంగా నిర్వహించాలని సభ్యులందరూ హాజరయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి నెల లెక్కల పుస్తకాలు సక్రమంగా రాయడంతో పాటు సభ్యులకు చదివి వినిపించాలని చెప్పారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆస్తులు సృష్టించుకోవాలని, రుణాల వసూళ్లు వంద శాతం జరిగేలా గ్రామ సమాఖ్య సమావేశాల్లో చర్చించాలని తెలిపారు. అనారోగ్య సమస్యలు అధికమవడానికి పోషకాహార లోపం కూడా కారణమని, అందువల్ల ప్రతి కుటుంబం చిన్న స్థలంలో అయినా పెరటి తోటలు పెంచుకుని పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒక మహిళ పారిశ్రామికవేత్తగా ఎదిగి ఆర్థికంగా బలపడాలని ఆకాంక్షించారు. అరకు కాఫీ దుకాణాలు, వెదురు మొక్కల పెంపకం, కోరమేను చేపల పెంపకం వంటి వివిధ జీవనోపాధి అవకాశాలను మహిళలు వినియోగించుకోవాలని తెలిపారు. ఇందుకు అవసరమైన సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పథకం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం తదితర రుణాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నెల నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో మహిళా సంఘ సభ్యులు చురుకుగా పాల్గొని గ్రామ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా మహిళలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నీర్పకోట గ్రామ సమాఖ్య సభ్యులతో కలిసి వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఇదే విధానాన్ని ప్రతి గ్రామంలో అమలు చేయాలని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సమాఖ్య సమన్వయకర్తలు పయని, వెంకటరత్నం, జీవ, లెక్కల నిర్వాహకులు హిమగిరిజ, శిరీష, మహిళా సంఘాల నాయకులు, గ్రామ సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కందుల దుర్గేష్ నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త శోభ

## - జనసేన నాయకులు అంజూరు చక్రధర్



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో రాష్ట్ర పర్యాటక శాఖకు బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డ్, గ్లోబల్ టూరిజం అవార్డ్ సాధించిన సందర్భంగా, కందుల దుర్గేష్ కి అభినందనలు తెలియజేసిన జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ ... ఈ సందర్భంగా అంజూరు చక్రధర్ మాట్లాడుతూ,ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు దిశ, దశ లేని పరిస్థితి ఉండేది. కనీసం పర్యాటకశాఖ కార్యక్రమాలకు కూడా నిధులు, నిర్వహణకు అధికారులు కూడా లేని దుస్థితిలో ఉండేది. పర్యాటక శాఖ భవనాలు అత్యంత దారుణంగా కనిపించేవి. అయితే ఇటీవల పర్యాటక శాఖ తీసుకొస్తున్న వినూత్న విధానాలు, పర్యాటక ప్రమోషన్ కార్యక్రమాల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకుంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కృషితో, రాష్ట్రంలోని 8 ప్రముఖ పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ. 428 కోట్ల నిధులను మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వం. సూర్యలంక బీచ్, బొర్రా గుహలు, అఖండ గోదావరి, గండికోట, అన్నవరం, సింహాచలం, అహోబిలం, నాగార్జునసాగర్ వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు.

# రైతులకు అందుబాటులో వ్యవసాయ యంత్రాలు

## వెలుగు ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ కేంద్రానికి స్థల కేటాయింపు



ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని రైతులకు తక్కువ ఖర్చుతో వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో వెలుగు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న కస్టమ్ హైరింగ్ కేంద్రానికి స్థలాన్ని కేటాయించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,వై. చెంచురామ నాయుడు, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి, వెంకటరత్నమ్మ, రెవెన్యూ ఇన్స్పెక్టర్, నల్లయ్య కలిసి స్థల పరిశీలన నిర్వహించారు.మండల పరిషత్ కార్యాలయం కార్ పార్కింగ్‌కు దక్షిణ వైపున ఉన్న స్థలాన్ని కేంద్రం ఏర్పాటు కోసం ఖరారు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కస్టమ్ హైరింగ్ కేంద్రం ద్వారా ట్రాక్టర్లు, రోటావేటర్లు, స్ప్రేయర్లు, కలుపు యంత్రాలు, కోత యంత్రాలు వంటి వ్యవసాయ పరికరాలను రైతులు అద్దె పద్ధతిలో పొందవచ్చని, చిన్న, సన్నకారు రైతులు అధిక వ్యయం పెట్టకుండా అవసరమైన సమయంలో యంత్రాలను వినియోగించుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు.వ్యవసాయ పనుల్లో సమయం, ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కేంద్రం నిర్వహించడంద్వారామహిళలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని వివరించారు.ఈ కేంద్రం రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారి ఆధునిక వ్యవసాయ విధానాలను గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వాకాడు ఆర్టీసీ కార్మికుల సమస్యలపై ధ్వజమెత్తిన నేషనల్ మజ్దూర్ యూనియన్

## -న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్





ప్రజా భూమి, ప్రతినిధి వాకాడు

తిరుపతి జిల్లా వాకాడు ఆర్టీసీ డిపో నందు రాష్ట్ర సెంట్రల్ కమిటీ పిలుపులో భాగంగా వాకాడు డిపో పరిధిలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొదటి రోజు ధర్నా కార్యక్రమం అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది. తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు చంద్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎం. చెంచలయ్య ముఖ్య అతిథిగా హాజరై ఆర్టీసీ సిబ్బంది ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై గళమెత్తారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రవేశపెడుతున్న విద్యుత్తు బస్సులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ఆర్టీసీ లేదా ప్రభుత్వం ద్వారానే నేరుగా కొనుగోలు చేయాలని, అలాగే వాటిని సంస్థ సిబ్బందితోనే నిర్వహించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్న 'స్త్రీ శక్తి' బస్సులలో ప్రస్తుతం అమలు చేస్తున్న జీరో టికెట్టు విధానాన్ని పూర్తిగా నిలుపుదల చేయాలని కోరారు. దానికి బదులుగా మిగతా ప్రయాణీకులకు ఇచ్చే విధంగానే సాధారణ టిక్కెట్టు ఇచ్చే పద్ధతిని తీసుకువచ్చి,సిబ్బందిపై అనవసరంగా పెరుగుతున్న తీవ్రమైన పనిభారాన్ని తగ్గించాలని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలపై స్పందిస్తూ,వెంటనే పిఆర్సి కమిటీని నియమించి ఐఆర్ ను తక్షణమే ప్రకటించాలన్నారు. వీటితో పాటు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న నాలుగు డీఏ లు,అరియర్స్,లీవ్ ఎన్క్యాష్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని పట్టుబట్టారు.ఈ నెల 13వ తేదీన ప్రభుత్వానికి,గౌరవ మేనేజింగ్ డైరెక్టర్ కి సమర్పించిన మెమొరాండంలోని దీర్ఘకాలిక సమస్యలన్నింటినీ కాలయాపన చేయకుండా పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ప్రయాణీకుల సౌకర్యార్థం రూట్లలో సరిపడా కొత్త బస్సులను వెంటనే కొనుగోలు చేయాలని, సంస్థలో అన్ని కేటగిరీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు కోరారు.రిటైర్ అయిన మరియు దురదృష్టవశాత్తూ చనిపోయిన సిబ్బంది కుటుంబాలకు అందవలసిన సెటిల్మెంట్లను ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే ఏపీపీటీడీ ఉద్యోగులను ప్రస్తుతం ఉన్న ఈహెచ్ఎస్ పరిధి నుండి మినహాయించి, గతంలో ఆర్టీసీలో ఉన్న మెరుగైన ఉచిత వైద్య సదుపాయాన్ని తిరిగి యథాతథంగా అమలు చేయాలని నేతలు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నా కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ప్రశాంత్, కార్యదర్శి సంపత్, చైర్మన్ శ్రీనివాసులు, గ్యారేజ్ అధ్యక్షులు సుధీర్,గ్యారేజ్ కార్యదర్శి శ్రీనివాసులుతో పాటు భారీ సంఖ్యలో యూనియన్ నాయకులు,కార్మికులు మరియు సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని ఘన విజయం చేశారు.

# సీనియర్ అసిస్టెంట్ దువ్వూరు ఈశ్వర్ కి ఘన సన్మానం



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం

రామచంద్రపురం ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా పని చేస్తూ సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది జిల్లా పరిషత్ కార్యాలయానికి బదిలీ అయిన దువ్వూరు ఈశ్వర్ ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో దువ్వూరు ఈశ్వర్ ను శాలువలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్గా దువ్వూరు ఈశ్వర్ రెండేళ్లు పనిచేశారు. తమ విధులను కార్యాలయంలో సమర్థవంతంగా నిర్వర్తించారని ఎంపీడీవో పులిరాం సింగ్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో లు తేజావతి, శ్రీనివాసులు, కీర్తి, ఢిల్లీ బాబు, కార్యాలయ సిబ్బంది రేవంత్, శ్రీను, పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ఫార్మసీలకు వ్యతిరేకంగా మెడికల్ షాపుల సమ్మె

## శ్రీకాళహస్తిలో స్వచ్ఛందంగా మెడికల్ షాపుల మూసివేత




ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా మందుల విక్రయాలు నిర్వహిస్తూ, అధిక డిస్కౌంట్‌ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి వారి ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్న కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా అఖిల భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పిలుపుమేరకు శ్రీకాళహస్తి పట్టణంలో బుధవారం అన్ని మెడికల్ షాపులు స్వచ్ఛందంగా మూసివేసి సమ్మెలో పాల్గొన్నారు. యువతకు సులభంగా మత్తు కలిగించే మందులను ఆన్‌లైన్ ద్వారా విక్రయించడం ప్రమాదకరమని, ఈ-ఫార్మసీ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బేరవారి మండపం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ నాలుగు మాడ వీధుల గుండా కొనసాగింది. "కెమిస్టుల ఐక్యత వర్ధిల్లాలి", "ఈ-ఫార్మసీ విధానాన్ని రద్దు చేయాలి" అంటూ సభ్యులు నినాదాలు చేశారు. ఈ సమ్మెకు మద్దతుగా చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, వివిధ వ్యాపార సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతిలో బీసీ భవన్ ఏర్పాటు చేయాలి -- కేకేవీపీ బాయ్స్ హాస్టల్ పునఃప్రారంభానికి బీసీ సంక్షేమ సంఘం వినతి



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతిలో బీసీ భవన్ ఏర్పాటు చేయాలని, అలాగే కేకేవీపీలో బాయ్స్ హాస్టల్‌ను వెంటనే పునఃప్రారంభించాలని కోరుతూ ఏపీ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కంభం లోకయ్య నాయకత్వం వహించారు.బీసీ విద్యార్థులు విద్యాభ్యాసంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, హాస్టల్ సదుపాయాలను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని నాయకులు కోరారు. అలాగే బీసీ సామాజిక వర్గాల అభివృద్ధికి తిరుపతిలో ప్రత్యేక బీసీ భవన్ ఏర్పాటు అత్యవసరమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర మహిళా నాయకురాలు డా. మస్తానమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేంద్ర, జిల్లా మహిళా కార్యదర్శి జ్యోతి, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి రెహమాన్, నాగయ్య, మహిళా నాయకురాళు నాగభూషణమ్మ, దేశమ్మ తదితరులు పాల్గొన్నారు.బీసీ విద్యార్థులు మరియు సామాజిక వర్గాల అభివృద్ధికి అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం త్వరితగతిన కల్పించాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

# 22న వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో భారీ జాబ్ మేళా

## పూతలపట్టు ఎమ్మెల్యే డా. మురళీమోహన్

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎజువీఖ) కళాశాలలో నిర్వహించబోయే భారీ జాబ్ మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే డా. మురళీమోహన్ పేర్కొన్నారు. మేళాకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్యే డా. మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పంచాయతీ మరియు వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న ఉద్యోగార్థులను గుర్తించి, వారికి ఈ సమాచారాన్ని చేరవేయాలని అధికారులను సూచించారు.

జాబ్ మేళా ముఖ్యాంశాలు: పాల్గొనే కంపెనీలు: 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి.

అర్హత: 10వ తరగతి నుండి డిగ్రీ వరకు (పాస్ / ఫెయిల్) చదివిన వారు అర్హులు.

వయోపరిమితి: 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన స్త్రీ మరియు పురుష అభ్యర్థులు హాజరు కావచ్చు.

# అన్నా క్యాంటీన్ ను ఆకస్మిక తనిఖీ - ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణంలోని రామ్ సేతు బ్రిడ్జ్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఈరోజు నేను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. కేవలం 5 రూపాయలకే కడుపునిండా నాణ్యమైన భోజనం అందుతుండటంపై అక్కడ భోజనం చేస్తున్న స్థానిక పేదలు, కూలీలు మరియు యాత్రికులు అమితమైన హర్షాన్ని వ్యక్తం చేశారు. భోజనం క్వాలిటీ, క్వాంటిటీ మరియు వడ్డింపు విధానాలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నాను. ఎక్కడా పరిశుభ్రత లోపించకుండా, నిరంతరం ఇదే నాణ్యతతో పేదలకు భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించాను. పేదవాడి ముఖంలో చిరునవ్వే మన కూటమి ప్రభుత్వ మార్క్ పాలన ఉంటుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కిషోరీ బాలికలకు అవగాహన సదస్సు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఆడపిల్లకు 18, మగబిడ్డకు 21 సంవత్సరాల లోపు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని జిల్లా వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ షేక్ షహనాజ్ తెలిపారు. గూడూరు రెండో పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న ఐసిడిఎస్ రూరల్ కార్యాలయంలో కిశోరి వికాసంలో భాగంగా కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న షహనాజ్ మాట్లాడుతూ.. విద్యా హక్కు చట్టం, ఫోక్సో చట్టం, వరకట్న వేధింపులు వంటి వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు స్వరూపా రాణి, శివజ్యోతి, హైమావతి, రేణుక, చెంచులక్ష్మి, టాటా ట్రస్టు ప్రతినిధి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# కుప్పం ప్రసన్న తిరుపతి గంగమ్మకు వైభవంగా శ్రీవారి సారె

## రాష్ట్ర సౌభాగ్యం కోసం అమ్మవారిని ప్రార్థించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



ప్రజా భూమి ప్రతినిధి కుప్పం

విశ్వరూప దర్శనానికి పోటెత్తిన భక్తజనం చిత్తూరు జిల్లా కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ఈ జాతరలో అమ్మవారికి టిటిడి తరఫున శ్రీవారి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ముఖ్యమంత్రివర్యులు అమ్మవారిని ప్రార్థించారు. అంతకుముందు టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి టీటీడీ శ్రీవారి సారెను ముఖ్యమంత్రి దంపతులకు అందజేశారు. ఏడాదికి ఒక్కసారే కల్పించే అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తి పరవశంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, టిటిడి డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ అర్చకులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్యను అందించడమే

## కూటమి ప్రభుత్వం ప్రధాన ఆశయం

## మున్సిపల్ మోడల్ ప్రైమరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూలును ఆకస్మిక తనిఖీ - ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

మన విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన విద్యను అందించడమే మన కూటమి ప్రభుత్వ ప్రధాన ఆశయం. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్ఆర్ఎన్ కాలనీలో గల మున్సిపల్ మోడల్ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను విద్యాశాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు పాఠశాల భవన సదుపాయాలను పరిశీలించి, అభివృద్ధి పనులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించాను. విద్యార్థులకు ఎక్కడా వసతుల కొరత లేకుండా, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి ధీటుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఆదేశించాను. మన నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి నేను నిరంతరం శ్రమిస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు పలు శాఖ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు

## మే 21 నుండి జూన్ 2 వరకు టీటీడీలో వస్త్రాల ఈ-వేలం..!

ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాలలో భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను మే 21 నుండి జూన్ 2వ తేదీ వరకు ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ వేలంలో కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్నవి కలిపి మొత్తం 505 లాట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో పాలిస్టర్, నైలాన్, కాటన్ చీరలు, క్లాత్ బిట్స్, బ్లౌజ్ పీస్‌లు, ఉత్తరీయాలు, టర్కీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, దిండుకవర్లు, పంజాబీ డ్రెస్ మెటీరియల్స్, జంకాళం కార్పెట్లు, దుప్పట్లు, కర్టన్లు, పరదాలు, శిరోవస్త్రాలు, గొడుగులు, హుండీ గల్లేబులు, ఈర్వాడాలు తదితర వస్త్ర సామగ్రి ఉన్నాయి. ఆసక్తి గల వారు ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో సంప్రదించవచ్చు. అలాగే టీటీడీ అధికారిక వెబ్‌సైట్ సంప్రదించగలరు.

## జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా ఉచిత హెల్మెట్ల పంపిణీ

ప్రజా భూమి ప్రతినిధి సూళ్లూరుపేట



సూళ్లూరుపేట హోలీక్రాస్ జంక్షన్ వద్ద బుధవారం జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కావలి హరికృష్ణ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ అజయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై వాహనదారులకు హెల్మెట్లు అందజేశారు. మొత్తం 35 మంది ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనదారులతో ప్రతిజ్ఞ కూడా చేయించారు. కార్యక్రమంలో అభిమానులు కేశవ చంద్రశేఖర్, గుల్జార్, బాల, అజయ్ పాల్గొన్నారు. అభిమానులు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది.

## గూడూరులో మెడికల్ షాపుల బంద్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




ఆల్ ఇండియా మెడికల్ షాప్స్ బందు పిలుపులో భాగంగా గూడూరు మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెడికల్ షాపుల యజమానులు స్వచ్ఛందంగా తమ షాపులను మూసివేసి పట్టణంలో ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆన్లైన్లో మందుల అమ్మకాలు, కార్పొరేట్ సంస్థల అధిక డిస్కౌంట్లను నిలిపివేయాలని, నకిలీ మందుల అమ్మకాలను నివారించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ వందన కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాన్, కృష్ణ ప్రసాద్, అప్పారావు, దయాకర్ యాదవ్, వెంకటేశ్వర్లు,మురళి,కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంయు ఆధ్వర్యంలో ఆర్టీసీలో నిరసన

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గూడూరు లోనే ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ... ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఆర్టీసీ ద్వారా కొనుగోలు చేయాలని, వాటిని ఆర్టిసి సిబ్బందితోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, స్త్రీ శక్తి బస్సులో జీరో టికెట్టు ఇచ్చే విధానాన్ని నిలుపుదల చేసి మిగతా ప్రయాణికులకు టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకొని సిబ్బందిపై పనిభారం తగ్గించాలని, ప్రయాణికులకు సరిపడా కొత్త బస్సులు వెంటనే కొనుగోలు చేయాలని, ఏపీపీ టీడీ ఉద్యోగులను ఈ హెచ్ ఎస్ నుండి మినహాయించి గతంలో ఆర్టీసీ నందు ఉన్న వైద్య సదుపాయం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ వైస్ ప్రెసిడెంట్ జె రత్నాకర్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వెంకయ్య, డిపో చైర్మన్ భాష,సెక్రటరీ ప్రవీణ్,పోలిరెడ్డి,రవి, గాంధీ,గురవయ్య,దిలీప్,పార్వతి మంజుల తదితరులు పాల్గొన్నారు.

# సుధీర్ రెడ్డి కార్యకర్తల పక్షపాతి -డా.జి.దశరథాచారి, రాష్ట్ర కార్యదర్శి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



'కార్యకర్తే అధినేత' అని తెలుగుదేశం పార్టీ అధినేత, సియం చంద్ర బాబు నాయుడు చెప్పిన మాటలు వేదంలా భావించి, ఆచరణలో చేసి చూపుతున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కార్యకర్తల పక్షపాతి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు విశ్వబ్రాహ్మణ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ డా.జి.దశరథాచారి కొనియాడారు. తెలుగుదేశం పార్టీ వీరాభిమాని, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రతీ ఒక్కరి నోట్లో నాలుకలా ఉంటూ, అటు తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ఇటు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నాయకత్వ పటిష్ఠత కొరకు నిత్యం శ్రమించే పసుపు దళ సైనికుడు, అకుంఠిత దీక్షాపరుడు,శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్ జన్మదిన సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో కిషోర్ చేత కేక్ కట్ చేయించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా మరో రెండు రోజుల్లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని వారికి కూడా ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేసి, వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 22న తన పుట్టినరోజు సందర్భంగా ప్రజలందరి ప్రేమ, ఆశీస్సులు నాకు ఎల్లప్పుడూ ఉండాలని, అయితే... ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని అనవసరపు ఖర్చులతో ఫ్లెక్సీ హోర్డింగ్స్, టపాసులు వంటి కార్యక్రమాలకు దూరంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరారు. ఒక ప్రజాప్రతినిధిగా ప్రజల అభిమానం తనకు ఎంతో విలువైనదని,ఆ అభిమానాన్ని కేక్ కటింగ్ లేదా భారీ వేడుకల రూపంలో కాకుండా,రక్తదాన శిబిరాలు లేదా పేదలకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాల ద్వారా చూపిస్తే అది నాకు ఎంతో సంతృప్తినిస్తుందని,కాబట్టి మీ అందరి సహకారం, ఆశీస్సులు నాపై ఎళ్ళవేళలా ఉండాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డా.జి.దశరథాచారి,మిన్నల్ రవి,కామేష్ యాదవ్,డా. యం.ఉమేష్ రావు,యం.సుబ్బయ్య,వజ్రం కిషోర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశవాణి 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యాసరచన పోటీలు..!

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి:






ఆకాశవాణి భారతీయ ప్రసార రంగంలో తొంభై ఏళ్ల సేవలను పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 'ఆకాశవాణి తిరుపతి కేంద్రం వేమన విజ్ఞాన కేంద్రం" సంయుక్తంగా "స్వాతంత్ర్యం అనంతరం దేశ నిర్మాణంలో ఆకాశవాణి పాత్ర " అనే అంశం పై బుధవారం వ్యాసరచన పోటీలు వేమన విజ్ఞాన కేంద్రం లోనిర్వహించడం జరిగింది. ఈ పోటీలు జూనియర్స్ 6,7 తరగతులు, సీనియర్స్ 8,9,10 తరగతులు,సూపర్ సీనియర్స్ ఇంటర్, డిగ్రీ విద్యార్థులు మొత్తం మూడు గ్రూపుగా ఈ పోటీలు జరిగాయి. ఇందులో విజేతలు గా జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి టి.హిరన్మయి, ద్వితీయ బహుమతి ఎన్. దరణిస్వర్ రెడ్డి, తృతీయ బహుమతి జాహ్నవి చౌదరి సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పి. భూమిక, ద్వితీయ బహుమతి ఎం. పవిత్ర రెడ్డి తృతీయ బహుమతి టి.హేమానంద రెడ్డి. సూపర్ సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి డి. నేహాశ్రి, ద్వితీయ బహుమతి కె. తులసిసాక్ష, తృతీయ బహుమతి అర్ ఎస్ షాలిని గెలుపొందారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆకాశవాణి తిరుపతి కేంద్రం సహాయ సంచాలకులు ఎం.సుధాకర్ మోహన్,వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున లు మాట్లాడుతూ ఆకాశవాణి ప్రజల జీవితాల్లో,సమాచార,విద్యా, వినోద రంగాల్లో పోషించిన విశిష్ట పాత్రను ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. అనంతరం ఈ పోటీలో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందచేశారు. పాల్గొన్న విద్యార్థులకు అందరికీ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ సాయి రఘునాథ్ ,వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధుల టెంకాయల దామోదరం, గురునాధం, డా. గోపాల్,జయరామయ్య, రెడ్డెప్ప,రఫీ,డా.రవీంద్ర కుమార్, డా.నెమిలేటి కిట్టన్న, ఎన్వీ రమణ ప్రసాద్, విశ్వనాథ రెడ్డి, చెస్ బాలాజీ చౌదరి తదతరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తి రైల్వే స్టేషన్ సమీపంలో "శరవణ భవన్ "హోటల్ నందు భోజనం తయారీ, వడ్డింపు విషయంలో జరిగిన హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం వలన తల్లి, పిల్లలు కు అస్వస్థత..

## నాణ్యత లేని హోటల్ పైన చర్యలు తీసుకోవాలి -: ఫుడ్ సేఫ్టీ అధికారులు





ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

కోడూరు ఆదినారాయణ అను నేను మా ఫ్యామిలీ కలిసి శ్రీకాళహస్తి దర్శనార్థం వచ్చి, తిరుగు ప్రయాణం లో రైల్వే స్టేషన్ సమీపంలో గల సర్వనా భవన్ హోటల్ నందు భోజనం చేయడం జరిగింది. భోజనంలో అన్ని టేబుల్స్ నందు నెయ్యికి బదులు వంట నూనె ఉంచడం వలన యాత్రికులు అస్వస్థతకు గురికావడం జరిగినది. తెలియక నెయ్యి అనుకోని వేసుకోవడం వల్ల స్వల్ప దీనిపైన మేనేజ్మెంట్ వారితో విచారించగా మేము చెప్పడం జరిగింది.. దీనికి తోడు ఓనర్ ని ప్రశ్నిస్తున్న ఎదురు దాడి చేయడం జరిగింది. ఫుడ్ సేఫ్టీ ఆపదల చేయాలని కోరడమైనది. హోటల్ అపరిశుభ్రంగా సరైన పనిమనుషులు లేని కారణంగా చాలా ఇబ్బందికరంగా ఉన్నది తెలియజేశారు. గత పది సంవత్సరాల నుంచి అదే సమయంలో స్వీపర్సు వంట చేసే మహిళలు ఓనర్ తరఫున యాత్రికుల మీదికి ఇస్తున్నాము. మేం ఇంతే అని సమాధానం అధికారులు చర్యలు తీసుకోవాలని దీని మీద సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి తక్షణమే హోటలను బాధితులకి చరవాణి ద్వారా గా వివరణ అడగక హోటల్ యాజమాన్యం నిర్లక్ష్యం సమాధానం మేమింతే మీరేం చేసుకుంటారో చేసుకోండి దురుసుగా ప్రవర్తించారని ఆవేదం వ్యక్తపరిచారు ఈ విషయంగా ఫుడ్ సేఫ్టీ అధికారులను సంప్రదించి కంప్లైంట్ ఇస్తానని తెలియజేశారు. కోడూరు ఆదినారాయణ బాధితులు నెంబర్:9000113446..

## పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను తగ్గించాలి - సి పి ఐ (ఎం ఎల్ న్యూ డెమోక్రసీ) జిల్లా కార్యదర్శి డి పి పోలయ్య డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సిఎన్జి ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డి పి పోలయ్య డిమాండ్ చేస్తూ బుదవారం గూడూరు లో నీ రిటైర్డ్ అధికారుల భవనం లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని, పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, సిఎన్జి ధరలను తగ్గించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తుందని, ప్రజలపై పెనుభారాలు మోపుతున్నదని విమర్శించారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను పెంచుతున్నదని దుయ్యబట్టారు. వంట గ్యాస్ పై 60 రూపాయలు, కమర్షియల్ గ్యాస్ పై 993 రూపాయలు, పెట్రోల్, డీజిల్ పై మూడు రూపాయలు చొప్పున, సిఎన్జి గ్యాస్ పై రూపాయి చొప్పున ధరలు పెంచి, వేల కోట్ల రూపాయల బారాలను మోపి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని ఎద్దేవా చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ఈ ధరలను పెంచి తమ వర్గ నైజాన్ని చాటుకుందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, సిఎన్జి గ్యాస్ ధరలు పెరగడంతో రవాణా రంగంపై భారం పడటం, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు, అన్ని వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. సామాన్య ప్రజల జీవనం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. చమురు కంపెనీల ఒత్తిళ్లకు తలొగ్గి మరో 10 రూపాయలు పెట్రోల్, డీజిల్ పై పెంచడానికి మోడీ ప్రభుత్వం సాహసించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, సిఎన్జి ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు కె చంగల్ రావు, బిసి డబ్ల్యు వ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి లు డి నవ కోటి,ఎం అనిల్,నాయకులు రత్నయ్య లు పాల్గొన్నారు.



## మత్స్యకార సేవలో పథకం కింద 3,099 మంది మత్స్యకారులకు రూ.6.19 కోట్ల ఆర్థిక సాయం

### : జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




చేపల వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం "మత్స్యకార సేవలో" పథకం ద్వారా రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోందని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా తుమ్మలపెంట నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో 2026-27 సంవత్సరానికి సంబంధించి 3,099 మంది మత్స్యకారులకు మొత్తం రూ.6.19 కోట్లు డీబీటీ ద్వారా వారి ఖాతాల్లో జమ అవుతున్నట్లు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధ కాలాన్ని అమలు చేస్తున్నామని, ఈ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడుమాట్లాడుతూ తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక గస్తీ, సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,అధికారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల పట్టణంలోని ముద్దనూరు రోడ్ గాంధీ సర్కిల్ సమీపంలో ఒక ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన చోటుచేసు కుంది స్థానికుల కథనం మేరకు చీనీ కాయలమూటతో పల్సర్ వాహనంలో ముద్దనూరు రోడ్డు వైపు వెళ్తున్న ఒక వ్యక్తి బైక్ అదుపు తప్పిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి ఈ విషయం గమనించిన స్థానికులు గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 11
గురువారం 21 మే 2026

# పెట్రో ధరలపై నాడు చంద్రబాబు, లోకేష్ ఏమన్నారు?

**- అధికారంలోకి వస్తే పెట్రో ధరలు తగ్గిస్తామని చెప్పారు - ఇప్పుడు పెట్రో ధరల మంట. అయినా ఉలుకు లేదు**

**- ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా, వెంటనే పన్నులు తగ్గించాలి : వైసీపీ నేత కెకె రాజు**

ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి:
గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే పెట్రో ధరలు అధికమని, తాము అధికారంలోకి రాగానే వాటిని తగ్గిస్తామని నాడు ప్రకటించిన ప్రస్తుత సీఎం చంద్రబాబు, ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ వెంటనే ఆ పని చేయాలని విశాఖ జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు కెకె రాజు డిమాండ్ చేశారు. నాడు పెట్రో ధరలు ప్రస్తావిస్తూ, నానా హంగామా చేసిన తండ్రీ కొడుకులు, ఇప్పుడు ఆనాటి మాదిరిగా పెట్రోల్ బంక్‌ల ముందు సెల్ఫీ దిగే దమ్ముందా? అని ఆయన సవాల్ చేశారు. రెండేళ్ల చంద్రబాబు పాలనంతా అబద్ధాలు, అప్పులు, మోసాలే. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక, పాలన చేత కాక రెండేళ్లలో ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని, అందుకే చెప్పుకోవడానికి ఏమీ లేక, డ్రామాలు, రీల్స్‌తో సీఎం చంద్రబాబు కాలక్షేపం చేస్తున్నారని కెకె రాజు ఆక్షేపించారు. చంద్రబాబుకి 28 జిల్లాల ఏపీ కన్నా 29 గ్రామాల అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యమని, అక్కడి నిర్మాణాలకు డీజిల్ కొరత రాకూడదని ఏకంగా రాష్ట్ర వ్యాప్తంగా డీజిల్ కొరత సృష్టించారని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కెకె రాజు దుయ్యబట్టారు.

ప్రెస్‌మీట్‌లో కెకె రాజు ఇంకా ఏమేం మాట్లాడారంటే..:

**- చంద్రబాబు డ్రామాలు. రీల్స్:**
ఎన్నికలకు ముందు ప్రజలకు మాయమాటలు చెప్పి, వారిలో భ్రమలు కల్పించి తప్పుడు హామీలతో చంద్రబాబు ఎలాగైతే అధికారంలోకి వచ్చాడో, గడిచిన రెండేళ్లుగా అవే అబద్ధాలను, మోసాలతోనే పాలన సాగిస్తున్నాడు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక, వాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి జగన్‌గారిపైనా, మా పార్టీపైనా దుష్ప్రచారంతో కాలక్షేపం చేస్తున్నాడు. రెండేళ్ల పాలనలో చేసిందేమీ లేకపోయినా మీడియా పబ్లిసిటీతో హడావుడి చేస్తున్నాడు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ చార్జీల భారంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే చంద్రబాబు మాత్రం పబ్లిసిటీ కోసం వీడియోలు చేసుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

అదే నాడు జగన్ గారు పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే సంకల్పంతో వినూత్న మార్పులు తీసుకొచ్చారు. ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలస వెళ్తున్న మత్స్యకారుల కష్టాలను తన పాదయాత్రలో కళ్లారా చూసిన, జగన్‌గారు రాష్ట్రంలో ఉన్న సుదీర్ఘ తీర ప్రాంతాన్ని అవకాశంగా చేసుకుని పోర్టులు, ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఎవరూ ఆలోచన చేయని విధంగా బ్లూ ఎకానమీని సృష్టించడానికి కృషి చేశారు. కానీ చంద్రబాబు వీడియోలతో పబ్లిసిటీ చేసుకోవడం తప్ప ఏమీ కనిపించడం లేదు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ పంపిణీ సందర్భంగా గ్రామాన్ని పోలీసులతో దిగ్బంధించి ఒక్కోసారి ఒక్కో కుటుంబాన్ని ఎంచుకుని వారింట్లో హడావుడి చేసి పోతున్నాడు. తాజాగా మత్స్యకారుల సేవలో అంటూ నెల్లూరు జిల్లా కావలిలో కూడా డ్రామా చేసి వెళ్లారు.

**- ఆ బోట్ల గురించి ఎందుకు మాట్లాడటం లేదు?:**
కావలి పర్యటనకు వెళ్లిన చంద్రబాబు అక్కడ ఒక చిన్న గుడిసె ఏర్పాటు చేసి అందులో చేపలు కొనుగోలు చేస్తున్నట్టు హడావుడి చేశాడు. ఆ తర్వాత ఒకరి ఇంటికి వెళ్లి గ్యాస్ కూడా వెలిగించకుండానే వంట చేస్తూ వీడియోలు ప్రచారం చేసుకున్నాడు. చంద్రబాబుకి పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేశాడు. ప్రజలు ప్రశ్నిస్తున్నారనే భయంతో ఇలాంటి వీడియోలు తీసుకుని డ్రామాలు చేసి వెళ్తున్నాడు. తమిళనాడు జాలర్లు మన రాష్ట్రంలోకి అక్రమంగా ప్రవేశించి మత్స్యసంపదను దోచుకుని వెళ్తున్నా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో మన మత్స్యకారులు ప్రాణాలకు తెగించి బోట్లను పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే, పోలీసులు సీజ్ చేసిన బోట్లను అర్థరాత్రి పూట తప్పించేశారు. ఆ డ్యామేజ్‌ని కవర్ చేసుకోవడానికి నిన్న కావలి పర్యటనకు వెళ్లిన చంద్రబాబు మనల్ని ఆపేదెవరు అంటూ రెచ్చిపోయాడు తప్ప, మత్స్యకారులకు ఎలాంటి భరోసా కల్పించలేకపోయారు.

**- అమరావతిలో రియల్ ఎస్టేట్ చంద్రబాబు ప్రయారిటీ:**
చంద్రబాబుకి అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యం. రాష్ట్రంలో ఉన్న 28 జిల్లాల కన్నా ఆయనకు 29 గ్రామాల అమరావతే ముఖ్యం. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారమే చంద్రబాబుకి కావాలి. ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాకుండా రియల్ ఎస్టేట్ వెంచర్ ఓనర్‌గా వ్యవహరిస్తున్నారు. డీజిల్ కొరత వల్ల అమరావతిలో నిర్మాణాలు ఆగకూడదనే తపనతో, రాష్ట్ర వ్యాప్తంగా డీజిల్ కొరత సృష్టించారు. రిటైల్ డీలర్లను బెదిరించి లక్షలాది లీటర్ల డీజిల్ స్టోర్ చేసి పెట్టారు. దీంతో రాష్ట్రంలో కృతిమ కొరత ఏర్పడి, వాహనదారులు నానా ఇబ్బంది పడ్డారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రతిపక్ష వైయస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పుకోలేక సమయం, సందర్భం, వేదికలతో సంబంధం లేకుండా గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని, జగన్‌గారిని నిందించడమే తన పని అన్నట్లు చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చివరకు పారిశ్రామికవేత్తల ముందు కూడా రాజకీయ ఉపన్యాసాలు చేస్తూ, ప్రతిపక్ష నాయకుడిని బూతులు తిడుతూ చంద్రబాబు, లోకేష్ రాష్ట్రం పరువు తీస్తున్నారు.

**- సింహాచలం భూములు కాజేస్తున్నారు:**
సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని చెప్పుకుని అధికారంలోకి వచ్చిన పార్టీలు సింహాచలం గిరి ప్రదక్షిణ జరిగే ప్రాంతంలో 160 ఎకరాలను గూగుల్ సంస్థకు కట్టబెట్టేశారు. విశాఖ సెంట్రల్ జైలు నిర్మించిన భూములు కూడా సింహాచలం ఆలయానికి చెందిన భూములే. వాటిని గతంలో చంద్రబాబు ధారాదత్తం చేశాడు. సింహాద్రి అప్పన్న భూములనే సింహాచలం డిపోకి కేటాయించాడు. రుషికొండలో బార్లు, కన్వెన్షన్ సెంటర్ ఉండే ప్రాంతంలో భారీ స్థాయిలో ప్రభుత్వ టూరిజం గెస్ట్ హౌస్‌లు నిర్మిస్తే రుషికొండకు గుండుకొట్టారని దుష్ప్రచారం చేశారు. గతంలో జగన్‌గారు ఆదిశంకరా చార్యులు మెమోరియల్ కోసం 15 ఎకరాల పావురాల కొండ ప్రాంతాన్ని కేటాయిస్తే, చంద్రబాబు ప్రభుత్వం దాన్ని రద్దు చేసింది. అంతే కాకుండా ఆ భూములను స్పాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్వహించే రిసార్టుకి కేటాయించింది.

**- దమ్ముంటే ఇప్పుడు సెల్ఫీ దిగండి:**
ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే పెట్రోల్ డీజిల్‌పై వెంటనే పన్నులు తగ్గించాలి. చంద్రబాబు, లోకేష్‌కు నిజంగా దమ్ము ధైర్యం ఉంటే గతంలో మాదిరిగా పెట్రోల్ బంక్‌ల వద్ద ధరల పట్టికల ముందు సెల్ఫీ దిగగలరా? మండుతున్న పెట్రో ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు నిత్యావసరాల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. కాబట్టి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెట్రో ధరలు తగ్గేలా చూడాలి. దేశవ్యాప్తంగా మన దగ్గరే పెట్రోల్ ధర ఎక్కువగా ఉన్నందున, వెంటనే ఆ ధరలు తగ్గించాలని కెకె రాజు తేల్చి చెప్పారు.

# జలధార--జలహారతి కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలి

**ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పిద్దాం : జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
జలధార--జలహారతి మరియు నీటి సంఘాల బాధ్యత కార్యక్రమాలను జిల్లాలో సమగ్రంగా, ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సిబ్బంది, ఏ పి ఓ లు , డ్వామా, హార్టికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర అధికారులతో వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెరువులు, కాలువలు, కుంటల పునరుద్ధరణ కార్యక్రమాలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ప్రతి గ్రామంలో నీటి వనరులను గుర్తించి, వాటి పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లా లో ఇప్పటి జలదార - జలహారతి కార్యక్రమం ద్వారా 4143 పనులను గుర్తించడం జరిగిందన్నారు. అందులో 3376 పనులకు అనుమతులు ఇచ్చామన్నారు. వాటిలో 1536 పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 27 పనులు పూర్తి అయిందని తెలిపారు. అనుమతులు ఇచ్చిన పనులను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. "ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రతను కల్పించగలం" అని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి వృథాను నివారించడంతో పాటు, వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జలధార--జలహారతి కార్యక్రమంలో భాగంగా చెరువుల పూడిక తొలగింపు, కాలువల శుభ్రత, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, పంట పొలాల్లో నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో నీటి సంఘాలను చురుకుగా పనిచేసేలా చేసి, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే నీటి వనరుల సంరక్షణ లక్ష్యాలు సాధ్యమవుతాయని చెప్పారు. జలధార--జలహారతి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, పురోగతిపై తరచూ సమీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎం. సి. మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ ఈ రాధాకృష్ణ, ఏపిడి లు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో జనగణన కార్యక్రమం 26వ తేదీలోగా పూర్తిచేయాలి

- **తాళం వేసిన ఇళ్ల యజమానుల వివరాలను ఫోన్ ద్వారా సేకరించాలి**
- **జనగణన పురోగతిపై అధికారులతో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ టెలి కాన్ఫరెన్స్ : సుమిత్ కుమార్**

ప్రజాభూమి ప్రతినిధి,చిత్తూరు
జిల్లాలో జరుగుతున్న జనగణన కార్యక్రమాన్ని ఈ నెల 26వ తేదీలోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జనగణన పురోగతిపై బుధవారం సాయంత్రం అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇండ్ల గణన కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ప్రగతి చూపించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు 70 శాతం కన్నా తక్కువగా గణన పూర్తి చేసిన అధికారులు అందుకు గల కారణాలను తెలియజేసి, శుక్రవారం లోగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని సూచించారు.
తహసీల్దార్లు ఇండ్ల గణన సమయంలో అనేక ఇళ్లు తాళం వేసి ఉన్నాయని సమస్యను ప్రస్తావించగా, వాటిపై స్పందించిన జిల్లా కలెక్టర్ తాళం వేసిన ఇళ్ల యజమానుల ఫోన్ నెంబర్లు పక్కవారిని అడిగి సేకరించి, ఫోన్ ద్వారా వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జనగణన ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులందరూ వచ్చే వారం తమ మండలాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని, కనీసం మూడు రోజుల పాటు గ్రామాల్లో పరిశీలనలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. యాదృచ్ఛికంగా ఖాళీ ఇళ్లు, తాళం వేసిన ఇళ్లను స్వయంగా పరిశీలించి, గణన సక్రమంగా జరుగుతోందో లేదో నిర్ధారిం చాలన్నారు. అలాగే తహసీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు గణన సిబ్బందిని సమన్వయం చేసుకొని పని చేయాలని, గ్రామాల్లో ఇంకా జనాభా గణనలో లోటుపాట్లు ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులు జనాభా ఆధారంగా విడుదలవుతాయని, అందువల్ల ఒక్క కుటుంబం కూడా మిగలకుండా గణన పూర్తిచేయాలని తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ జిల్లాలో మొదట్లో



రాష్ట్ర స్థాయిలో ముందంజలో ఉన్న జనగణన పురోగతి ప్రస్తుతం తగ్గిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 15 లక్షల 75 వేల జనాభా మాత్రమే నమోదు కాగా, అంచనా ప్రకారం 18 లక్షల 97 వేల జనాభా నమోదుకావాల్సి ఉందన్నారు. దాదాపు మూడు లక్షలకుపైగా తేడా కనిపిస్తోందని తెలిపారు. 2011 జనగణన ప్రకారం జిల్లాలో జనాభా 16 లక్షల 43 వేల 224గా నమోదైందని, అప్పటి నుంచి 14 సంవత్సరాలు గడిచిన నేపథ్యంలో ప్రస్తుత జనాభా మరింత పెరిగి ఉండాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుతం నమోదైన సంఖ్య 2011 గణాంకాల కంటే కూడా తక్కువగా ఉండటం ఆందోళనకరమన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 60 వేల ఖాళీ ఇళ్లు, 11 వేల తాళం వేసిన ఇళ్లు ఉన్నట్లు నమోదైందని తెలిపారు. ఈ ఇళ్లన్నింటినీ మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట జనాభా నమోదు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గణన పరిధిలో కనీసం 25 నుంచి 50 ఇళ్ల వరకు తిరిగి పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతం పలమనేరు, రొంపిచర్ల మండలాలు మాత్రమే 90 శాతం పైగా పురోగతి సాధించాయని, మిగతా మండలాలు కూడా కనీసం 95 శాతం వరకు లక్ష్యాన్ని చేరుకోవాలని పేర్కొన్నారు. ఖాళీ ఇళ్లు, తాళం వేసిన ఇళ్ల పరిశీలనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులకు సూచించారు.

# పురపాలక స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు పాగా ఎక్కడ వేయలేదు

**ఓర్వలేని వ్యక్తులు చేస్తున్న ఆరోపణలు మాత్రమే -కమిటీ సభ్యులు**



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో ఉన్న విజయ హోమ్స్ లో పురపాలక స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులు పాగావేశారని కొంతమంది ఓర్వ లేని వ్యక్తులు ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని విజయ హోమ్స్ ప్రెసిడెంట్ వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వైయస్ వెంకటరెడ్డి, జనరల్ సెక్రటరీ మురళి, వైస్ ప్రెసిడెంట్ కే రామచంద్రారెడ్డి, ట్రెజరర్ రామాంజనేయులు రెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ,సోమేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, లు అన్నారు. ఈ సందర్భంగా వారు విజయ హోమ్స్ లో విలేకరులతో బుధవారం మాట్లాడుతూ విజయ హోమ్స్ లోపురపాలక శాఖ సంబంధించిన ఆస్తిని ఎవరు కబ్జా చేయలేదని వారన్నారు. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ని కే వేలమారి పల్లె గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 48 ఏ లో విజయ హోమ్స్ ఓనర్లు మున్సిపాలిటీకి గతంలో ఒక ఎకరా 62 సెంట్లు స్థలం ఇవ్వడం జరిగిందని, అందులో మున్సిపాలిటీ వారు జిమ్ము పరికరాలు, ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజయ హోమ్స్ కమిటీ ఆధ్వర్యంలో ఇక్కడ కేవలం వాకింగ్ చేసే వారికి ఇబ్బంది కలగకుండా బాత్రూం లు సొంత నిధులతో కట్టించడం జరిగిందన్నారు. కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించుకునేందుకు ఒక సెంటు స్థలంలో ఒకరేకుల షెడ్డు 3 లక్షల రూపాయ లు వేయంతో నిర్మించడం జరిగిందన్నారు. ఈ పార్కులో వాకింగ్ చేసే టైంలో వర్షాలు పడినప్పుడు గానీ లేదా కాసేపు చేత తీర్చుకునేందుకు ఈ షెడ్డు 3 లక్షల రూపాయల సొంత నిధులతో నిర్మించడం జరిగిందన్నారు. ఇది కేవలం మున్సిపాలిటీకి సంబంధించిన స్థలమే కానీ ఎవరు ఇక్కడ కబ్జా చేయలేదని వారన్నారు. కానీ కొంతమంది వ్యక్తులు కబ్జా చేశారని అపోహలు చూస్తూ చేస్తున్నారని వారన్నారు.

# ఆన్‌లైన్ మందుల విక్రయాలకు వ్యతిరేకంగా మందుల దుకాణాలు బంద్

**-నిరసన వ్యక్తం చేసిన మెడికల్ షాప్ యజమానులు**




ప్రజాభూమి,పులివెందుల
ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను నిలిపివే యాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కెమిస్టుల సమాఖ్య ఆల్ ఇండియా సమ్మె కార్యక్రమంలో భాగంగా బుధవారం మెడికల్ దుకాణాలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ సందర్భంగా పులివెందుల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్, పులివెందుల జోన్ సెక్రటరీ మేడా దినేష్ కుమార్, కోశాధికారి శ్రీనివా సుల ఆధ్వర్యంలో మెడికల్ షాప్ యజమానులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ర్యాలీ తాసిల్దార్ కార్యాలయం వద్ద చేరుకొని వారు డిప్యూటీ తహసిల్దార్ వెంకట్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు అనంతరం ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ విధానంలో మందుల సరఫరా పెరిగితే చిన్న, మధ్య తరహా మెడికల్ దుకాణాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలు మెడికల్ షాపులపై ఆధారపడి జీవిస్తున్నాయని, ఆన్‌లైన్ విక్రయాల వల్ల వారి ఉపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఆన్‌లైన్ ఫార్మసీల ద్వారా నకిలీ మందులు విక్రయించే ప్రమాదం ఉందని, నియంత్రణ లేకుండా మందులు అందుబాటులోకి రావడం వల్ల యువత మాదక ద్రవ్యాల బారిన పడే అవకాశం పెరుగుతోందని పేర్కొన్నారు. డోర్ డెలివరీ విధానం,భారీ డిస్కౌంట్ల పేరుతో కార్పొరేట్ సంస్థలు చిన్న వ్యాపారులను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఆన్‌లైన్ మందు ల విక్రయాలపై కఠిన నియంత్రణలు తీసుకురావాలని, కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాము బందు చేయడం వలన రోగులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని వారు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో మందుల షాపు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన సాధికారతే లక్ష్యం -- జన్ భాగీదారి కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి సంక్షేమ సేవలు



ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.
గిరిజన ప్రాంతాలలో నివసిస్తున్న పీవీ టి జి.(ప్రత్యేకంగా వెనుకబడిన గిరిజన తెగలు) మరియు ఇతర గిరిజన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించి, వంద శాతం ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో 18-05-2026 నుండి 25-05-2026 వరకు దేశవ్యాప్తంగా "జన్ భాగీదారి - సబ్బే దూర్, సబ్బే పెహ్లే" కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలో గిరిజన జనాభా అధికంగా ఉన్న మూడు మండలాలలోని మూడు గ్రామాలు డి ఎ. జెజి యుఏ కార్యక్రమం కింద ఎంపిక చేయబడ్డాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, ఆరోగ్య కార్డులు, కిసాన్ క్రెడిట్ కార్డులు, కుల ధృవీకరణ పత్రాలు మరియు సికిల్ సెల్ అనీమియా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, పీఎంయూ సిబ్బంది, ఎంపీడీఓ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆధార్ ఆపరేటర్లు, ప్రగతి, నవజీవన్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్వాడి టీచరు, ఆశా, లోకల్ నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోర్టు భూసేకరణ పరిహారం వివాదం: సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయాన్ని ఆశ్రయించిన పామంజి బాధితులు!

- **48 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న 12 కుటుంబాల పేర్లు మాయం**
- **సానుకూలంగా స్పందించిన సూళ్లూరుపేట ఏవో శరత్ కుమార్;**
- **మూడు రోజుల్లో కలెక్టర్‌నుకూడా కలుస్తాం అంటున్నా బాధితులు**

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు
వాకాడు మండలంలో పోర్టు భూసేకరణ పరిహారం చుట్టూ నెలకొన్న వివాదం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. గత 48 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పరిహారం దక్కకుండా పోతుందనే ఆవేదనతో, న్యాయం కోసం బాధితులు పోరాటాన్ని ఉధృతం చేశారు. వాకాడు తహసిల్దార్ కార్యాలయంలో ఆశించిన స్పందన లభించక పోవడంతో, బాధితులంతా కలిసి ఈరోజు సూళ్లూరుపేటలోని రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయాన్ని ఆశ్రయించారు.

**48 ఏళ్ల కష్టం.. సాంకేతికత తెచ్చిన నష్టం!**
వాకాడు మండలం పామంజి గ్రామానికి చెందిన 17 కుటుంబాలు గత 48 ఏళ్లుగా 25 ఎకరాల డీకేటీ భూమిని నమ్ముకుని జీవిస్తున్నాయి. నాడు తమ వద్ద ఉన్న జీవాలను అమ్ముకుని, ప్రభుత్వానికి శిస్తులు కట్టి, రక్తాన్ని చెమటగా మార్చి ఈ భూమిని సాగు యోగ్యంగా మార్చుకున్నారు. అయితే, నాటి



సాంకేతిక కారణాల వల్ల కేవలం ఐదుగురి పేరిట మాత్రమే పట్టాలు ఉండటం ఇప్పుడు మిగిలిన 12 కుటుంబాల పాలిట శాపంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ నౌకాశ్రయం (పోర్టు) ఏర్పాటు కానుండటంతో, భూములకు భారీగా పరిహారం దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, పట్టాలు ఉన్న ఆ ఐదుగురి వారసులు ఇప్పుడు "భూమి మొత్తం మాదే"నంటూ మొండికేస్తుండటం వివాదానికి కారణమైంది.

**నోటిఫికేషన్‌లో పేర్లు మాయం.. కన్నీరు మున్నీరైన బాధితులు**
ప్రభుత్వ పోర్టు నోటిఫికేషన్‌లో మిగిలిన 12 కుటుంబాల పేర్లు మాయం కావడంతో బాధితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తరతరాలుగా నమ్ముకున్న భూమి పరాయిపాలవుతుంటే తట్టుకోలేక, న్యాయం కోసం వారు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వాకాడు తహసిల్దార్ కార్యాలయం పరిధిలో సమస్య సద్దుమణగకపోవడంతో, బాధితులంతా నేరుగా సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయానికి తరలివచ్చారు. "మా జీవాలు అమ్మి, శిస్తులు కట్టి పెంచి పెద్ద చేసిన భూమి ఇది. ఈరోజు పోర్టు పరిహారం వచ్చేసరికి మమ్మల్ని రోడ్డున పడేస్తున్నారు'' అంటూ బాధితులు ఆర్డీఓ కార్యాలయం వద్ద కన్నీటిపర్యంతమయ్యారు.

**ఆర్డీఓ కార్యాలయంలో అర్జీ.. ఏవో శరత్ కుమార్ హామీ**
తమకు జరుగుతున్న ఘోర అన్యాయాన్ని వివరిస్తూ బాధితులు సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని (అర్జీ) సమర్పించారు. బాధితుల బాధను విన్న ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) శరత్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, క్షేత్రస్థాయి వాస్తవాల ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని ఆయన బాధితులకు స్పష్టమైన హామీ ఇచ్చారు.

**"న్యాయం జరిగే వరకూ వదిలే ప్రసక్తే లేదు!"**
"గత నాలుగు దశాబ్దాలుగా రక్తాన్ని చెమటగా మార్చి ఆ భూమిని కాపాడుకున్నాం. ఈరోజు కోట్ల రూపాల పరిహారం అనగానే మమ్మల్ని రోడ్డున పడేయాలని చూస్తున్నారు. ఆర్డీఓ కార్యాలయంలో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నాం. ఒకవేళ ఇక్కడ కూడా మాకు న్యాయం జరగకపోతే.. మరో మూడు రోజుల తర్వాత నేరుగా జిల్లా కలెక్టర్‌ను కలిసి మా బాధను చెప్పుకుంటాం. మాకు న్యాయం జరిగేంత వరకుఈ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదు."

# జనాభా గణనలో ఏ ఒక్క ఇల్లూ మిగిలిపోకూడదు





❖ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ క్షేత్రస్థాయి పరిశీలన ..అధికారులకు కీలక ఆదేశాలు
❖ అన్న క్యాంటీన్‌లో స్వయంగా భోజనం చేసిన కలెక్టర్.. నాణ్యతపై సంతృప్తి
❖ రూ. 50 లక్షల విద్యా వనరుల భవన నిర్మాణ నాణ్యతను ప్రత్యేక పరికరాలతో పరీక్షించిన వైనం

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

జిల్లాలో జనాభా గణన కార్యక్రమాన్ని అత్యంత సజావుగా, వంద శాతం పూర్తి చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లాలోని కోడూరు, అవనిగడ్డ, ఘంటసాల, పామర్రు మండలాల్లో విస్తృతంగా పర్యటించి, ప్రభుత్వ పథకాల అమలు తీరును మరియు వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.తాళం వేసి ఉంటే.. మళ్లీ వెళ్లాల్సిందేతొలుత కోడూరు మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శిం చిన కలెక్టర్, జనాభా గణన పురోగతిపై సమీక్షించారు. ఇళ్లకు తాళాలు వేసి ఉంటే ఏం చేస్తున్నారని అధి కా రులను విచారించారు.ఏ ఒక్క ఇల్లూ గణన చేయకుండా మిగిలిపోకూడదు. తాళాలు వేసి ఉన్న ఇళ్లకు ఎన్యుమరేటర్లు మళ్లీ వెళ్లి వాస్తవ వివరాలను సేకరించాలి. వివరాల అప్‌లోడింగ్‌లో ఉన్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించి, మిగిలిన ఇళ్ల గణనను తక్షణమే పూర్తి చేయాలి.డీకే బాలాజీ, జిల్లా కలెక్టర్మండలంలో ఉన్న 15 వేల ఇళ్లకు గాను ఇప్పటివరకు 13 వేల ఇళ్ల గణన పూర్తయిందని తహసిల్దార్ సౌజన్య కిరణ్మయి కలెక్టర్‌కు వివరించారు. ఇదే సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండేలా తీసుకున్న జాగ్రత్తలపై కలెక్టర్ ఆరా తీశారు.అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ.. స్వయంగా భోజనం చేసిన కలెక్టర్అనంతరం అవనిగడ్డలోని అన్న క్యాంటీన్ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి, అక్కడ భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా క్యాంటీన్ వద్ద ప్రజల కోసం నీడ ఏర్పాట్లు చేయాలని, వాష్ బేసిన్‌కు మెష్ అమర్చాలని, పెద్ద చెత్తబుట్టను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ పర్యటన - ముఖ్యాంశాలు

కోడూరు: జనాభా గణన పరిశీలన, 100% నమోదుకు ఆదేశం.అవనిగడ్డ: అన్న క్యాంటీన్ తనిఖీ, నాణ్యమైన భోజనంపై సంతృప్తి.

ఘంటసాల: రూ. 50 లక్షల MRC భవన నిర్మాణ నాణ్యత పరీక్ష.

పామర్రు: నైపుణ్యాభివృద్ధి కేంద్రం సందర్శన, యువత శిక్షణపై సమీక్ష.ప్రత్యేక పరికరాలతో భవన నాణ్యత పరీక్షఘంటసాల మండలంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న మండల విద్యా వనరుల (MRC) భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. భవన స్తంభాల (Pillars) నాణ్యతను కలెక్టర్ తన వెంట తెచ్చుకున్న ప్రత్యేక పరీక్ష పరికరాలతో స్వయంగా పరీక్షించడం విశేషం. భవన నిర్మాణంలో ఉపయోగించే టైల్స్, వాష్ బేసిన్, ఎలక్ట్రికల్ సామాగ్రి తదితరాలన్నింటిలోనూ నాణ్యతా ప్రమాణాలు విధిగా పాటించాలని ఎauthoritiesకు స్పష్టం చేశారు. యువత నైపుణ్యాల పెంపుపై ఆరాచివరిగా పామర్రు మండలం కురుమద్దాలిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ (Skill Development) కేంద్రాన్ని సందర్శిం చారు. యువతకు అందిస్తున్న శిక్షణ కార్యక్ర మాలు, వారి నైపుణ్యాలను ఎలా పెంపొందిస్తున్నారనే వివరాలను సంస్థ జిల్లా అధికారి నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ విస్తృత పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్లు సౌజన్య కిరణ్మయి, శ్రీనివాసరావు, విజయప్రసాద్, ఎంపీడీఓలు సుధా ప్రవీణ్, మరియాదేవి, సుబ్బారావు, ఎంఈఓ అహ్మద్ మోమిన్, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ప్రతిభ చూపిన శ్రీ చైతన్య విద్యార్థులు

## ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతి ప్రదానం

అవనిగడ్డ / ప్రజాభూమి ప్రతినిధి



జాతీయ స్థాయి ఐ.ఎన్.టీ.ఎస్.ఓ రెండవ లెవెల్ పరీక్షలో 90 శాతంపైగా మార్కులు సాధించిన చల్లపల్లి శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్ సత్క రించారు. బుధవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రిన్సిపాల్ సురేష్ ఎమ్మెల్యే చేతులమీదుగా బహుమతి ప్రదానం చేశారు. ఆరవ తరగతి విద్యార్థి కొర్రపాటి అభినవ్ తరపున అతని తాతకు గ్రాండ్ ప్రైజ్ లాప్ టాప్ అంద చేశా రు. నాల్గవ తరగతి విద్యార్థి, చల్లపల్లి సీఐ కోవిలపు ఈశ్వ రరావు కుమారుడు కార్తికే య ఎం.టీ.ఎస్.ఓ పరీక్షలో ఫస్ట్ ప్రైజ్ ట్యాబ్ ను ఎమ్మెల్యే చేతులమీదుగా అందు కున్నాడు.



తొమ్మిదవ తరగతి విద్యార్థి గనపరెడ్డి వేద వైష్ణవి, కర్రా బిందుశ్రీ, సిద్దెల శామ్యూల్ రాజ్, బొల్లా పునర్విక, పోతర్లం క సాత్విక, మత్తి తీక్షిక, నిమ్ము మనస్వి, మరీదు తేజేష్, బట్టు హేమవర్షిత, బెల్లపు కొండ నందుశ్రీ బహుమతులు అందుకున్నారు. ప్రిన్సిపాల్ డీ.సురేష్, టీ.ర మ్య, రవి కుమార్, ఎస్తేరు ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# సంగీత స్వరాల గుర్తింపులో 'ఆన్వి' ప్రపంచ రికార్డు గర్జన

ప్రజాభూమి ప్రత్యేక కథనం

**ఒక నిమిషంలో అత్యధిక స్వరాలను గుర్తించి గిన్నిస్ రికార్డు సాధన దిశగా లిటిల్ బ్రెయిన్స్ విద్యార్థిని**

**విజయవాడ గాంధీనగర్ లో ని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం లో ఘనంగా రికార్డు ప్రయత్న వేడుక**

**9 ఏళ్ల వయసు.. 4వ తరగతిలోనే అసాధారణ సంగీత మేధస్సు చాటిన ఆన్వి గుండు**

**దేశానికి, రాష్ట్రానికి గర్వకారణం ముఖ్య అతిథి, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ప్రశంసల జల్లు**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

చిన్న వయస్సులోనే సంగీతంపై అపూర్వమైన పట్టు కనబరుస్తూ, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (ప్రపంచ రికార్డుల పుస్తకం) సాధనే లక్ష్యంగా అడుగులు వేస్తున్న తొమ్మిదేళ్ల బాలిక, చిన్నారి ఆన్వి ప్రతిభ అందరినీ అబ్బురపరిచింది. ఒక నిమి షంలో అత్యధిక సంగీత స్వరాలను (మ్యూజికల్ నోట్స్) గుర్తించడం అనే విభాగంలో ఈ చిన్నారి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధన కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రయత్నించింది. ప్రస్తు తం ఈ విభాగంలో ఉన్న ప్రపంచ రికార్డు 62 సంగీత స్వరాలను గుర్తించడం కాగా, ఆన్వి అంత కంటే ఎక్కువ స్వరాలను క్షణాల వ్యవధిలో అత్యంత వేగంగా గుర్తిస్తూ పాత రికార్డును బద్దలు కొట్టి, తన అసాధారణ మేధస్సును చాటుకుంది.



ఏప్రిల్ 9న విజయవాడలో ఘనంగా రికార్డు వేడుకఈ చారి త్రాత్మక రికార్డు ప్రయత్న కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గాంధీన గర్‌లో ఉన్న వేణిడంట్ల హనుమంతరాయ గ్రంథాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించబడిం ది. స్థానిక 'లిటిల్ బ్రెయిన్స్ స్కూల్' (పాఠశాల)లో 4వ తరగతి చదువుతున్న ఆన్వి గుండు, ఏప్రిల్ 9వ తేదీన ఈ అద్భుత ప్రదర్శన ఇచ్చింది. చిన్నతనం నుంచే లయబద్ధమైన సంగీత జ్ఞానాన్ని, స్వర లయలను అలవర్చుకుని ప్రపంచ రికార్డు స్థాయికి చేరడం పట్ల అక్కడికి వచ్చిన ప్రేక్షకులు, సంగీత విద్వాం సులు, సామాన్య ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తూ చిన్నారిపై ప్రశంసల జల్లు కురి పించారు.

ఆన్వి ప్రతిభ దేశానికే గర్వకారణం: మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు

ఈ అద్భుత కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, విశాఖ పట్నం పూర్వ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు హాజరయ్యారు. చిన్నారి ఆన్వి ప్రదర్శించిన అసాధారణ ప్రతిభను ఆయన స్వయంగా వీక్షించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంత చిన్న వయసులోనే ప్రపంచ రికార్డు స్థాయికి ఎదిగి, తెలుగు రాష్ట్రాలకే కాకుండా దేశానికి మంచి పేరు తీసుకువస్తున్న ఆన్వి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గిన్నిస్ పత్రాన్ని అధికారికంగా అందుకోవాలని ఆకాంక్షించారు.వెల్లువెత్తిన అభినందనలు:సంగీత ప్రపంచంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన చిన్నారి ఆన్విని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, కృష్ణా జిల్లా ప్రముఖులు అభినందించారు. ఈ రికార్డు ప్రయత్న కార్యక్రమంలో పాఠశాల ప్రతినిధులు, చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మరియు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమతి లేనిదే తవ్వకాలు జరగరాదు: కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడుతో కలిసి సంబంధిత అధికారులు,, ఎంపీడీవోలు , పంచాయతీ కార్యదర్శులతో గ్రామ పంచాయతీ చెరువుల అక్రమ తవ్వకాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం గ్రామ పంచాయతీ చెరువులలో విధి విధానాలను అనుస రించి పద్ధతి ప్రకారం పూడిక మట్టి తొలగించడం జరిగిందన్నారు.

ముఖ్యంగా గ్రామపంచాయతీ తీర్మానాలు చేసుకొని ప్రతిపాదనలు పంపిస్తే పూడిక మట్టితీతకు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.చెరువులో పూడిక మట్టిని ముఖ్యంగా చెరువు కట్ట పటిష్ట పరచుటకు ఉపయోగించాలని, మిగిలినది ఏమైనా ఉంటే వేలం వేయాలన్నారు. వచ్చిన మొత్తాన్ని పద్ధతి ప్రకారం ప్రభుత్వ ఖజా నాకు జమ చేయాలన్నారు.ఇటువంటి పద్ధతులను అనుస రించకుండా ఇటీవల కాలంలో కొందరు రాత్రిపూట గ్రామపంచాయతీ చెరువుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా వార్తలు వెలువడుతున్నాయన్నారు. ఇది సరికా దని స్పష్టం చేస్తూ ఇకపై అధికారులందరూ అప్రమత్తంగా ఉండి ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధం గా అక్రమంగా చెరువు మట్టి తవ్వకాలు జరిపితే అందుకు బాధ్యులైన వారి పైన పోలీసులకు ఫిర్యా దు ఇచ్చి ఎఫ్ఐఆర్ నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారుఇకపై గ్రామపంచాయతీలో చెరువు తవ్వకం జరపాలంటే తప్పనిసరిగా గ్రామప గ్రామపంచాయతీ అనుమతి ఉండాలన్నారు. పంచా యితీ అసెస్మెంట్ పంచాయతీకి రావాలన్నారు గృహ నిర్మాణంకు సంబంధించి లేఅవుట్ చదును చేయుటకు చెరువు మట్టి కావలసి వస్తే దానికి కూడా అనుమతి పొంది తవ్వకం చేసుకోవచ్చున్నారు. ఇకపై నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారుజిల్లా ఎస్పీ వీ.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సూచించిన విధంగా చెరువు మట్టి తవ్వకాలు జరిగేలా పర్యవేక్షిస్తామన్నారు ఈ టెలికాన్ఫిడెన్స్ లో డిపిఓ ధనలక్ష్మి, పంచాయతీ రాజ్ ఎస్ ఈ రమణ రావు, డీఎస్పీలు, ఎంపీడీవోలు , డిప్యూటీ ఎంపీడీవోలు ఎస్హెచ్వోలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# చెత్త రాజకీయాలు మానుకోండి

❖ వైసీపీ నేతలపై టీడీపీ శ్రేణుల నిప్పులు చెరుగుడు ❖ క్యాటిల్ డిపోను సందర్శించి పేర్ని నాని, కిట్టు విమర్శలను తిప్పికొట్టిన కూటమి నాయకులురెండేళ్లు బడ్జెట్ పెట్టకుండా మున్సిపాల్టీని ముంచింది మీరే కదా? ❖ కాంట్రాక్టర్లకు బిల్లులు ఎగ్గొట్టి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై బురద జల్లుతారా? ❖ అధికారులను దూషిస్తే సహించేది లేదు: టీడీపీ నగర అధ్యక్షులు లోగిశెట్టి స్వామి ఫైర్



మచిలీపట్నం/ప్రజా భూమి ప్రతినిధి

మచిలీపట్నంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న 'చెత్త' రాజకీయాలపై తెలుగుదేశం పార్టీ నగర శ్రేణులు, మాజీ కార్పొరేటర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టు మున్సిపల్ వ్యవహారాలపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టారు. బుధవారం స్థానిక క్యాటిల్ డిపోను సందర్శించిన టీడీపీ బృందం.. అక్కడ వాహనాలు నిలిచిపోవడానికి గల అసలు కారణాలను మీడియా వేదికగా బహిర్గతం చేసింది.

తప్పు మీది.. బురద మాపైనా?ఈ సందర్భంగా టీడీపీ నగర అధ్యక్షులు లోగిశెట్టి స్వామి, మాజీ కార్పొరేటర్లు సమతా కీర్తి, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ వైసీపీ నేతలపై తీవ్ర విమర్శలు గుప్పిం చారు. చెత్త సేకరణ వాహనాలు ఎందుకు నిలిచిపోయాయో పేర్ని కిట్టు ముందు వాళ్ల నాన్న పేర్ని నానిని అడగాలి. గడిచిన రెండేళ్లుగా మున్సిపాలిటీలో పాలకవర్గంగా ఉండి ఏం చేశారు? మీ పాలకవర్గం రెండేళ్లుగా సకాలంలో బడ్జెట్ పెట్టకపోవడం వల్లే నేడు గుత్తేదారునికి (కాంట్రాక్టర్‌కు) బిల్లులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడింది. గత్యంతరం లేని పరిస్థితుల్లోనే గుత్తే దారు వాహనా లను నడపలేక క్యాటిల్ డిపోకు పరిమి తం చేశారు. తప్పు మీరే చేసి, ఇప్పుడు మా కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం గర్హనీయం.ప్రజా సేవలో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ డీకే బాలాజీవాహనాలు నిలిచిపోయినప్పటికీ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నట్లు నాయకులు తెలిపారు.మున్సిపాలిటీకి చెందిన 18 ట్రాక్టర్ల ద్వారా నగరంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ నిరంతరాయంగా జరుగుతోంది. మంత్రి కొల్లు రవీంద్ర అధికారులతో సమీక్షిస్తూ పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మచిలీపట్నం అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. నగరంలోని బ్లాక్ స్పాట్ లను గుర్తించి, చెత్తను తొలగించి వాటిని గ్రీన్ స్పాట్ లుగా తీర్చిదిద్దుతున్న సమర్థుడైన అధికారిని సైతం పేర్ని నాని దూషించడం వారి అజ్ఞానానికి పరాకాష్ట.వైసీపీ నేతలు ఇప్పటికైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని, లేదంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టీడీపీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఆనంద్, టీడీపీ నాయకులు పీవీ ఫణికుమార్, వంకా వెంకటేశ్వరరావు, మంచాల రాంబాబు, అడపా రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

❖ కార్మికుడు బలపడితే రాష్ట్రం బలపడుతుందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశంలో కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం
❖ కార్మిక సంక్షేమ శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్




ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధిలో కార్మికులు, యాజ మాన్యాన్ని రెండు కళ్లలా భావిస్తూ సమతుల్యంగా ముందుకు సాగుతోందని కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ పేర్కొన్నారు. స్థానిక తుమ్మలపల్లి క్షేత్రయ్య వారి కళా క్షేత్రంలో శ్రమ శక్తి, ఉత్తమ యాజమాన్య పురస్కారాల ప్రధానోత్సవం-2026 కార్యక్రమానికి కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మికుల సంక్షేమం, భద్రత, ఉపాధి, ఆరోగ్యాని కి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఒక కార్మికుడు పని కోసం యాజమాన్యం వద్దకు వెళ్తే తన ప్రాణాలను వారి చేతిలో పెట్టి వెళ్తున్నట్టేనని భావించి, యాజమాన్యాలు పూర్తి భద్రతా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, భవన నిర్మాణ కార్మికులకు అమలులో ఉన్న పథకాలను రద్దు చేసి వారి జీవనోపాధిని దెబ్బతీశారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం “ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” మరి యు “స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్” విధా నాలతో పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తోందన్నారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావడంతో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, కూట మి ప్రభుత్వం ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల హామీ దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని చెప్పారు. భవన నిర్మాణ కార్మికులకు గతంలో నిలిచిపోయిన సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. వివాహ కానుకగా ₹20,000, ప్రసూతి సహాయంగా ₹20,000, సహజ మరణ సహాయంగా ₹60,000, అంత్యక్రియల ఖర్చులకు ₹20,000 అందిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా “లేబర్ అడ్డాస్” ఏర్పాటు చేసి ఉపాధి, విశ్రాంతి, వాష్‌రూమ్, భోజన, శిక్షణ సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. రూ.250 కోట్లతో భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

తిరుపతి, అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలు, విశాఖపట్నంలో ఆధునిక ఈఎస్ఐ ఆసుపత్రుల ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 30 కొత్త ఈఎస్ఐ డిస్పెన్సరీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఫ్యాక్టరీలలో కార్మికుల భద్రత కోసం యూనివర్సిటీలతో ఎంఓయూలు కుదుర్చుకొని థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్లు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరిశ్రమల్లో జీరో యాక్సిడెంట్స్ లక్ష్యంగా ప్రత్యేక భద్రతా చర్యలు అమలు చేయడం జరుగుతుందన్నారు.కార్మికుడు, యాజమాన్యం రెండూ బలోపేతం కావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. సంక్షేమం, నైపుణ్యం, ఉపాధి, ఆరోగ్యం, గౌరవం అనే ఐదు స్తంభాలపై రాష్ట్ర కార్మిక రంగాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందు కున్న కార్మికులు, ఉత్తమ యాజమాన్యాలకు మంత్రి అభినందనలు తెలియజేశారు. మే డే సందర్భంగా ఇవ్వాల్సిన అవార్డులను ఇప్పుడు అందిస్తున్నామని.. ప్రతి కార్మికుడు గౌరవంగా జీవించేలా, ప్రతి కుటుంబం భద్రంగా ఉండేలా, ప్రతి యువకుడికి ఉపాధి లభించే “స్వర్ణాంధ్రప్రదేశ్” నిర్మాణానికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

కార్మికులు, యాజమాన్యాలు ఒకే నాణానికి ఉన్న రెండు పార్శ్వాల వంటి వారని, వీరిద్దరి మధ్య సమన్వయం ఉన్నప్పుడే పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచినకార్మికులకు, ఆదర్శవంతమైన యాజమాన్యాలకు పురస్కారాలను మంత్రి, వివిధ కార్పొరేషన్ ఛైర్మెన్లు, కలెక్టర్లు సంయుక్తంగా అందించారు. కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్లు మరియు ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డిపార్టుమెంట్ కార్యదర్శి ఎమ్. వి. శేషగిరిబాబు మాట్లాడుతూ.. గత సంవత్సర కాలంలో లేబర్ కోడ్స్ (Labour Codes) దృష్ట్యా, డిపార్ట్‌మెంట్ లో అనేక మార్పులను తీసుకురావడం జరిగిందన్నారు. సాఫ్ట్ వేర్ పరంగా, లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు కార్మిక శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ-శ్రమ్ (e-Shram), బీవోసీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలను మరింత విస్తృతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్మిక శాఖ తరపున సంక్షేమ పథకాలను అమలు చేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని కార్యదర్శి శేషగిరి బాబు తెలియజేశారు.

కార్యక్రమంలో ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వి. మల్లిఖార్జున రావు (బాబ్జీ), ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సలహా కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల రఘు రామరాజు, ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు ఉపాధ్యక్షుడు జి. వెంకట శివుడు యాదవ్, 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినాకర్, కార్మిక శాఖ కమిషనర్ గంధం చంద్రుడు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా|| జి. లక్ష్మీశ, తదితరులు పాల్గొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

# వి.ఆర్.పురం మండలంలో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాలు

ప్రజాభూమి ప్రతినిధి-విఆర్.పురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా వి.ఆర్.పురం మండలంలో జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదనీ, ఎంపీడీవో ఇమ్మానియేల్ అన్నారు. జిల్లా కలెక్టర్, పోలవరం జిల్లా వారు మరియు పి.ఓ, ఐటీడీఏ చింతూరు వారి ఆదేశాల మేరకు డి ఎ- జేజి యు ఏ పీఎం - జన్మన్ పథకాలకు సంబంధించిన గ్రామాలలో ఈ నెల19.05.2026 నుండి 25.05.2026 వరకు జన్ భాగీదారి అభియాన్ కార్యక్రమం నిర్వహించవలసినదిగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా మొదటి రోజు బుధవారం వి.ఆర్.పురం మండలం, రామవరం పంచాయతీ పరిధిలోని సోములగూడెం,





రామవరం గ్రామాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. ఇమ్మానుయేల్ అధ్యక్షతన నిర్వహించబడుతున్నది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, మన మండలంలో మొత్తం 12 గ్రామాలలో జన్ భాగీదారి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. "జన్ భాగీదారి" అంటే ప్రజల భాగస్వామ్యం. ప్రభుత్వ కార్యక్రమాలు, నిర్ణయాధికారంలో ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం, జన్ భాగీదారి అభియాన్ జరుగు సమయంలో ప్రజల నుండి స్వీకరించిన ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందనీ అన్నారు. చిన్న ఫిర్యాదులను మండల స్థాయి అధికారులందరి సమక్షంలో ఒక గంటలోపు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. స్వీకరించిన ఫిర్యాదులను వర్గీకరించి, తక్షణ చర్య కోసం ఫాస్ట్ ట్రాక్ పరిష్కార ఛానల్ ద్వారా సంబంధిత శాఖలకు వెంటనే ఫార్వర్డ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కావున ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై తమ సమస్యలకు పరిష్కారం పొందగలరని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కారం లక్ష్మీ, టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ , మండల తహసీల్దార్ వై సరస్వతి, మండల విద్యాశాఖాధికారి, సి.హెచ్.ఓ శ్రీ పవన్ కళ్యాణ్, పెసా ఉపాధ్యక్షులు, కార్యదర్శి గారు, పంచాయతీ కార్యదర్శి గారు, సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి లక్ష్యం

**చించినాడలో 109 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందజేసిన మంత్రి నిమ్మల**

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు . యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ఎనిమిదో విడతలో జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 109 మంది 8, 9,10 తరగతి విద్యార్థినీ విద్యార్థులకు శ్రీ లలితా రైస్ ఇండస్ట్రీ సిఎస్ఆర్ నిధులతో ఉచితంగా సైకిళ్ళను అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మలతోపాటు శ్రీ లలిత రైస్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎం శ్రీనివాస్, ఎం ఆది శంకరులు సైకిల్లను పంపిణీ చేశారు . ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థినీ విద్యార్థులు అందరికీ దాతల సహకారంతో దశలవారీగా ఉచితంగా సైకిళ్లను అందజేయాలనే సంకల్పాన్ని తలపెట్టగా ఇప్పటికే కొన్ని పాఠశాలలకు అందజేయడం జరిగిందన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్టీలో తనకున్న పరిచయాలతో పలు సంస్థల నుంచి సిఎస్ఆర్ నిధులను సైకిళ్లకు ఇచ్చేలా సేకరిస్తున్నానని, అందులో భాగంగానే శ్రీ లలిత రైస్ ఇండస్ట్రీ యాజమాన్యం ముందుకు వచ్చి 19 సైకిలను అందజేసినందుకు శ్రీనివాసు, ఆదిశంకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తాను నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికే నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధిని మంత్రి వివరించారు. ప్రజల కోసం పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, గత ఐదేళ్లు కక్షలు కార్పన్యాలు, విధ్వంసంతో పాలన సాగించిన వైసీపీకి రాష్ట్రంలో స్థానం లేకుండా చేయాలని ప్రజలను కోరారు. సందర్భంగా శ్రీనివాస్ ఆదిశంకర్లను సత్కరించారు. విద్యార్థినీ విద్యార్థులతో కలిసి మంత్రి నిమ్మల స్వయంగా సైకిల్ తొక్కుతూ అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, రైస్ మిల్లర్ బంగారు కృష్ణ బాబు, నాయకులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, మామిడిశెట్టి పెద్దిరాజు , ఉన్నమట్ల కబర్ది, తులా రామలింగేశ్వరరావు , జనసేన దొరబాబు, బొప్పన హరి కిషోర్, పీతల శ్రీనివాస్, ఆదిమిల్లి రామ శ్రీనివాస్, ఏ ఊరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే, ఆన్లైన్ డేటా ఎంట్రీ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిదియా దేవి**

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

క్షేత్రస్థాయిలో ప్రగతిని మెరుగుపరచడానికి వీలుగా ప్రతి మండలంలోనూ రోజువారీ, వారపు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలని, తాసిల్దార్లు కూడా తరచుగా సమీక్షలు నిర్వహించి ఆశించిన పురోగతిని సాధించాలని ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోశీ నిధియా దేవి హెచ్చరించారు. బుధవారం జిల్లావ్యాప్తంగా భూముల రీ సర్వే పురోగతి కార్య క్రమాలు, దశలవారీ నిర్వహణ ఆన్లైన్ డేటా ఎంట్రీ అంశాలపై డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోమ్ నిదియా దేవి, స్థానిక కలెక్టరేట్ నందు జిల్లాలోని డి. ఆర్. ఓ, ఆర్. డి.వో లు, తాహసిల్దార్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, భూ రీ-సర్వే ప్రాజెక్టును ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, నిర్దేశి త గడువులోగా అన్ని దశలను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా ఆమె తాహసిల్దార్లతో ప్రక్రియ దశల న్నింటి పై నిశితంగా సమీక్షించి ప్రతివారం పురోగతిని సాధించాలని స్పష్టం చేశారు.జిల్లాలోని అన్ని మండలాల్లో రీ-సర్వే ప్రక్రియ ఏ దశలో ఉందనే అంశంపై జాయింట్ కలెక్టర్ గ్రామాల వారీగా క్షుణ్ణంగా సమీక్షించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో తదుపరి ప్రక్రియను త్వరి తగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కేవైసీ తప్పిదాలు సరిచేసి రాజముద్ర క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలన్నారు. రీ-సర్వేకు సంబంధించి వెబ్ ల్యాండ్ ఇతర అధికారిక పోర్టల్స్లో డేటా ఎంట్రీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తాసిల్దార్లకు స్పష్టం చేశారు. ఎంట్రీలలో ఎటువంటి తప్పులకు తావులేకుండా నిక్కచ్చిగా రికార్డులను నమోదు చేయాలన్నారు.అందరికీ ఇల్లు కార్యక్రమాన్ని వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు నివేశన స్థలాలు మంజూరు చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపుతూ సర్వే నిర్వహణలో తలెత్తు తున్న సాంకేతిక లోపాలను, సరిహద్దు వివాదాలను రెవెన్యూ, సర్వే సిబ్బంది సమన్వయంతో తక్షణమే పరిష్కరించుకోవాలని సూచించారు. రీ సర్వే పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగవంతంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు.సమీక్ష సందర్భంగా డిఆర్ఓ వి సుబ్బారావు ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఒక గ్రామం ఒక నెలలో నాలుగు పర్యాయాలు పర్యటనను రద్దు చేసి దానికి బదులుగా ఒక నెలలో ఒక పర్యాయం ఒక నియోజకవర్గంలో ఒకరోజు జిల్లా కలెక్టర్ వారు సంబంధిత ఎమ్మెల్యే వారు పర్యటిస్తారని ఆయన స్పష్టం చేశారు. పట్టాదారు పాస్ పుస్తకాలు జూన్ నెలకి సంబంధించి రాజోలు మండలంలో కూనవరం, రామచంద్రపురం మండలంలో భీమ్రాక్రోసు పాలెం మల్కిపురం మండలంలో మట్టపర్రు గ్రామాలలో పంపిణీ చేస్తారన్నారు. ప్రతి మండలంలో చేపట్టిన రీ సర్వే పనుల స్థితిగతులు, గ్రామాల వారీగా సాధించిన పురోగతి, డేటా ఎంట్రీలో ఎదురవుతున్న సమ స్యలు, వాటి పరిష్కా ర చర్యలు, తదుపరి దశల్లో అనుసరించాల్సిన కార్యా చరణపై విపులంగా తాహసిల్దార్లకు వివరిం చారు. భూ సంబంధిత సేవలు ప్రజలకు త్వరిత గతిన అందేలా రెవె న్యూ అధికారులు సమన్వయం తో పనిచేయాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావు లేకుండా క్షేత్రస్థాయి లో పరిశీలన చేయాలని, ఆన్లైన్ డేటా ఎంట్రీను నిర్దిష్ట సమ యంలో పూర్తి చేయాలని, పెండింగ్ అంశాలను ప్రాధాన్యక్రమంలో పరిష్క రించాలని పేర్కొన్నారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా అధికారులు బాధ్యతతో, నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో ఏ సరళావతి, సర్వే ఉ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు కే. ప్రభాకర్ 19 మండలాల తాహసిల్దార్లు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఇంటర్ సప్లమెంటరీ ఎగ్జామినేషన్ సెంటర్లు ఆర్డీవో పరిశీలన

ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ ఎగ్జామినేషన్ సెంటర్లను రామచంద్రపురం ఆర్డీవో ఏసర్లదీవి తనిఖీ చేసి కనీస వసతులు ఉన్నవో లేదో స్వయంగా ఆమె పరిశీలించారు. ఈ మేరకు బుధవారం నేటినుంచి జరగనున్న పరీక్ష సమయంలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వంకు జరుగుతుందని, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కి మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.30 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలియజేశారు. పరీక్షలకు హాజరు అయ్యే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందే హాజరుకావాలని ఆర్డీవో సరళాదేవి సూచించారు. ముఖ్యంగా వేసవి దృష్ట్యా విద్యార్థులకు పరీక్ష కేంద్రం నందు మంచినీరు ఏర్పాటు చేయడమైనదాని, క్లాస్ పరీక్ష రూమ్ నందు ఫ్యాన్లు , లైట్స్ సదుపాయం తనిఖీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించాలని విద్యార్థులకు వడగాల్పులు తగలకుండా ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు పెట్టాలని మెడికల్ డిపార్ట్మెంట్ ని ఆదేశించినట్లు పేర్కొన్నారు. రామచంద్రపురం మండలం నందు వికాస్ జూనియర్ కళాశాల నందు సుమారు 62 మంది విద్యార్థులు ,నారాయణ జూనియర్ కాలేజ్ నందు 63 మంది విద్యార్థులు , కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల నందు 154 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉంది అన్నారు. గవర్నమెంట్ జూనియర్ కళాశాల, పామర్రు నందు 121 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉందని ఈసంధర్భంగా తెలియజేసారు..



# వివాహిత మరణానికి కారణమైన వ్యక్తికి రిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం..

పోలవరం మండలంలోని 17.05.2026 వ తేదిన టేకులబోరు గ్రామంలో ఉంటున్న బొడ్డు సంధ్య భర్త అఖిల్ అను ఆమె తన భర్త పెట్టె వేదింపులు భరించలేక ఉరి వేసుకుని చనిపోయిన ఘటనలో 20.05.2026 వ తేదిన పై అధికారుల సూచనల మేరకు కూనవరం ఇంచార్జ్ ఎస్ఐ షేక్ సాదిక్ పోలీస్ స్టేషన్ వారు క్రైమ్ నెంబర్.20/2026, యు/ఎస్ 85, 108 ఏ బీ ఎస్ యాక్ట్ కేసులో సిబ్బందితో కలిసి బొడ్డు అఖిల్ ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపడం జరిగింది.ఆత్మహత్యలు శరణ్యం కాదు భర్త లేదా అత్తారింట్లో వేధింపులు మితిమీరినప్పుడు ఉంటే ధైర్యంగా పోలీసులను ఆశ్రయించండి.ఇటీవల కాలంలో చిన్న చిన్న వివాదాలకే తీవ్ర మనస్తాపానికి గురై, ప్రాణాలు తీసుకుంటున్న ఘటనలపై అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో మహిళలు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం నివారించడానికి, ప్రభుత్వం తీసుకుంటున్న నివారణా చర్యల లో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు, ఉన్నతాధికారులైన డిజిపి. అశోక్ కుమార్, పోలవరం జిల్లా ఎస్ పి అమిత్ బర్దర్ సూచనల మేరకు, పంకజ్ కుమార్ మీనా, ఓ ఎస్ డి బి. హేమంత్ ఏ.ఎస్.పి , చింతూరు పర్యవేక్షణలో వివాహ బంధంలో సమస్యలు, భర్త లేదా అత్తమామల నుండి ఎదురయ్యే మానసిక, శారీరక వేధింపుల కారణంగా మహిళలు క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత విచారకరం. ఆత్మహత్య అనేది దేనికీ పరిష్కారం కాదని, వేధింపులను ఎదుర్కొనేందుకు చట్టం అండగా ఉందని పోలీసులు మరియు మహిళా సంక్షేమ సంఘాలు స్పష్టం చేశాయి.చనిపోవడం వల్ల సమస్య తీరదు సరికదా, మిమ్మల్ని నమ్ముకున్న తల్లిదండ్రులు, పిల్లల జీవితాలు రోడ్డున పడతాయని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.పోలీసులకు ఫిర్యాదు చేయండి: భర్త లేదా అత్తారింట్లో వేధింపులు మితిమీరినప్పుడు, ప్రాణాలు తీసుకోవాలనే ఆలోచన పక్కన పెట్టి, ధైర్యంగా స్థానిక పోలీస్ స్టేషన్లో గానీ లేదా మహిళా పోలీస్ స్టేషన్ (షీ టీం) లో గానీ, మహిళా పోలీసులులకు గానీ ఫిర్యాదు చేయాలి. రక్షణగా నిలిచే చట్టాలు మహిళల రక్షణ కోసం ప్రభుత్వం కఠినమైన చట్టాలను తీసుకువచ్చింది. భర్త లేదా వారి కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేస్తే చట్టపరంగా వారిని శిక్షించే అవకాశం ఉంది.ఉచిత హెల్ప్లైన్ నంబర్లు: అత్యవసర సమయాల్లో మహిళలు తక్షణ సహాయం కోసం 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చు. పోలీసులు తక్షణమే స్పందించి రక్షణ కల్పిస్తారు.కౌన్సిలింగ్ కేంద్రాలు సమస్యలను పరిష్కరించుకోవడానికి పోలీసు శాఖ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత కౌన్సిలింగ్ కేంద్రాలు నడుస్తున్నాయి. ఇక్కడ నిపుణుల ద్వారా ఇరు పక్షాలకూ కౌన్సిలింగ్ ఇప్పించి సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించుకోవచ్చు. మహిళలారా! మీ ప్రాణం చాలా విలువైనది. వేధింపులకు భయపడి వెనకడుగు వేయకండి. చట్టాన్ని నమ్మండి, పోలీసుల సహాయం తీసుకోండి. న్యాయం కోసం పోరాడాలే తప్ప, ప్రాణాలు వదిలి నేరస్థులకు అవకాశం ఇవ్వకండి అని స్థానిక ఇన్చార్జ్ ఎస్ఐ షేక్ షాదిక్ తెలియజేశారు.



## స్వచ్ఛ పదం లక్ష్య సాధనలో ప్రతి గ్రామం భాగస్వామ్యం

**తడి-పొడి చెత్త వేర్వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన**

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం గా ప్రతి బుధవారం నిర్వహిస్తున్న "స్వచ్ఛ పదం" కార్యక్రమాన్ని ఆగిరిపల్లి మండల వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి రహదారుల ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను కొంతమేరకు తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మి కులు మరియు హరిత రాయబారులకు అందించాలని గ్రామ స్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్హెచ్జీ సభ్యులు, ఉపాధి హామీ పథకం వేజ్ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొని పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు సూచనలు చేశారు. అమ్మవారిగూడెం గ్రామ పంచాయతీలో ఐవీఆర్ఎస్ తరగతుల ద్వారా సామూహిక అవగాహన కార్యక్రమం నిర్వహించగా, అడవి నెక్కలం గ్రామంలో ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమం చేపట్టి రోడ్లకు ఇరువైపులా చెత్తను కొంతమేరకు తొలగించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ సలాం, డిప్యూటీ ఎంపీడీవో ఆనంద్ బాబు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అమ్మకాలపై వ్యవసాయశాఖ నిఘా

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



మండల వ్యవసాయాధికారి జె. భవాని బుధవారం ఈదర, శోభనాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (ప్యాక్స్)తో పాటు ఆగిరిపల్లిలోని రీటైల్ ఎరువుల దుకాణాల్లో యూరియా అమ్మకాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. యూరియా దుర్వినియోగం జరగకుండా ప్యాక్స్లు, రీటైల్ డీలర్లకు స్టాప్ సేల్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వ్యవసా యశాఖ సిఫారసు చేసిన విధానంలో అత్యవసర అవసరమున్న రైతులకు మాత్రమే యూరియా విక్రయాలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ప్యాక్స్లలో 56.075 టన్నులు, రీటైల్ డీలర్ల వద్ద 133.880 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

ఎండలు మండుతున్నాయి, మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మండల తహసీల్దార్ వై సరస్వతి కోరగా, ఈమేరకు వీఆర్వో భవాని, వడ్డిగూడెం పంచాయతీ విఆర్ పురం, ధర్మాటాళ్లగూడెం, వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, బీసీ కాలనీ గ్రామాలలో బుధవారం మైక్ తో ప్రచారం నిర్వహించారు. ఈ రోజు బుధవారం 20వ తేదీ నుండి, 26వ తేదీ వరకు తీవ్రమైన ఎండలు కాస్తాయని, ప్రతి రోజు ఉదయం పది గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తరువాతే బయటకు వెళ్లాలని మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్యంగా పెరిగిన అడ్మిషన్లు.




ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

కాజులూరు కాంప్లెక్స్ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు అనూహ్యంగా పెరిగినట్లు కాజులూరు కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి పేర్కొన్నారు. మేరకు బుధవారం కాజులూరు మండలం కాజులూరు కాంప్లెక్స్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి అధ్యక్షతన జిల్లా విద్యా శాఖాధికారి పి. రమేష్ ఆదేశాల ప్రకారం మండల విద్యాశాఖాధికారులు డి. డేవిడ్, పి. జాన్ ల మార్గదర్శకత్వంలో కాజులూరు కాంప్లెక్స్ పరిధిలో గల అన్ని ప్రభుత్వ పాఠశాలలను సమన్వయం చేసుకొంటూ వేసుకున్న ప్రణాళిక సత్ఫలితాలను ఇవ్వడం ప్రారంభమైందని అన్నారు. ప్రతిరోజూ కమిషనర్ అందజేస్తున్న సూచనలను తూచా తప్పకుండా పాటిస్తూ కాంప్లెక్స్ పరిధిలో గల ఆవాస ప్రాంతాలను ఉపాధ్యాయులు సందర్శించి ప్రభుత్వం విద్యార్థినీ, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలైన సర్వేపల్లి రాధాకృష్ణ విద్యమిత్ర కిట్స్ కోసం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న విజయాలు తదితర విషయాలను తల్లిదండ్రులకు వివరించి ఆయా ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించమని కోరడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సూచనలు సలహాలు మేరకు ఉప్పొంగిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడానికి అంగీకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యాచరణలోనూ, ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో పాల్గొన్నవారిలో కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ దుర్గారావు, చింతా నారాయణ మూర్తి, మారిశెట్టి శ్రీరామచంద్రమూర్తి, త్రిమూర్తులు, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.


## మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఎండలు మండుతున్నాయి, మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మండల తహసీల్దార్ వై సరస్వతి కోరగా, ఈమేరకు వీఆర్వో భవాని, వడ్డిగూడెం పంచాయతీ విఆర్ పురం, ధర్మాటాళ్లగూడెం, వడ్డిగూడెం, వడ్డిగూడెం కాలనీ, బీసీ కాలనీ గ్రామాలలో బుధవారం మైక్ తో ప్రచారం నిర్వహించారు. ఈ రోజు బుధవారం 20వ తేదీ నుండి, 26వ తేదీ వరకు తీవ్రమైన ఎండలు కాస్తాయని, ప్రతి రోజు ఉదయం పది గంటల లోపు, సాయంత్రం నాలుగు గంటల తరువాతే బయటకు వెళ్లాలని మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు.




## జనగణన హౌస్ లిస్టింగ్ ప్రక్రియ తుది దశకు

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



జనగణన తొలి దశలో భాగమైన హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్ మండలంలో 95 శాతం పూర్తయ్యాయని సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, ఆగిరిపల్లి తహసీల్దార్ పి.ఎన్.వి. ప్రసాద్ తెలిపారు. మరో ఒక రోజులో ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో ముగియనున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సమాచార సేకరణను సమయపాలనతో నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఇంటి వివరాలను ఖచ్చితత్వంతో నమోదు చేసేలా సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. జనగణన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు.

## బైక్ దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

### –రూ.2.50 లక్షల విలువైన నాలుగు మోటార్ సైకిళ్లు స్వాధీనం



ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సగ్గూరు గ్రామంలో జరిగిన బైక్ దొంగతనం కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సగ్గూరు గ్రామానికి చెందిన యలమర్తి పుల్లయ్య ఇంటి ముందు ఉంచిన బైక్ దొంగిలించబడినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆగిరిపల్లి ఎస్ఐ కె. శుభ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను విశ్లేషించిన పోలీసులు పోతర్లంక చరణ్ (సగ్గూరు), షేక్ ఇమ్రాన్ (కొత్త సురవరం), మారెళ్ళ నాగసాయి (ఆత్కూరు, ఉంగుటూరు మండలం)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సగ్గూరులో దొంగిలించిన బైక్‌తో పాటు హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి, గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు బైకులు కలిపి మొత్తం సుమారు రూ. 2.50 లక్షల విలువైన నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించగా, కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఎస్ఐ కె. శుభ శేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి మండల పరిధిలో ఎవరైనా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నీతీ ఆయోగ్ డెల్టా ర్యాంకింగ్స్ జోన్ 3 పరిధిలో మారేడుమిల్లికి తొలి స్థానం

### పోలవరం జిల్లాకు గర్వకారణం

### అన్ని మండలాల్లో లక్ష్య సాధనకు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి–మారేడుమిల్లి



నీతీ ఆయోగ్ విడుదల చేసిన ఆశావహ బ్లాకుల కార్యక్రమం డెల్టా ర్యాంకింగ్స్‌లో దక్షిణ భారత జోన్–3 పరిధిలో మారేడుమిల్లి బ్లాక్ తొలి స్థానంలో నిలవడం పోలవరం జిల్లాకు గర్వకారణమని జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ తెలిపారు. అక్టోబర్ – డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన ఈ ర్యాంకింగ్స్‌లో మారేడుమిల్లి అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పోలవరం జిల్లాకు ఈ అవార్డు మరింత బాధ్యత ను పెంచిందన్నారు. ఈ గుర్తింపును నిలబెట్టుకుంటూ జిల్లాలోని అన్ని మండలాల్లో అభివృద్ధి సూచీల సాధన కోసం అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం, పోషణ, వ్యవసాయం, మౌలిక వసతులు, సామాజిక అభివృద్ధి వంటి రంగాల్లో ప్రభుత్వ పథకాల అమలును మరింత సమర్థవంతంగా చేపట్టి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలో క్షేత్రస్థాయిలో కృషి చేసిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి శిరమయ్య



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం

సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్ళి ప్రజల పక్షాన నిలబడి, సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసిన వ్యక్తి మాజీ ఎంపిపి కారం.శిరమయ్య అని, సిపిఎం జిల్లా నాయకులు సున్నం రాజులు అన్నారు. బుధవారం మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామంలో ఎంపి టిసి పూనెం.ప్రతీఫ్ కుమార్ అధ్యక్షతన మాజీ ఎంపిపి కారం.శిరమయ్య 5.వ వర్ధంతి సభ ను నిర్వహించారు. సభలో సున్నం రాజులు పాల్గొని మాట్లాడుతూ శిరమయ్య తన జీవిత కాలంలో ప్రజల కోసం చేసిన సేవలను గుర్తు చేశారు. వి.ఆర్.పురం మండలంలో సిపిఎం పార్టీ విస్తరణకు శిరమయ్య చేసిన త్యాగాలు, పోరాటాలు మరవలేనివన్నారు. నేటి తరం యువత పార్టీ కోసం, ప్రజల కోసం తమ జీవితాలను అర్పించిన అమరులను ఆదర్శం గా తీసుకొని పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం.లక్ష్మి, సిపి ఎం మండల కార్యదర్శి పులి.సంతోష్ కుమా ర్, మండల నాయకులు పంకు.సత్తిబాబు, కారం.సుందరయ్య, వద్లాది.రమేష్, గుండిపు డి.లక్ష్మణ్ రావు, మాజీ కో.ఆప్షన్ సభ్యులు ఎస్.కె.ఇబ్రహీం, సిపిఎం చిన్నమట్టపల్లి శాఖ కార్యాదర్శి కారం.నర్సయ్య, మొట్టుం.గం గరాజు, శిరమయ్య సతీమణి కారం.ముత్తమ్మ, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు పాల్గొన్నారు.

## డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### రామచంద్రపురం ఆర్డీవో సరళవతి




ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

రానున్న ఐదు రోజుల్లో డివిజన్ పరిధిలో అధిక ఉష్ణోగ్రతలుతోపాటు ఉక్కపోత తీవ్రతరంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని రెవిన్యూ డివిజనల్ అధికారి, ఏ సరళావతి రామచంద్రపురం డివిజన్ పరిధిలో ప్రజలకు సూచించారు. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన ప్రత్యేక హీట్ వేవ్ బులెటిన్ ప్రకారం ఈనెల 20వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు కోనసీమ జిల్లాతో పాటు రాష్ట్రంలోని తీర ప్రాంత జిల్లాల్లో ఉక్కపోత తీవ్రత విపరీతంగా పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్య రక్షణకై మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయవద్దని ముఖ్యంగా ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఎండ తీవ్రత గరిష్టంగా ఉంటుందన్నారు. కాబట్టి అత్యవసర పరిస్థి తులు తప్ప ఆ సమయం లో ఎవరూ బయటకు రాకూడదన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు మరియు దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఎండల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దాహం వేయక పోయినా ప్రజలు తగినంత నీరు త్రాగాలని. లవణాల సమతుల్యత కోసం మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరినీళ్లు, ఓఆర్ఎస్ వంటి ద్రవాలను ఎక్కువగా తీసుకోవాలన్నా రు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సివస్తే గొడుగు, టోపీ ధరించాలి లేదా తడి గుడ్డతో తలను కప్పుకోవాలన్నారు. శరీరానికి గాలి తగిలేలా పలుచని, లేత రంగు పత్తి కాటన్ దుస్తులు ధరించడం ఉత్తమమన్నా రు.?కార్మికులు, రైతులకు సూచనలు చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కూలీలు, రైతులు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో పనుల వేగాన్ని తగ్గించుకోవాలన్నారు. మధ్య మధ్యలో నీడన విరామం తీసుకుంటూ పనులు చేసుకోవా లన్నారు..తీవ్రమైన తలనొప్పి, నీరసం, తల తిరగడం, వాంతులు కావడం లేదా స్పృహ తప్పడం వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సమీ పంలోని ప్రభుత్వ వైద్యు లను సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగంలోనూ రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ పంటలకు అవసరమైన మేర నీరం దిస్తూ, భూమిలో తేమ శాతం తగ్గకుండా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారని పేర్కొన్నారు.ప్రజ లందరూ ఈ హెచ్చరికలను గమనించి, స్వీయ రక్షణ చర్యలు పాటించడం ద్వారా ఎండల బారిన పడకుండా సురక్షితంగా ఉండాలని సరళావతి కోరారు.

## యు కొత్తపల్లిలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ బుధవారం యు.కొత్తపల్లి మండలంలో ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు పురోగతిని క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ తొలుత నాగులపల్లి సీపిడబ్ల్యు స్కీమ్ పనులను.. గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికా రులతో కలిసి పరిశీలించారు. యు.కొత్తపల్లి మండలంలోని 52 ఆవాస ప్రాంతాలకు తాగునీరు సదుపాయం అందించే నాగులపల్లి సిపిడబ్ల్యు స్కీం వద్ద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ యు.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఓపి రిజిస్ట్రేషన్, ఇన్ పేషంట్, ఔట్ పేషెంట్స్ వివరాలు, ఇతర



వార్డులను, సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేశారు. వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన వారితో మాట్లాడి ఆసుపత్రి ద్వారా అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పీహెచ్సికి వైద్యసేవలు నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యశాల అందించాలన్నారు. ఆసుపత్రిలోని పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచాలని, ఎక్కడ ఎటువంటి చెత్త, అపరిశుభ్రంగా లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని జిల్లా కలెక్టర్ వైద్య అధికారులను ఆదేశించారు. ఎక్కువ సమయం వేచి ఉండకుండా సకాలంలో మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కుతుకుదుమిల్లి, వాకతిప్ప స్వర్ణ గ్రామమం కార్యాలయాన్ని సందర్శించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి, వివరాలు ఆరా తీశారు. సిబ్బందితో మాట్లాడి గ్రామ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందిస్తున్న తీరని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలపై ప్రజలకు నమ్మకం కల్పించేలా సిబ్బంది ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశించారు. అనంతరం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ లో ఉన్న స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ పనులను, వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అక్కడ ఉన్న జనగణన సిబ్బందితో మాట్లాడి పారదర్శకంగా ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అమీనాబాద్ ఫిషింగ్ హార్బన్ ను జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న వివిధ



ప్రదేశాలను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మత్స్యకారులతో మాట్లాడి వేట నిషేధ కాలంలో సముద్రంపై వేటకు వెళ్ళవద్దని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట యు.కొత్తపల్లి తహసీల్దార్ జి.చిన్నారావు, ఎంపీడీవో లక్ష్మి రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ డీఈ డి. శ్రీనివాసరావు, జేఈ జీవీ.రమణారావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్ననాటి మిత్రులకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం..!

ప్రజా భూమి ప్రతినిధి–చంద్రగిరి

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరం తమతో పాటు, పదోతరగతి చదువుకొని ప్రస్తుతం ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న, గుండ్లపల్లిలోని సుబ్రహ్మణ్యం శెట్టి,పదిపుట్లబైలు పంచాయతీ పెరుమాళ్లగుడిపల్లి లోని సురేంద్రను బుధవారం పూర్వ విద్యార్థుల బృందం ప్రతినిధులు కలిసి ఆత్మీయతను పంచుకున్నారు. తమ సంఘీభావాన్ని తెలియజేయడంతో పాటు వైద్య ఖర్చుల నిమిత్తం కొంత ఆర్థిక సాయాన్ని వారికి అందజేశారు. చాలా కాలం తరువాత చిన్ననాటి మిత్రులు కలవడం ఆనందంగా ఉందని మిత్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సమన్వయకర్త పత్తిపాటి దేవరాజులు నాయుడు, ప్రతినిధులు వలపల సుధాకర్



నాయుడు,మధుసూదన్,విజయకుమార్,కరుణాకర్ రెడ్డి, బాబ్జీ, అయూబ్, తదితరులు పాల్గొన్నారు.

## హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్

- ప్రపంచ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు విశిష్ట స్థానం కల్పించే మహత్తర ఉద్య మం
- దేశీయ పర్యాటకాభివృద్ధితో ఆర్థిక పురోగతి – ఉపాధి విస్తరణ – సాంస్కృతిక వైభవ ప్రాచుర్యమే లక్ష్యం
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక , సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్

ప్రజా భూమి ప్రతినిధి–అమరావతి




ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యుత్తమ పర్యాటక గమ్యస్థానంగా, భవిష్యత్తులో ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" పేరుతో ఏడాది పాటు కొనసాగే సమగ్ర పర్యాటక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక ఒ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కందుల దుర్గేష్ తెలిపారు. ఇది కేవలం ప్రచార కార్యక్రమం మాత్రమే కాకుండా, రాష్ట్ర పర్యాటక రంగానికి నూతన దిశానిర్దేశం చేసే ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోనుందని మంత్రి స్పష్టం చేశారు. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక భవిష్యత్తుకు పునాది వేసే మహత్తర యత్నమన్నారు. ప్రభుత్వం, భాగస్వామ్య వర్గాలు, ప్రజలు అందరూ కలిసి కట్టుగా పనిచేస్తే ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా నిలబెట్టగలం అనే సంపూర్ణ విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రి కేయులతో మాట్లాడుతూ మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరియు అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో ఇంధన పొదుపు, విదేశీ పర్యటనల నియంత్రణతో పాటు దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయాలని గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన పిలుపు ఎంతో సమయోచితమని పేర్కొన్నారు. పర్యాటక పరంగా విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య ఏడాది ఏడాదికీ పెరుగుతుండగా, విదేశీ పర్యాటకులు భారతదేశానికి వచ్చే సంఖ్య తక్కువగా ఉండటం వల్ల దేశ సంపద విదేశాలకు వెళ్తోందన్నారు. ముఖ్యంగా వివాహ వేడుకలు, విశ్రాంతి పర్యటనలు, వినోద యాత్రల కోసం భారతీయులు విదేశాలకు అధికంగా వెళ్తున్నారని, ఆ ధోరణిని మార్చి దేశీయ పర్యాటకాన్ని ప్రజాదరణ పొందేలా చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసి "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని విశిష్ట పర్యాటక ప్రదేశాలను దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేయడంతో పాటు దేశీయ పర్యాటకులను ఆకర్షించే కార్యాచరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని గండికోట వంటి "భారతదేశ గ్రాండ్ క్యానియన్"గా గుర్తింపు పొందిన ప్రదేశం నుంచి విశాఖపట్నం సముద్రతీర సౌందర్యం వరకు, అమరావతి ఆధ్యాత్మిక వైభవం నుంచి తిరుపతి భక్తి పర్యాటకం వరకు, మన్యం ప్రాంతాల సహజ అందాలు నుంచి గోదావరి–కృష్ణా–పెన్నా నదీ పరివాహక ప్రాంతాల సాంస్కృతిక సంపద వరకు ఆంధ్రప్రదేశ్ అపారమైన పర్యాటక సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి పేర్కొన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు వస్తున్నప్పటికీ, శ్రీశైలం, పంచారామాలు, నవ వైష్ణవ క్షేత్రాలు వంటి అనేక ఆధ్యాత్మిక క్షేత్రాలను సమగ్ర యాత్రా మార్గాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం సమగ్ర పర్యాటక వలయాల నమూనాను అమలు చేస్తామని తెలిపారు. అదేవిధంగా గమ్యస్థాన వివాహాల రంగంలో ఆంధ్రప్రదేశ్‌కు అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. తిరుపతి, అరకు లోయ, విశాఖపట్నం సముద్రతీరాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో వివాహ వేడుకలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి సమావేశాలు, పెట్టుబడి సదస్సులు, వ్యాపార సమావేశాలకు అనుకూలంగా సమావేశ–ప్రదర్శన కేంద్రాలను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని వ్యాపార–పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన తెలుగు ప్రజలు రాష్ట్ర పర్యాటకాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రతి ప్రవాస తెలుగు కుటుంబం కనీసం ఐదు విదేశీ కుటుంబాలను ఆంధ్రప్రదేశ్ పర్యటనకు ఆహ్వానించినా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విశేష బలం చేకూరుతుందని, ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పర్యాటక విధానంలో భాగంగా పలు పర్యాటక వలయాలను రూపొందించిందని, వసతి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాదిలోనే 42 హోటల్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి దాదాపు 9,500 కొత్త గదుల సామర్థ్యాన్ని కల్పించే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. సాహస పర్యాటకం, సముద్రతీర పర్యాటకం, అనుభూతి కేంద్రాలు వంటి రంగాల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. విశాఖపట్నం, చీరాల వంటి ప్రాంతాల్లో కొత్త సాహస క్రీడా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. విమాన, రైలు, రహదారి, జలమార్గ అనుసంధాన పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ స్థితిలో ఉందని మంత్రి స్పష్టం చేశారు. విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, కర్నూలు, కడప విమానాశ్రయాలతో పాటు త్వరలో గుంటూరు సమీపంలో భారీ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి చెందుతోందన్నారు. పర్యాటకుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంటూ, ఆలయాలు మరియు పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలను గణనీయంగా పెంపొందించామని తెలిపారు. సేవల నాణ్యతను ఆధునీకరిస్తూ పర్యాటకులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన అనుభవాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అంతకు ముందు రాష్ట్ర సచివాలయంలో హోటల్ సంఘాలు, పర్యాటక నిర్వహణ సంస్థలు, వినోద పార్కుల నిర్వాహకులు, వివాహ వేడుకల ప్రణాళికకర్తలు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు మరియు ఇతర భాగస్వామ్య వర్గాలతో విస్తృత స్థాయిలో సమావేశం నిర్వహించడం జరిగిందని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న భాగస్వామ్య వర్గాలు ప్రభుత్వ కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చాయని మంత్రి వెల్లడించారు. హోటల్ యాజమాన్యాలు ప్రత్యేక రాయితీ ధరలు ప్రకటించేందుకు సిద్ధమయ్యాయని, పర్యాటక నిర్వహణ సంస్థలు వివిధ ప్రాంతాలను అనుసంధానించే ప్రత్యేక యాత్రా ప్యాకేజీల రూపకల్పనపై ముందుకు వచ్చాయని తెలిపారు. ఒకరోజు పర్యటనకు వచ్చే సందర్శకులను రెండు––మూడు రోజులపాటు రాష్ట్రంలోనే ఉండేలా ఆకర్షణీయ కార్యక్రమాలు రూపొందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ మధ్యప్రాచ్య మరియు అంతర్జాతీయ సంక్షోభాల నేపథ్యంలో గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు విదేశీ పర్యటనలను తగ్గించి దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. విదేశీ మారకద్రవ్య పొదుపుతో పాటు దేశీయ ఉపాధి అవకాశాలు పెంపొందించడమే దీని లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది భారత్‌కు 90 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, 3.4 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళ్లిన విషయాన్ని ఆయన వెల్లడిచేస్తూ ముఖ్యంగా గమ్యస్థాన వివాహాల కోసం విదేశాలకు వెళ్లే ధోరణిని మార్చాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఈ నేపథ్యంలో "హాలిడే ఇన్ ఆంధ్రప్రదేశ్" పేరుతో ఏడాది పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలను ప్రోత్సహించి, దేశీయ పర్యాటకులను ఆకర్షించేందుకు సమగ్ర కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై నిర్వహించిన భాగస్వామ్య వర్గాల సమావేశంలో హోటల్ యాజమాన్యాలు, ప్రయాణ నిర్వహకులు, వివాహ వేడుకల ప్రణాళికకర్తలు, సామాజిక మాధ్యమ ప్రభావశీలులు తదితర రంగాలకు చెందిన ప్రతినిధులు దాదాపు 200 మంది ప్రత్యక్ష మరియు వర్చువల్ విధానంలో పాల్గొని తమ విలువైన సూచనలు అందజేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఇన్‌ఛార్జ్ మేనేజింగ్ డైరెక్టర్ పద్మావతి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.